కొండవీటి రెడ్డిరాజులు

ఈమని శివనాగిరెడ్డి



రెడ్డి సేవా సమితి, కడప

2010

C

ఏడు తలల నాగరాజు, పుట్టకోట

శిథిల నరసింహస్వామి ఆలయం, కొండవీటికోట (కొండపైన)

కొండవీటి రెడ్డిరాజులు

ఈమని శివనాగిరెడ్డి

ప్రచురణ :

రెడ్డి సేవా సమితి

రాజీవ్ మార్గ్, కడప - 516 004.

Kondaveeti Reddy Rajulu

కొండవీటి రెడ్డి రాజులు

– ఈమని శివనాగిరెడ్డి

తొలి ముద్రణ : 2001

మలి ముద్రణ : 2002

మూడో ముద్రణ : 2010

కాపీలు : 3000

వెల : **రూ. 40.00**

© రెడ్డి సేవా సమితి, కడప.

ప్రతులకు :

రెడ్డి సేవా సమితి,

రాజీవ్ మార్గ్, కడప – 516 004.

కవర్ పేజి : **బీరెల్లి పుల్లారెడ్డి**

డి.టి.పి. : **కొండూరు జనార్దన రాజు**

ప్రచురణ :

రెడ్డి సేవా సమితి,

రాజీవ్ మార్గ్, కడప – 516 004.

ఫోన్ : 08562 257729

ముద్రణ :

ఆర్.కె. గ్రాఫిక్స్ & స్క్రీన్స్,

మునిరావు వీధి, కడప – 516 001.

అంకితం

శ్రీ చెన్నూరు ఆంజనేయరెడ్డి, ఐ.పి.ఎస్.(రిటైర్డ్)

శ్రీ సంబటూరి వీరనారాయణరెడ్డి, ఐ.పి.ఎస్.(రిటైర్డ్)

గార్లకు వినయపూర్వకంగా...

- ఈమని శివనాగిరెడ్డి

٨!

కృతజ్ఞతలు

రెడ్డి సేవా సమితి, కడప 2000 సంవత్సరం మే నెలలో ప్రారంభించిన తర్వాత తమ ఆశయాల సిద్ధి మేరకు వెలువరించిన మొదటి పుస్తకం 'కొండవీటి రెడ్డిరాజులు'. ఈ పుస్తకాన్ని మొదటి ముద్రణలో 2000 కాపీలను, రెండవ ముద్రణలో 2000 కాపీలను ప్రచురించాము. 4000 కాపీలు ఖర్చయిపోవడంతో మూడవ ముద్రణ అవసరమయింది. కొండవీటికి ప్రాధాన్యము సంతరించుకోవడంతో వీలైనంత త్వరలో పుస్తకాలు అందజేయాలని పాఠకులు, ముఖ్యంగా గుంటూరు, ప్రకాశం జిల్లా వాస్తవ్యులు కోరడంతో మూడవ ముద్రణను చేపట్టాము.

రచయిత ఈమని శివనాగిరెడ్డిగారు రాష్ట్ర పురావస్తు శాఖలో పనిచేసి ప్రస్తుతం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్యూరిజం & మేనేజ్‌మెంట్‌కు సంచాలకులుగా వ్యవహరిస్తున్నారు. వీరికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

కొండవీడు ఫోటోలు ప్రచురించటానికి అనుమతించిన పురావస్తుశాఖ సంచాలకులు ప్రొ. పెద్దాపురపు చెన్నారెడ్డి గారికి, కొండవీడు అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న గౌరవ మంత్రివర్యులు గౌ॥ శ్రీ గాదె వెంకటరెడ్డిగారికి, నర్సారావుపేట పార్లమెంటు సభ్యులు గౌ॥ శ్రీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిగారికి, గౌరవ శాసనమండలి సభ్యులు శ్రీ టి.జి.వి. కృష్ణారెడ్డి గారికి, చిలకలూరిపేట శాసన సభ్యులు గౌ॥ శ్రీ పత్తిపాటి పుల్లారావు గారికి, కొండవీడు డెవలప్‌మెంట్ కమిటీ కన్వీనర్ శ్రీ కల్లి శివారెడ్డిగారికి, కొండవీడును జాతీయ వారసత్వ సంపదగా కాపాడుకోవాలన్న బాధ్యతను నెత్తికెత్తుకొన్న గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీ బి.రామాంజనేయులు, ఐ.ఏ.ఎస్. గారికి, ఇంకా మాకు సహకరించిన శ్రీ రవికృష్ణ, గుంటూరు, శ్రీ బొమ్మిడాల కృష్ణమూర్తి గారికి, శ్రీ కె. జితేంద్రబాబు గారికి, అద్దంకిలో మాకు సహకరించిన డా. జ్యోతి చంద్రమౌళి గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ ప్రచురణలో తోడ్పాటునందించిన విద్వాన్ కట్టా నరసింహులుకు (రీసర్చి అసిస్టెంట్, సి.పి. బ్రౌన్ లైబ్రరీ), గోపికి, డి.టి.పి.ని చక్కగా, అతి తొందరలో పూర్తిచేసిన కొండూరు జనార్దన రాజుకు కృతజ్ఞతలు.

పుస్తక ప్రచురణకు ఆర్థిక సహాయం చేసిన దాతలు :

1. శ్రీ గోల్మార్ తాతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి, కొండవీటి సదన్, శ్రీశైలం.
2. ప్రొఫెసర్ జి. శివారెడ్డి (రి), వేమన విశ్వవిద్యాలయం, కడప.
3. శ్రీమతి బెల్లం ఉమాలక్ష్మీదేవి, అరవిందనగర్, కడప.
4. శ్రీ జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, అటవీక్షేత్ర అధికారి, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, హైదరాబాదు.
5. శ్రీ మన్నెం వెంకట రామిరెడ్డి, మన్నెంవారిపల్లె, బద్వేలు, కడప.
6. శ్రీమతి కల్లూరి శేషమహేశ్వరమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్, రసాయన శాస్త్ర విభాగం, జె.యన్.టి.యు. కళాశాల, పులివెందుల.

దాతలందరికి మా కృతజ్ఞతలు. పుస్తకము మునుపటిలాగే అందరిని అలరిస్తుందని భావిస్తున్నాం.

రెడ్డి సేవా సమితి
రాజీవ్ మార్గ్, కడప.

18-7-2010

రెడ్డి సేవాసమితి కార్యవర్గ సభ్యులు

శ్రీ వి.యం. రామచంద్రారెడ్డి
శ్రీ వై. ప్రతాపరెడ్డి
శ్రీ డి. రామచంద్రారెడ్డి
శ్రీ జి. ఆదినారాయణరెడ్డి
శ్రీ సి. నరసింహారెడ్డి
శ్రీ పి. బయపురెడ్డి
శ్రీ యన్. చంద్రశేఖర్‌రెడ్డి
శ్రీ ఇ. నాగలక్ష్మిరెడ్డి
శ్రీ కె. చంద్రారెడ్డి
ప్రొఫెసర్ కె. నాగిరెడ్డి
శ్రీ యల్. మధుసూదన్‌రెడ్డి
ప్రొఫెసర్ జి. శివారెడ్డి
శ్రీ ఆర్. భాస్కరరెడ్డి
శ్రీ యల్. కొండారెడ్డి
శ్రీమతి బి. పద్మావతి
శ్రీ యం. సుబ్బిరెడ్డి
శ్రీ పి. పురుషోత్తంరెడ్డి
శ్రీ యన్. ఈశ్వరరెడ్డి
శ్రీ పి. సూర్యనారాయణరెడ్డి
శ్రీ పి. తిరుమలరెడ్డి
శ్రీమతి పి. రెడ్డికుమారి



పుట్టంరెడ్డి శకుంతలమ్మ మహిళా వసతి గృహం, కడప.

Prof. P. Chenna Reddy
MA, MTM, PhD
DIRECTOR

Dept. of Archaeology and Museums
Government of Andhra Pradesh
Gunfoundry, Hyderabad-500 001
Tel/Fax: +91 40 2323 4942,
Mobile : 98492 54956, 94400 47299
email : chennareddyp@gmail.com

ముందుమాట

మధ్యయుగాంధ్రదేశంలో పుట్టుకొచ్చిన మూడు క్షత్రియేతర రాజవంశాల్లో రెడ్డిరాజులు దేశాన్ని పరపీడన నుంచి కాపాడటమే కాక, ప్రజారంజకమైన పాలన నందించారు. క్రీ.శ. 14వ శతాబ్దపు తొలినాళ్లలో సుస్థిర పాలన నందించిన కాకతీయులపై పరాయి సేనల కిరాయి దాడి జరిగినపుడు పాలకులతో పాటు, పాలితులూ క్షోభకు గురైనారు. క్రీ.శ. 1323 నాటికి పరులచేతికెళ్లిన తెలుగునేల దాదాపు 2, 3 సంవత్సరాలు విలవిల లాడింది. ఆ సందర్భంగా ఆత్మగౌరవ పరిరక్షణలో భాగంగా ఉద్యమరూపం దాల్చిన స్వాతంత్ర్య పోరాటం కొత్తరాజ్యాల పుట్టుకకు దారితీసింది.

రేచర్ల పద్మనాయక, ముసునూరి నాయక, రెడ్డి రాజులు ఆ మూడు కొత్తరాజ్యాలు. వీటిలో రెడ్డిరాజ్యం అద్దంకి రాజధానిగా పాలన ప్రారంభించి కొండవీడులో సుస్థిర రాజకీయ కార్యకలాపాలను సాగించి, రాజమహేంద్రవరం, కందుకూరు శాఖలుగా విస్తరించి వందేళ్లపాటు నిలదొక్కుకోవటమే కాక, ఒక విలక్షణ స్థానాన్ని సంపాదించుకొంది. కొండవీటి రెడ్డిరాజుల మీద, రెడ్డిరాజ్యాల మీద మరికొన్ని పుస్తకాలు అందుబాటులో వున్నా, ఒక నవలలా సాగిపోతున్న ఈ పుస్తకం మూడో ముద్రణకు నోచుకొందంటే రచయితకు చరిత్రపై గల పట్టు ఎంతో ఇట్టే తెలిసిపోతుంది. ఈ సందర్భముగా రచయితను, కడప రెడ్డి సేవాసమితిని ముఖ్యంగా ఆచార్య జి. శివారెడ్డి, లెక్కల కొండారెడ్డి గార్లను ప్రత్యేకంగా అభినందిస్తూ..... మరికొన్ని పుస్తకాలను తెలుగు పాఠకులకు అందించగలరని ఆశిస్తున్నాను.

తేది : 18-07-2010
హైదరాబాదు.

ఆచార్య పెద్దారపు చెన్నారెడ్డి
సంచాలకులు

మూడవ ముద్రణ
'మనవి మాటలు'

కాకతీయుల పతనానంతరం పుట్టుకొచ్చినరాజ్యాల్లో రెడ్డి రాజ్యం ఆంధ్రదేశంలోని ఎక్కువ ప్రాంతాన్ని చేజిక్కించుకొంది. రాజ్యస్థాపకుడు ప్రోలయ వేమారెడ్డి అద్దంకి నుంచి పరిపాలించటం ప్రారంభించాడు. ఆయన తరువాత అనపోతారెడ్డి రాజధానిని కొండవీటికి మార్చి రెడ్డిరాజ్య ప్రాభవాన్ని ఇనుమడింప చేశాడు. తరువాత కొండవీటి సింహాసనాన్నధిష్ఠించిన అనవేమారెడ్డి, కుమారగిరిరెడ్డి, రెడ్డి రాజ్యాన్ని విస్తృత పరిచారు. కుమారగిరిరెడ్డి కాలంలో కొండవీడు తన ప్రాభవాన్ని కోల్పోగా రాజమహేంద్రవర రాజ్యం కొంతకాలం మనగలిగింది. అలాగే ప్రోలయ వేమారెడ్డి తమ్ముడు మల్లారెడ్డి నేతృత్వంలోని కందుకూరి రాజ్యం కూడా స్వతంత్ర రాజ్యంగానే దాదాపు 70 ఏళ్ళు నిలబడింది.

రెడ్డిరాజులు వ్యవసాయాన్ని, వర్తకవ్యాపారాలను కూడా పెంపొందించారు. కవులను, కళాకారులను పోషించారు. రక్షణవ్యవస్థను పటిష్టం చేయటానికి అనేక కోటల్ని నిర్మించారు. ప్రజల మనోభావాల్ని గౌరవించి అనేక ఆలయాలను నిర్మించారు. సాగునీరు, తాగునీటి కోసం ఎన్నో చెరువులను తవ్వించారు. మధ్యాంధ్రయుగంలో తమకంటూ ఓ స్థానాన్ని కల్పించుకొన్నారు.

రెడ్డి రాజుల చరిత్ర గురించి రాజమండ్రిలోని ఆంధ్రేతిహాసక పరిశోధకమండలి, కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తులు చేసిన ప్రయత్నాలు పేర్కొనదగినవి. మద్దులపల్లి గురుబ్రహ్మ శర్మ రాసిన 'కొండవీటి సామ్రాజ్యం' అనపర్తిలోని మల్లిడి సత్తిరెడ్డి 'రెడ్డి రాణి' పత్రిక, మల్లంపల్లి సోమశేఖరశర్మ రాసిన 'హిస్టరీ ఆఫ్ ది రెడ్డి కింగ్‌డమ్స్', వడ్డాది అప్పారావు సంపాదకత్వంలో వెలువడ్డ 'రెడ్డి సంచిక', దోమకొండ సంస్థానంవారు వెలయించిన 'రెడ్డికుల నిర్ణయ చంద్రిక', తేరాల సత్యనారాయణశర్మ రాసిన 'రెడ్డి రాజ్య చరిత్రము'. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి రాసిన 'కర్పూర వసంతరాయలు', ఇటీవల కొండా లక్ష్మీకాంతరెడ్డి కృషితో బి. ఎన్. శాస్త్రి రాసిన 'రెడ్డి రాజ్య సరస్వం', మేడపాటి శ్రీనివాసరెడ్డి సంపాదకత్వంలో బయటికొచ్చిన 'రెడ్ల చరిత్ర, సంస్కృతి', డా. వి.వి. సుబ్బారెడ్డి రాసిన 'రెడ్డి రాజుల చరిత్ర', పలగాని గోపాలరెడ్డి రాయగా కొండా లక్ష్మీకాంతరెడ్డి ప్రచురించిన 'భరత భూమిలో రెడ్డి రాజతేజం' పుస్తకాలు పేర్కొనదగినవి. అయితే సామాన్యులు తేలిగ్గా అర్థం చేసుకొని రెడ్డిరాజుల చరిత్ర తెలుసుకోవటానికి సులభ వ్యావహారిక భాషలో చిన్న పుస్తకమైనా లేదనే కోరిక చాలా మంది వ్యక్తం చేశారు.

శ్రీ యండపల్లి శ్రీనివాస్‌రెడ్డి 1996-97లో నడిపించిన "రెడ్డినాడు" పత్రిక ప్రోత్సాహంతో నేను ధారావాహికంగా రాసిన వ్యాసాలను కడప లోని 'రెడ్డి సేవా సమితి' ఒక పుస్తక రూపంలో తేవడానికి నన్నడగగానే సంతోషంగా ఒప్పుకొన్నాను. ముఖ్యంగా ప్రొఫెసర్ జి. శివారెడ్డి, ప్రొఫెసర్ పి. మునిరత్నంరెడ్డి, శ్రీ లెక్కల కొండారెడ్డి, డాక్టర్ జి. జయచంద్రారెడ్డి, "రెడ్డినాడు" శ్రీ యండపల్లి శ్రీనివాసరెడ్డి గార్లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

కుమారగిరిరెడ్డి జీవితంలోని ప్రధాన ఘట్టాలను కళ్లకు కట్టినట్లు 'కర్పూర వసంత రాయలు' పుస్తకం ద్వారా తెలుగు పాఠకులకు అందించిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి గారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

ఈ చిన్న పుస్తకాన్ని అంకితం పుచ్చుకోవటానికి అంగీకరించిన శ్రీ చెన్నూరు ఆంజనేయరెడ్డి గారికి, శ్రీ సంబటూరి వీరనారాయణరెడ్డి గారికి నా కృతజ్ఞతలు.

ఈ ముద్రణలో కొండవీడుకు సంబంధించిన ఫోటోలను ప్రచురించటానికి అనుమతించి, నన్ను ఎప్పుడూ ప్రోత్సహించే పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ సంచాలకులు ప్రొ. పెద్దారపు చెన్నారెడ్డి గారికి కృతజ్ఞతలు.

ఈ పుస్తకం తీసుకురావటంలో నాకు సహకరించిన శ్రీ బీరెల్లి పుల్లారెడ్డి, శ్రీ డి. శ్యామసుందర్‌రావు గార్లకు నా అభినందనలు.

హైదరాబాద్
18-7-2010

- ప్రొఫెసర్ ఈమని శివనాగిరెడ్డి, డైరెక్టర్
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం & హాస్పిటాలిటీ మేనేజిమెంట్
టెలికాం నగర్, గచ్చిబౌలి, హైదరాబాద్ - 500 032.
E-mail : drreddynithm@gmail.com
Mobile : 09848598446

(శ్రీకృష్ణదేవరాయని 500వ పట్టాభిషేకోత్సవాలు కొండవీడులో జరుగుతున్న సందర్భంగా)

లోపలి పేజిల్లో

పేజీలు

రెడ్ల చరిత్ర - పూర్వరంగం 1

అద్దంకి రాజధానిగా ప్రోలయ వేమారెడ్డి పాలన 4

కొండవీడుకు రాజధానిని మార్చిన అనపోతారెడ్డి 12

కళింగ గాంగులతో రెడ్డిరాజుల మొదటి యుద్ధం 14

ఆదర్శ పాలకుడు అనవేమారెడ్డి 19

'కర్పూర వసంత రాయలు' కుమారగిరిరెడ్డి 26

కొండవీటి రాజనర్తకి లకుమ 35

కుమారగిరిరెడ్డి చివరి రోజులు 45

కొండవీడులో పెదకోమటి వేమారెడ్డి 47

రెడ్డిరాజ్య శాఖలు 49

కొండవీటి కోట 58

అనుబంధాలు :

1. వంశవృక్షము 71

2. శాసనాల నమూనాలు 74

3. రాజ్య విస్తరణ 75

4. కొండవీటి ప్రశస్తి - దువ్వూరి రామిరెడ్డి 81

రెడ్ల చరిత్ర - పూర్వరంగం

ఆంధ్రదేశ చరిత్రలో క్రీ.శ. 7వ శతాబ్ది నుంచే రెడ్లు శాసనాల్లో తమ ఉనికిని ప్రకటించుకొన్నారు. రెడ్ల పుట్టు పూర్వోత్తరాల గురించి ఇప్పటి వరకు జరిగిన పరిశోధనల నేపథ్యంలో మాన్యఖేటాన్ని (నేటి కర్ణాటక రాష్ట్రం, గుల్బర్గా జిల్లాలోని మాల్ఖేడ్) రాజధానిగ చేసుకొని పాలించిన రాష్ట్ర కూటులు కర్ణాటక, మహారాష్ట్రాలలో మహారథులుగా పిలువబడినవారే. అక్కడి నుండి వాయవ్య ప్రాంతానికెళ్ళి రాజస్థాన్‌లో స్థిరపడిన ఒక జాతి 'రాథోడ్లు'గా పేరు పొందారు. మాల్ఖేడ్ నుండి దక్షిణంగా వలస వచ్చి కన్నడ, తెలుగుదేశాలలో స్థిరపడినవారు రాష్ట్ర కూట ప్రముఖులుగా పిలువబడి తరువాత 'రట్టోడ్లు' 'రెడ్లు'గా మారారు. అయితే రాథోడ్లు పొడవాటి శరీరంతో ఉండటానికి కారణం వారు సహజంగా పొడగరులైన ఉత్తర భారతీయులతో వివాహ సంబంధ బాంధవ్యాలుండటంచేత, వర్ణ, దేహ దారుఢ్యంలో జన్యుపరమైన మార్పులు గోచరించటమే. ఇక దక్షిణ భారతదేశానికి వచ్చిన రాష్ట్రకూటులు అంత పొడవూ, పొట్టి కాని శరీరాకృతి కలిగిన వారితో గల సంబంధంతో స్థానికులతో కలిసిన మాట వాస్తవం.

రట్టడికం అంటే గ్రామసీమల్లో పన్ను వసూళ్ళు, ప్రభుత్వానికి చెల్లింపులు, న్యాయపరమైన నిర్ణయాలు తీసుకోవడం మొదలైన పాలనా బాధ్యతలను నిర్వహించే ఒక వ్యవస్థగా పేర్కొనవచ్చు. ఈ "రట్టడికం" వంశపరంపరగా లభించే హక్కుగానూ, పదవిగానూ ఉండేది. రట్టడికాన్ని నిర్వహించే పెద్దను రట్టోడి లేక రడ్డి లేక రెడ్డి అనేవాళ్ళు. గ్రామ రక్షణతోపాటు వ్యవసాయాభివృద్ధి కూడా ముఖ్యమైనది కాబట్టి రెడ్డిని కాపుగా పిలిచేవాళ్ళు.

రెడ్డి రాజులు కొండవీడు సామ్రాజ్యాన్ని స్థాపించడానికి పూర్వమే రెడ్లు వివిధ అధికార హోదాలు పొందినట్లు శాసనాలు రుజువు చేస్తున్నాయి. క్రీ.శ. 10వ శతాబ్దంలో తూర్పు చాళుక్య ప్రభువు అమ్మరాజు, తనకు సేవలందించినందుకు మాడియ రట్టోడికి, మహాసామంత బిరుదుతోపాటు అత్తిలి సమీపంలోని 'పొందువ' అనే గ్రామాన్ని ఇచ్చి సత్కరించాడు. క్రీ.శ. 10వ శతాబ్దికే గ్రామపాలనా స్థాయి నుండి రెడ్లు సామంత స్థాయికి ఎదిగినట్లు పై వివరం తెలుపుతుంది.

రాష్ట్ర కూటుల పాలన తరువాత అంటే క్రీ.శ. 973 నుండి, నేటి తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలను పాలించిన కళ్యాణీ చాళుక్యుల పాలనలో కూడా రెడ్లు రట్టడికాల్ని నిర్వహించారు. క్రీ.శ. 11వ శతాబ్దికి "రెడ్డి" అనే పదం కులాన్వయిగా వాడుకలోకి వచ్చింది. కళ్యాణీ చాళుక్యుల తరువాత ఆంధ్రదేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యం క్రిందకి తెచ్చిన కాకతీయులకు రెడ్డివీరులు సహకరించిన ఆధారాలున్నాయి.

కాకతీయ మొదటి ప్రోలరాజు దగ్గర రేచర్ల బమ్మిరెడ్డి (బమ్మసేనాని) సేనాధిపతిగా ఉండి, అనేక యుద్ధాల్లో పాల్గొని రాజుకు విజయాన్ని చేకూర్చి పెట్టాడు. రెండవ ప్రోలరాజు సైన్యాధ్యక్షుడైన రెడ్డి కులస్థుడు కామచమూపతి. అతనికి మంథని యుద్ధంలో సహకరించి గుండ్యనను సంహరించాడు. కామచమూపతికి రేచెర్ల బేతిరెడ్డి, నామిరెడ్డి అనే ఇద్దరు కొడుకులున్నారు. వాళ్ళిద్దరూ కాకతీయ రుద్రుడు, గణపతి దేవుల సేనా నాయకులుగా పనిచేశారు. రేచర్ల వంశానికే చెందిన రుద్రుడనే రుద్రిరెడ్డి గణపతి దేవుని సర్వ సైన్యాధ్యక్షుడు. ఇతని తరువాతి తరమువారు సూర్యాపేట సమీపంలోని పిల్లలమర్రిని రాజధానిగా చేసుకుని పాలించారు. ఇదే కాలంలో నెల్లూరి సీమను పాలిస్తున్న తెలుగు చోడరాజైన తిక్కన సైన్యంలోనున్న రెడ్డి ధీరులు, కర్నాట రాజునోడించడంలో ప్రధాన పాత్ర పోషించారు. కాకతి రుద్రమదేవికి గోన గన్నారెడ్డి, గోన విఠలరెడ్డి, ప్రతాపరుద్రునికి గొంకారెడ్డి సామంతులుగా ఉంటూ ప్రభువులకు విధేయ సహాయకులుగా ఉన్నారు.

కాకతీయ ప్రతాప రుద్రుని (కీ.శ. 1291-1323) పాలనలో పాలనా సౌలభ్యం కోసం ప్రత్యేకంగా నియమింపబడిన బాహత్తర (72) నియోగాధిపతుల్లో బ్రాహ్మణులు, కాపులు, వెలమలు, కాయస్థులతోపాటు రెడ్లు కూడా ఉన్నారు. 'వెలుగోటి వారి వంశావళి'లో ప్రతాపరుద్రుని 72 నియోగాధిపతుల్లో కొలిపాక నాగిరెడ్డి, తాడిపర్తి గన్నారెడ్డి, చందమల్లారెడ్డి, బాచి బూచారెడ్డి, బాచి పెంచలి మల్లారెడ్డి, గడ్డి మన్నారెడ్డి, గోన కోటారెడ్డి మొదలైన వారున్నట్లు పేర్కొనబడింది. వీరితోపాటు ప్రతాపరుద్రునికి అంతేవాసులుగా ప్రోలయ రెడ్డి, ముసునూరి ప్రోలయ నాయకులు కూడా ముఖ్యులు. ప్రతాపరుద్రుడు దక్షిణ దేశ దండయాత్రకు వెళ్ళినపుడు పాండ్యులను జయించి కంచిని స్వాధీన పరచుకోటానికి ప్రోలయరెడ్డి ప్రముఖ పాత్ర వహించాడు. బాహత్తర నియోగాధిపతుల్లో నున్న 'దేశట్ల పురవరాధీశ్వరుడు', బహుశా ఈ ప్రోలయ రెడ్డి అయి ఉంటాడు.

క్రీ.శ. 1323లో ఢిల్లీ సుల్తాన్ ఘియాజుద్దీన్ తుగ్లక్ సేనలు వరంగల్ కోటను ఆక్రమించి, ప్రతాపరుద్ర చక్రవర్తిని బంధించి ఢిల్లీకి తీసుకెళుతుండగా, ఆయన నర్మదా నదీ తీరంలో చనిపోవడంతో కాకతీయ సామ్రాజ్యం పతనమైంది. వరంగల్ ముస్లింల పరమై "సుల్తాన్‌పురం"గా మారింది.

క్రీ.శ. 1323 నుండి క్రీ.శ. 1336 వరకూ వరంగల్‌పై ముస్లింల ఆధిపత్యం కొనసాగింది. మ్లేచ్ఛుల అధర్మ పాలనలో తెలుగునేల విలవిల లాడిందని 'విలాసతామ్ర శాసనాలు' పేర్కొంటున్నాయి. ఢిల్లీ సుల్తానుకు, ప్రతాపరుద్రునికి జరిగిన యుద్ధంలో కొందరు సేనానులు చనిపోగా మరికొందరు బందీలైనారు. ఎలాగో తప్పించుకొని బయట పడిన కొలనిరుద్రుడు, రేచర్ల సింగమనాయకుడు, అన్నయ మంత్రి, ముసునూరి ప్రోలయ నాయకుడు ఇంకా ప్రోలయ వేమారెడ్డి ఒక చోట సమావేశమై మ్లేచ్ఛుల బారి నుండి తెలుగు నేలను రక్షించి, ధర్మాన్ని పునరుద్ధరించడానికి ప్రతిజ్ఞ చేశారు. మాతృభూమి పరులచేతిలో బందీగా ఉండటాన్ని సహించలేక మ్లేచ్ఛులపై యుద్ధం ప్రకటించటానికి, ప్రోలయ నాయకుని సారథ్యంలో ఒక ఉద్యమం రూపుదాల్చింది. ప్రోలయ వేముని 'మల్లవరం శాసనం', కొలని రుద్రుని 'సంతమాగులూరు శాసనం', ప్రోలయ నాయకుని 'విలాస తామ్ర శాసనాలు' ఆంధ్రావనికి ఈ వీరులు స్వాతంత్ర్యం అందించిన వివరాలను తెలుపుతున్నాయి. ఈ యుద్ధాన్ని చారిత్రకులు మొదటి ఆంధ్ర స్వాతంత్ర్య యుద్ధంగా అభివర్ణించారు.

ఢిల్లీ పాలకుల నుండి ఆంధ్రదేశానికి విముక్తి కలిగించటానికి పూనుకొన్న ఆంధ్రవీరులు ముసునూరి ప్రోలయ నాయకుడు, ప్రోలయ వేమారెడ్డి గురించి, తరువాతి కాలంలో 'రెడ్డిరాణి అనితల్లి కలువచేరు శాసనం' వివరిస్తుంది. మ్లేచ్ఛులతో జరిగిన యుద్ధంలో పాక్షిక విజయం సాధించిన ప్రోలయ నాయకుడు, గోదావరీ ప్రాంతాన్ని స్వాధీన పరచుకొని భద్రాచలం సమీపంలోని రేకపల్లిని రాజధానిగా చేసుకుని, ముసునూరి రాజ్యాన్ని స్థాపించాడు. తరువాత అతని తమ్ముడు కాపయనాయకుడు పొరుగువారి సాయంతో ఓరుగల్లు కోటను ముట్టడించి, క్రీ.శ. 1336లో స్వాధీన పరచుకొన్నాడు. ప్రోలయ నాయకునికి చేదోడుగానున్న ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ. 1325లోనే గోదావరి–పెన్న నదుల మధ్యగల తీరాంధ్రదేశాన్ని వశపరచుకొని 'రెడ్డిరాజ్యాన్ని' స్థాపించి 'అద్దంకి' ముఖ్యపట్టణంగా పరిపాలన ప్రారంభించాడు.

అద్దంకి రాజధానిగా ప్రోలయ వేమారెడ్డి పాలన

(క్రీ.శ. 1325-1353)

కాకతీయుల పతనానంతరం, ఆంధ్రదేశంలో వెలసిన స్వతంత్ర రాజ్యాల్లో కొండవీటి రెడ్డి రాజ్యం ముఖ్యమైంది. క్రీ.శ. 1325లో అద్దంకి నుండి ప్రారంభమై, తరువాత కొండవీడు, రాజమహేంద్రవరం, కందుకూరు, చందోలు శాఖలుగా దాదాపు 100 సంవత్సరాలపాటు ఆంధ్రతీర ప్రాంతాన్ని అప్రతిహతంగా పాలించి, సాహితీ కళా రంగాలకు సేవచేయడమేకాక సాంఘిక, ఆర్థిక రంగాలలో కూడా ముందంజ వేసింది. రెడ్డిరాజుల వంశకర్త అయిన వేమునికి ప్రోలుడు జన్మించాడనీ, ఆ ప్రోలునికి మాచారెడ్డి, అన్నయరెడ్డి, వేమారెడ్డి, మల్లారెడ్డి అనే నలుగురు కొడుకులనీ, వీరిలోని వేమారెడ్డే కాకతీయుల పాలనలో నాయకునిగా నాయంకరాన్ని పొందాడని సాహిత్యం, శాసనాలు వివరిస్తున్నాయి. అద్దంకిని రాజధానిగా పాలించడంచేత అద్దంకి వేమారెడ్డిగానూ, ప్రోలయ కుమారుడు గాబట్టి ప్రోలయ వేమారెడ్డిగానూ పిలువబడి, కొండవీటి సామ్రాజ్యం మూల పురుషునిగా కూడా కీర్తింపబడ్డాడు. ఇతడు క్రీ.శ. 1325 నుండి 1353 వరకూ పాలించి, తనకు సంతానం లేకపోతే తమ్ముని కొడుకులను దత్తత తీసుకుంటాడు. ఆ దత్తపుత్రుడు అనపోతారెడ్డి రాజధానిని అద్దంకి నుండి కొండవీడుకు మార్చి క్రీ.శ. 1354 నుండి 1364 వరకూ, అతని తరువాత అనవేమారెడ్డి క్రీ.శ. 1364 నుండి 1386 వరకూ, అతని తరువాత కుమారగిరిరెడ్డి క్రీ.శ. 1386 నుండి 1402 వరకూ, తరువాత పెదకోమటి వేమారెడ్డి క్రీ.శ. 1402 నుండి 1420 వరకూ, అటు తరువాత రాచవేముడు క్రీ.శ. 1420 నుండి 1424 వరకూ కొండవీడును పాలించారు.

రెడ్డి రాజ్య స్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి చరిత్ర, పాలనా పరమైన వివరాలను వలివేరు, నకరికల్లు, సంతమాగులూరు, ముట్లూరు, గణపేశ్వరం, దాక్షారామం, పువ్వాడ, మల్లవరం, ఆతుకూరు, దృజ్జవరం, మంచాళ, కల్వపాముల, వేమవరం, పెరవలి ఇంకా అమరావతి శాసనాలూ, ఎఱ్ఱాప్రెగడ రచించిన హరివంశం, నృసింహ పురాణం, వామనభట్టభాణుని వేమభూపాల చరితం, శ్రీనాథుని హరవిలాసం మొదలైన గ్రంథాలూ అందిస్తున్నాయి. ప్రోలయ వేమారెడ్డి రెడ్డి రాజ్య స్థాపన చేసిన వివరాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి.

క్రీ.శ. 1324లో ముసునూరి ప్రోలయ నాయకునికి సహాయంగా ఉన్న ప్రోలయ వేమారెడ్డి అతని వలెనే తాను కూడా తన నాయంకరాన్ని స్వతంత్రంగా పాలించాలను కొంటాడు. తన నాయంకరమైన పూగినాడు, పాకనాడు, వెలనాడు ప్రాంతాలకు వెళ్ళి ప్రజలను కలుసుకొని, తన నిర్ణయాన్ని **తెలి**యజేస్తాడు. ఆ ప్రాంతప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడినవారు కావడంచేత, ఒక రైతు రాజవుతుంటే తమకు కావల్సిందేముందని సహకరిస్తారు. వ్యవసాయంపై అవగాహన, సాగునీటి వనరుల వినియోగం, చెల్లిస్తున్న పన్నులు, పండుతున్న పంటలు మొదలైన విషయాలు బాగా తెలిసిన ఒక రైతు తమకు పాలకుడౌతుంటే వారి హృదయాల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రతి పల్లె పులకించింది. హాలికులంతా ఏలికలైనట్లు ప్రోలయ వేమునికి హార్దిక స్వాగతం పలికారు.

ప్రోలయ వేమారెడ్డి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించడంలో సలహాలనిచ్చి, ప్రోత్సహించింది రాజగురువు ఘోడెరాయగంగ దేవుడు. ఇతడు త్రిపురాంతకదేవుని భక్తుడు. ధర్మాన్ని కాలరాస్తున్న ముష్కరమూకల నుండి తెలుగు నేలను కాపాడిన వీరులలో ఒకడైన ప్రోలయ వేమారెడ్డి ధర్మనిరతి, ఈ రాజగురువును ఆకట్టుకొంది. ఆతుకూరు, దృజ్జవరం శాసనాలూ, ఎర్రన హరివంశం, ప్రోలయ వేముడు ఈ ఘోడెరాయగంగుని శిష్యుడని, భక్తుడని తెలియజేస్తున్నాయి. పాలనాపరమైన వ్యవహారాల్లో తన అన్న మాచారెడ్డి, తమ్ముడు మల్లారెడ్డి, పంటనాటిని పాలిస్తున్న తాత దొడ్డారెడ్డి, మేనమామ నాగసేనాపతి, ఘోడెరాయ గంగునితోపాటు ప్రోలయ వేమునికి సహాయ సహకారాల నందించారు. తన బంధువుల్లో సమర్థులైనవారిని ఉన్నత పదవుల్లో నియమించి, వారి పూర్తి సహకారాన్ని తీసుకొని పాలించాడు. మల్లారెడ్డిని సర్వసైన్యాధ్యక్షునిగా నియమించి కొండలపైనున్న కోటలపాలన అప్పగించాడు.

స్థాపించిన రాజ్యాన్ని రక్షించడం రాజు ముఖ్య కర్తవ్యాల్లో ఒకటి. కోటలను కట్టుకోవాలి. చతురంగ బలగాల్ని సమకూర్చుకోవాలి. ఇందుకు పెద్ద మొత్తంలో ఆర్థిక వనరులుండాలి. తన తండ్రి తరంనుండి వస్తున్న నాయంకరం, తల్లి తరపున పంటనాటి నుండి వచ్చిన ఆర్థిక సాయంతోపాటు అద్దంకి సీమలోని పెద్ద రైతులు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రోలయ వేమునికి తమ శక్తి కొద్దీ సాయంచేసి రాజ్యస్థాపననకు పూనుకొన్నారు. అంతేకాక తీరాంధ్రదేశంలో చీరాల సమీపంలో నున్న మోటుపల్లిని రేపు పట్టణంగా తమ వ్యాపారాన్ని సముద్రంమీద, ఇటు భూమిమీద వృద్ధి చేసుకున్న సెట్టి ప్రముఖులు కూడా ప్రోలయ వేమునికి చేయూత నిచ్చినవారిలో ముఖ్యుడు, కంచీపురానికి చెందిన ఆవచి పావాణిశెట్టి కొడుకు ఆవచి దేవయశెట్టి. ఇతడు

రామనాథయోగీశ్వరుని ఉపదేశం మేరకు వీరమాహేశ్వర వ్రత నిష్ఠతో ఉండేవాడు. శైవభక్తుడైన ప్రోలయ వేమారెడ్డి రాజ్య స్థాపన సమయంలో అవసరమైన ధనాన్ని ప్రోగు చేయడంలో తనవంతు పాత్ర పోషించి అతనికి అతి సన్నిహితుడైన ప్రముఖ వ్యాపార వేత్తగా ఉన్నాడు దేవయశెట్టి. మోటుపల్లి రేవు నుండి విదేశాలతో ఖరీదైన వస్తువుల ఎగుమతి, దిగుమతుల ద్వారా ధనాన్ని సంపాదించి సుంకం రూపంలో ప్రోలయ వేముని రాజ భాండాగారానికి జమ కట్టాడు.

ప్రోలయ వేముడు స్వతంత్రుడై అద్దంకిని రాజధానిగా చేసుకొని మొదట్లో గుండ్లకమ్మ నదికి రెండువైపుల గల స్థలాన్నీ, తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన శ్రీశైలం, ఉత్తరాన కృష్ణానది వరకూ పాలించాడు. తరువాత అతని తమ్ముడు మల్లారెడ్డి తోడ్పాటుతో దక్షిణాన పెన్నానది వరకూ, ఉత్తరాన గోదావరి తీరం వరకూ విస్తరించాడు. శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో రెడ్డిరాజుల గురించి ప్రస్తావిస్తూ పెన్నానదీ తీరం వారి స్థావరమనీ, సింహవిక్రమ నగరం (నెల్లూరు), దువ్వూరు, గండవరం ముఖ్య పట్టణాలుగా ఉన్న పాకనాటిలోని కొంత భూభాగాన్ని స్వాధీనం చేసుకుని అద్దంకి రాజధానిగా పాలన సాగించారని పేర్కొన్నాడు. తూర్పు సముద్రం ప్రోలయ అధీనంలో లేకపోతే ఆర్థిక స్వావలంబన కుదరదనుకొన్నాడు మల్లారెడ్డి. తూర్పు తీరాన గల రేపు పట్టణాలను, ద్వీపాలను జయించి, ప్రోలయ వేముని తూర్పు సముద్రాధీశ్వరునిగా చేశాడు. మోటుపల్లి వశమైన తరువాత సుంకం ద్వారా లభించిన ఆదాయం ప్రోలయ వేముని రాజ్య సుస్థిరతకు తోడ్పడింది.

ప్రోలయ వేముడు స్వతహాగా మంచి పాలకుడు. కాకతీయుల వద్ద నిర్వహించిన నాయక విధులు అతన్ని పరిపాలనాదక్షునిగా తీర్చిదిద్దాయి. రాజనీతి, యుద్ధనీతి, అస్త్ర శస్త్ర ప్రయోగాలు తెలిసిన గొప్ప విలుకాడని వేమభూపాల చరితం తెలియజేస్తుంది. అతడు 84 కోటలను నిర్మించాడని మంచాళ శాసనం పేర్కొంటుంది. కొండవీటి కొండపైన శత్రుదుర్భేద్యమైన కోటను నిర్మించాడు. బెల్లంకొండ, వినుకొండ, ధరణికోట, చందవోలు కోటలను వశపరచుకొని, అక్కడ కొంత సైన్యాన్ని ఉంచి శాంతి భద్రతలను కాపాడి ప్రజారంజకుడై పాలించాడు.

విజయనగర పాలకుడైన మొదటి హరిహర రాయలు ప్రోలయ వేమునికి సమకాలికుడు. పెన్నకు దక్షిణ భాగం విజయనగర ప్రభువుల అధీనంలో ఉన్నా, వారితో సఖ్యతగానే ఉన్నాడు. ముస్లింల దండయాత్రలను త్రిప్పికొట్టడంలో మాత్రం రెండు రాజ్యాలూ ఏకమయ్యేవి. అలానే తన రాజ్యానికి పశ్చిమోత్తర సరిహద్దుల్లోనున్న వెలమ రాజులు, ముసునూరు రాజులు, తూర్పు గాంగులతో స్నేహంగానే ఉన్నాడు. క్రీ.శ.

1352 ప్రాంతంలో అల్లావుద్దీన్ బహమనీ ఆంధ్రదేశంపైకి దండెత్తి రాగా, తరిమికొట్టి తన అన్నరాజ్యాన్ని కాపాడిన ధీరుడు మల్లారెడ్డి. తరువాత కొద్ది కాలానికే చనిపోయిన మల్లారెడ్డికి అక్షయ పుణ్యంగా ప్రోలయ వేమ‌ుడు అమరావతి ఆలయాన్ని పునరుద్ధరించి, శిఖరంపైన పసిడి కలశాలను, పట్టీని చేయించి ఋణాన్ని తీర్చుకున్నాడు. ప్రోలయ వేముని దండయాత్రలలో మేనమామ నాగసేనాని కూడా పాల్గొనేవాడు. అతడందించిన సహాయానికి గుర్తుగా అతను చనిపోయింతర్వాత నేటి గుంటూరు జిల్లాలోని 'ముట్లూరు' గ్రామానికి 'నాగపుర'మని పేరు పెట్టి అగ్రహారంగా ప్రకటించి, జొన్నలగడ్డ మృత్యుంజయార్యునికి ఏక భోగంగా దానం చేశాడు.

మధ్యాంధ్రయుగంలో రాజులు కవులను పోషించి కావ్యాలను రచియింపజేసి వాటిని అంకితం పుచ్చుకొనేవాళ్లు. అలాగే, తమ్ముడు మల్లారెడ్డి ద్వారా ఎఱ్ఱన కవితా కౌశలాన్ని విన్న ప్రోలయ వేమారెడ్డి, అతన్ని తన ఆస్థానంలో నియమించుకున్నాడు. శంభుదాసుడని పిలువబడిన ఎఱ్ఱన, రామాయణం, హరివంశం, అహోబల క్షేత్ర మాహాత్మ్యం అనే గ్రంథాలను రచించి హరివంశాన్ని వేముని కంకితమిచ్చాడు. తక్కిన రెండు గ్రంథాలు లభించక పోయినా, హరివంశం ఎఱ్ఱన పాండిత్యాన్ని, సమకాలీన చరిత్రనూ కళ్ళకు కట్టినట్లు వెల్లడిస్తుంది. తాను శైవమతాన్ని అవలంబించినా వైష్ణవ సంప్రదాయాన్ని కూడా సమాదరించిన ఉదారుడు ప్రోలయ వేముడు. ఆయన, సాహిత్యంతోపాటు సంగీతాన్ని కూడా పోషించాడు. అతని ఆస్థానంలో లొల్లమహాదేవుడనే వాగ్గేయకారుడుండేవాడనీ, అతడు భరతుని నాట్యశాస్త్రానికి వ్యాఖ్యానం రాసిన లొల్లట భట్టుకు శిష్యుడనీ, ఎఱ్ఱన హరివంశంలో పేర్కొన్నాడు.

ప్రోలయ వేముడు ప్రజాసంక్షేమ కార్యక్రమాల నెన్నింటినో చేపట్టి అమలు జరిపాడు. రాజ్యంలో చెఱువులు త్రవ్వించి, తోటలు పెంచి, వాణిజ్య పంటలను ప్రోత్సహించి, వ్యవసాయాన్ని వృద్ధి చేసి, రైతులకు సహాయపడి ప్రతి పల్లె స్వయం పోషకంగా ఉండేట్లు పాలించాడు. దూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికుల కోసం దారిలో భోజన విశ్రాంతి మందిరాలను నిర్మించి, చలిపందిళ్ళు వేయించాడు. శ్రీశైలం దర్శించిన యాత్రికులు పాతాళగంగలో స్నానం చేసి కొండనెక్కి మల్లికార్జునుని దర్శించడం చాలా కష్టంగా ఉందని ప్రోలయ వేమునితో చెప్పగా, వెంటనే పాతాళగంగ నుండి కొండ మీదికి మెట్లు కట్టించి తీర్థయాత్రలను ప్రోత్సహించాడు. అహోబలానికి కూడా చక్కని మెట్లు కట్టించి వైష్ణవులనూ సంతృప్తి పరచాడు. నిజానికి మత వైవిధ్యం గురువులు, రాజులకే కాని, ప్రజలకు లేదని తెలుసుకున్నాడు. సామాన్య ప్రజానీకం శివకేశవ భేదం లేక అన్ని దేవాలయాలనూ భక్తి పూర్వకంగా దర్శిస్తారని మెట్లు కట్టించాడు.

విద్యార్థులకు, ధ్యానం చేసుకొనేవారికి, బ్రాహ్మణులకు అగ్రహారాలనిచ్చి, యజ్ఞకర్తలుగా నిలిపాడు. బ్రాహ్మణుల హక్కు భుక్తంలో నున్న భూముల్ని తురుష్కులు స్వాధీనం చేసుకోగా, వారి నెదిరించి, తరిమి కొట్టిన తరువాత ఆ భూముల్ని యథాతథంగా బ్రాహ్మణులకు అప్పజెప్పి, అగ్రహారాలను పునరుద్ధరించడంతోపాటు, ఎన్నో భూదానాలను చేసి 'అపరిమిత భూదాన పరశురామ' అనే బిరుదును పొందాడు.

సనాతన ధర్మరక్షకునిగా బ్రాహ్మణులకు ఎన్నో దానాలను చేశాడు. క్రీ.శ. 1330వ సం॥లో వలివేరు గ్రామాన్ని అగ్రహారం చేసి బ్రహ్మభట్లకు, క్రీ.శ. 1335లో చీమకుర్తి, భీమేశ్వరం, పులికొండ, మైలవరం, కొమరిపురాల్లోని కొన్ని భూములను సర్వమాన్యాలుగా ప్రకటించి దానం చేశాడు. క్రీ.శ. 1344లో మంచాళ అగ్రహారాన్ని యలకూచి వల్లభశిష్టకు, అదే సంవత్సరంలో తన తల్లి అన్నమాంబపుణ్యం కొరకు పెరవలి గ్రామాన్ని 108 వృత్తులుగా విభజించి బ్రాహ్మణులకు సర్వాగ్రహారంగా, అష్టభోగతేజస్వామ్యంగా దానంచేశాడు. ఎఱ్ఱన నివసించిన చదలవాడను తన తమ్ముడు మల్లారెడ్డి పేర 'రెడ్డి మల్లవర'మని పేరుపెట్టి, దేవ భోగంగా ప్రకటించాడు. హేమాద్రి వ్రత, దానఖండాల్లో చెప్పిన దానాలనన్నిటినీ చేసి ధర్మనిరతునిగా పేరు తెచ్చుకున్నాడు ప్రోలయ వేమారెడ్డి.

ప్రోలయ వేముని ధైర్యసాహసాలు, దాననిరతి, గుణగణాలనుబట్టి వివిధ శాసనాలు, సమకాలీన సాహిత్యం అతని బిరుదులను తెలియజేస్తున్నాయి. వాటిలో, పల్లవాదిత్య, పల్లవ త్రినేత్ర, జగన్నొబ్బగండ, చెంచుమల చూరకార, వీరనారాయణ, మ్లేచ్ఛాబ్ధి కుంభ సంభవ, ఏకరాయ స్థాపనాచార్య, ఏక సింహాసనాలంకార, అపరిమిత భూదాన పరశురామ, శ్రీ పర్వతాహోబలసోపాన నిర్మాత, కేళాదిరాయ, సంగ్రామధనంజయ, బ్రహ్మకుండినీ సహ్యజా గౌతమీ జలక్రీడా వినోదుడు అనేవి ముఖ్యమైనవి. దాదాపు 28 సంవత్సరాలు నిరాటంకంగా, జనరంజకంగా పాలించి, కాపు జన కల్పతరువుగా ఏలిన ప్రోలయ వేమారెడ్డి తరువాత అతని దత్తపుత్రుడైన అనపోతారెడ్డి క్రీ.శ. 1354లో అద్దంకి సింహాసనాన్ని అధిష్ఠించి పాలన సాగించాడు.



అద్దంకి స్థలదుర్గం

కందకం, అద్దంకి



శివాలయంలోని ఏడుగురు అక్కచెల్లెళ్లు, అద్దంకి

శివాలయంలోని నంది, అద్దంకి



వేయిస్తంభాలగుడి, అద్దంకి



పండరంగని దేవాలయం, అద్దంకి

కొండవీడుకు రాజధానిని మార్చిన అనపోతారెడ్డి

(క్రీ.శ. 1353-1364)

ప్రోలయ వేముని తరువాత రెడ్డిరాజ్యాన్నేలిన అనపోతారెడ్డి చరిత్ర తెలుసుకోవడానికి దాక్షారామం, ఈడ్పుగల్లు, మోటుపల్లి, నాగళ్ళ, అమరావతి, మాన్యమాపురం, పచ్చల తాడిపర్రు, కొల్లూరు, అన్నవరం, రాజమండ్రి మ్యూజియం శాసనాలూ, ఉత్తర హరివంశం, విష్ణుపురాణం, వెలుగోటివారి వంశావళి, వేమభూపాలీయం, కొండవీటి దండకవిలె, మెకంజీ రాతప్రతులు ఎంతో ఉపకరిస్తాయి.

రెడ్డి రాజ్యాన్ని స్థాపించిన ప్రోలయ వేమారెడ్డికి సంతానం లేదు. తాను కలలుగన్న రాజ్యాన్ని సుస్థిరం చేసుకోవడంలో మునిగిన అతనికి తన తరువాత ఆంధ్రదేశాన్ని యవనుల నుంచీ, ఇంకా ఇరుగుపొరుగు రాజుల నుంచీ కాపాడుకోవటమెలా అన్న ప్రశ్న వేధించ సాగింది. తన తమ్ముని సంతానంలో ఒకర్ని దత్తత తీసుకోవడం ఉచితమనిపించింది. నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళున్న తమ్ముడు అన్నారెడ్డి మదిలో మెదిలాడు. పుత్ర సంతానంలోని మొదటి, చివరి వాళ్ళయిన అనపోత, అనవేమారెడ్లను, ఒక కుమార్తెను తనకు దత్తత ఇమ్మని అన్నారెడ్డిని కోరాడు. రెడ్డి రాజ్య భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అన్నారెడ్డి అంగీకరించాడు. అనపోత, అనవేమారెడ్లను ప్రోలయ వేముడు దత్తత తీసుకున్నట్లు అన్నవరం శాసనం తెలియజేస్తుంది.

దత్త పుత్రులిద్దరికీ విద్యాబుద్ధులతోపాటు సప్తాంగ పాలనా పద్ధతులు, రాజనీతి, యుద్ధతంత్రం, ఆర్థిక విధానాలు, ప్రజాసంక్షేమ చర్యల గురించి ఆయా రంగాల్లో అనుభవమున్న వాళ్లతో శిక్షణ ఇప్పించాడు ప్రోలయ వేమారెడ్డి. పెద్దవాడైన అనపోతారెడ్డి, చురుకుదనంతో అన్నింటా అగ్రగామిగా ఉంటూ 'యువరాజు'గా పట్టాభిషిక్తుడయ్యాడు. ఎఱ్ఱాప్రెగడ రచించిన హరివంశం అవతారికలో యువరాజైన అనపోతారెడ్డి ప్రస్తావన ఉంది. పాలనా వ్యవహారాల్లో ప్రోలయ వేమునికి చేదోడు వాదోడుగా ఉంటూ ఆకస్మికంగా ఉత్పన్నమయ్యే సమస్యలను అవలీలగా పరిష్కరించే నేర్పును,ప్రజల కష్ట సుఖాలను వినే ఓర్పును అలవర్చుకొన్నాడు అనపోతారెడ్డి. వేముని కొలువులో సేనా నాయకునిగా పనిచేయటంవల్ల సైన్య సమీకరణ, ఆధునీకరణ, దుర్గ నిర్మాణ, నిర్వహణ ఇంకా రక్షణ వ్యూహాల్లో కూడా అనుభవం గడించాడు. కార్యదక్షతతో రాజ్యాన్ని పాలిస్తూ కంటికి

రెప్పలా కాపాడుతున్న ప్రోలయ వేమునికి చివరి దశలో శ్వాసకోశ సంబంధమైన వ్యాధిసోకింది. బాధపడుతూనే రాజ్యపాలన చేస్తున్న ప్రోలయ వేముడు విశ్రాంతి తీసుకోవాలనుకొని యువరాజైన అనపోతారెడ్డిపై సంపూర్ణ విశ్వాసంతో పాలనా బాధ్యతలను అప్పగించాడు. క్రీ.శ. 1353లో సింహాసనాన్నధిష్ఠించిన అనపోతారెడ్డి అద్దంకి రాజధానిగా పాలిస్తూ, రెడ్డి రాజ్య వైభవానికి కృషి చేశాడు.

పాడిపంటలతో తులతూగుతూ, ఆర్థిక స్వావలంబనతో సుస్థిరంగానున్న రెడ్డి రాజ్యాన్ని ఆక్రమించటానికి శత్రురాజుల కవ్వింపులు అనపోతారెడ్డి పాలన ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే మొదలయ్యాయి. ఉత్తరం నుండి కళింగ గాంగులు, వాయవ్యం నుండి రాచకొండ వెలమలు, బహమనీలు, దక్షిణం నుండి విజయనగర రాజులు ఒకరి తరువాత ఒకరు అద్దంకిపై యుద్ధానికి సిద్ధమయ్యారు. తండ్రి నుంచే కాక, పిన తండ్రి మల్లారెడ్డి, మేనమామ నాగారెడ్డి నుండి యుద్ధ విద్యల్లో తర్ఫీదు పొందిన అనపోతారెడ్డి ఆ యుద్ధాలను సమర్థంగా తిప్పికొట్టాడు. విజయపరంపర కొనసాగినా ఒకటి రెండు ఓటములను కూడా చవిచూశాడు.

కడప జిల్లా శాసనాల్లో రట్టగుళ్ల (రెడ్ల) ప్రస్తావన

1. కమలాపురం తాలూకాలోని వెల్దుర్తి శాసనం : క్రీ.శ. 7-8 శతాబ్దం
   1. స్వస్తిశ్రీ ఎరికల్మి (తు) రాజు ల్రితి ... ణ్య కుమారు
   2. అతిశయ రట్ట కుట్టన
2. ప్రొద్దుటూరు తాలూకాలోని రామేశ్వర శాసనం : క్రీ.శ. 7వ శతాబ్దం
   14వ పంక్తి : త్రీ దు గు రట్టగుళ్లు
   15వ పంక్తి : ఆనతిగాను.
3. కమలాపురం తాలూకా చిలంకూరు శాసనం : క్రీ.శ. 8వ శతాబ్దం
   15వ పంక్తి : తొల్ప కామి రట్టగుళ్లు
   16వ పంక్తి : చోతీయ రట్టగుళ్లు
   17వ పంక్తి : అతిశ్రయ ర)ట్టగుళ్లు
4. పులివెందుల తాలూకాలోని బలపనూరు శాసనం : క్రీ.శ. 9వ శతాబ్దం
   10వ పంక్తి : ప ర(ట్టు)డి యు సు
5. కమలాపురం తాలూకాలోని చిలంకూరు శాసనం (బాణుల కాలం)
   11వ పంక్తి : సటి రట్ట
   12వ పంక్తి : కుడికి

సేకరణ : ప్రొ. జి. శివారెడ్డి

కళింగ గాంగులతో రెడ్డిరాజుల మొదటి యుద్ధం

ముసునూరి కాపయనాయకుని అధీనంలో ఉన్న రాజమహేంద్రవరాన్ని అతని ఆజ్ఞలకు లోబడి తొయ్యేటి అనపోతానేడు పాలిస్తుండే సమయంలో తూర్పు గాంగరాజైన మూడవ నరసింహదేవుడు దక్షిణ కళింగాన్ని దాటి రెడ్డిరాజ్య సరిహద్దుల వరకు దండెత్తాడు. కృష్ణా తీరం వరకూ గల భూభాగం వశమైతే సముద్ర వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడం ద్వారా ఆర్థికంగా మరింత బలపడవచ్చని, ఎక్కువ దిగుబడినిచ్చే సారవంతమైన భూములను ఆక్రమించడం ద్వారా దేశం సుభిక్ష మౌతుందనుకొని, తన సేనాపతులైన కాళిదాసు, గోవిందులను క్రీ.శ. 1353లో దక్షిణ కళింగానికి హద్దైన గోదావరిని దాటి, కృష్ణానది వరకూ పంపుతాడు. ప్రస్తుతం కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళం వరకూ వచ్చిన సైన్యాలు రాజు, రాణీల కోరికపై శ్రీకాకొలని దేవునికి పట్టు గొడుగులు, వెండి దీపాలు, బంగారు మామిడి పిందెలతో అలంకరింపబడిన వింజామరలు, గుడిగంటలను సమర్పించినట్లు క్రీ.శ. 1353 నాటి నరసింహదేవుని శాసనం వల్ల తెలుస్తుంది. గాంగరాజు దుందుడుకు చర్యను గమనించిన అనపోతారెడ్డి, రెడ్డి రాజ్యానికి ముప్పు వాటిల్లుతుందని గ్రహించి, శక్తి యుక్తులతో కళింగ గాంగులపై యుద్ధాన్ని ప్రకటించాడు. అనపోతారెడ్డి యుద్ధ చతురతకు, వ్యూహరచనకు పాలుపోని నరసింహదేవుని సేనలు వెనుదిరిగి కళింగం చేరుకున్నాయి. ఇదే కళింగ గాంగులకు, రెడ్డిరాజులకు జరిగిన మొదటి యుద్ధం.

విజయపరంపరలో భాగంగా 'ద్వీపాన్ని' (దివిసీమ) జయించడం ద్వారా అనపోతారెడ్డి 'ద్వీపజేత' అన్న బిరుదును పొందాడు. కళింగ ప్రాంతపు శబరులను కూడా జయించినట్లు ఈడ్పుగల్లు, పచ్చల తాడిపర్రు శాసనాలు తెలియజేస్తున్నాయి.

వేంగిని పాలిస్తున్న చోడభక్తి రాజుకు, అనపోతారెడ్డికి కృష్ణాజిల్లా నూజివీడు సమీపంలో సూరవరం దగ్గర జరిగిన యుద్ధంలో అనపోతారెడ్డి ఓడిపోయాడని, చోడభక్తిరాజు కొడుకు అన్నదేవుని రాజమండ్రి మ్యూజియం శాసనం వల్ల తెలుస్తున్నా, వేంగిరాజుకు అది తాత్కాలిక విజయం మాత్రమేననిపిస్తోంది. తరువాత అనపోతారెడ్డి చేపట్టిన జైత్రయాత్రలో చోడభక్తిరాజు, ఉండిరాజు, నిరవద్యపురం మహదేవుడు, కోనమండలాధిపతులను జయించినట్లు తెలిపే చారిత్రకాధారాలు లభించాయి. ప్రతి

సంవత్సరం అనపోతారెడ్డి శత్రురాజుపై యుద్ధానికి వెళ్ళేవాడనీ, అనవేమారెడ్డి కొల్లూరు శాసనంలో ఉంది. అతడు క్రీ.శ. 1356 వ సం.లో దాక్షారామంలో వేయించిన శాసనం వల్ల తూర్పు జైత్రయాత్ర కళింగ వరకూ జరిగిందని చెప్ప వీలవుతుంది. ఎన్నో యుద్ధాల్లో పాల్గొని జయించి, శత్రురాజుల కోటలను వశపరచుకొన్నందువల్ల అతనిని 'వీరాన్నపోత' బిరుదు వరించింది.

యుద్ధాల వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికి వ్యాపారాన్ని ప్రోత్సహించడం, వ్యవసాయాన్ని విస్తరింపచేయడం ముఖ్యమని గమనించి సముద్ర తీర వ్యాపారాభివృద్ధికి మోటుపల్లి రేవును పూర్తిస్థాయికి వినియోగించుకోవడం, బీడు భూముల్ని వ్యవసాయ యోగ్యంగా మార్చడం, సేద్యపు నీటి నిరంతర సరఫరాకు చెరువులను త్రవ్వించడం లాంటి చర్యలను చేపట్టాడు అనపోతారెడ్డి.

మోటుపల్లి రేవు అభివృద్ధి

ప్రోలయ వేముని తమ్ముడు మల్లారెడ్డి, చీరాల సమీపంలో సముద్రతీరానున్న ముకుళపురమని పేరున్న మోటుపల్లి రేవును రెడ్డి రాజ్యాంతర్భాగంగా చేయడంతో నౌకలద్వారా విదేశాలతో వ్యాపారం చేయటానికి వీలు కల్గింది. స్థానికంగా అందుబాటులో లేని ఎన్నో వస్తువులు విరివిగా లభించాయి. ఇక్కడ తయారైన బట్టలు, పండిన ధాన్యం మోటుపల్లి ద్వారా ఎగుమతి అవుతుండేవి. దిగుమతిగా వచ్చే విలువైన వజ్రాలు, నగలపైన విధించిన సుంకాల ద్వారా ప్రభుత్వానికి ఎంతో ఆదాయం లభించేది. తన రాజధాని అద్దంకికి సమీపంలో నున్న రేవును ఇంకా అభివృద్ధి చేసి ఆదాయ వనరుల్ని పెంపొందించుకోవాలనుకొన్నాడు. మోటుపల్లి రేవును సందర్శించి, స్వదేశీ విదేశీ వ్యాపారుల సాధక బాధకాల్ని విన్నాడు.

కొన్ని రకాల వస్తువులపై దిగుమతి సుంకం ఎక్కువగా ఉందని, ఓడలు వచ్చినప్పుడు రాజోద్యోగులు స్వేచ్ఛగా వ్యాపారాన్ని చేయనీయడం లేదని, వ్యాపారస్థులు అనపోతారెడ్డికి తెలియజేస్తారు. సముద్రంలో ప్రమాదానికి గురైనప్పుడు ఒడ్డుకు చేరిన ఓడలలోని సరుకుల విషయంలో ఉదారంగా వ్యవహరించాలే గానీ మొత్తం సరుకులను ప్రభుత్వం స్వాధీనంచేసుకోకుండా, నామ మాత్ర సుంకం తీసుకొని మిగతావాటిని వారి బంధువులకు అప్పగించే చర్యలు తీసుకోవాలని రాజుతో వారు చెప్పుకొంటారు. దాదాపు వంద సంవత్సరాల క్రితం కాకతీయ గణపతిదేవుడు సముద్రవ్యాపారుల సంక్షేమానికి సంబంధించి క్రీ.శ. 1244లో ఇచ్చిన అభయశాసనాన్ని అనపోతారెడ్డికి గుర్తు చేస్తారు.

పన్నుల మదింపు, విధింపుల్లో ఉచితానుచితాలను పరిశీలించగల విశాల హృదయమున్న అనపోతారెడ్డి వ్యాపారుల బాధలు, రాజోద్యోగుల ప్రవర్తనలకు చలించి గణపతిదేవుని అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించుకొంటాడు. మంత్రులు, మిత్రులతో

సంప్రదించి ఆదాయాన్నందించే వ్యాపారులకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకొంటాడు. క్రీ.శ. 1358లో తాను కూడా ఒక అభయ శాసనాన్ని సంస్కృతం, తెలుగు భాషల్లో విడుదల చేశాడు. దీన్నే మోటుపల్లి ధర్మశాసనం అని కూడా అంటారు. మోటుపల్లి వీరభద్రాలయంలో నున్న ఈ శాసనం ప్రకారం నౌకా వ్యాపారులకు లాభం కలిగే అనేక చర్యలు చేపట్టాడు. విదేశీ వ్యాపారులపై విధించి వసూలు చేస్తున్న 'అపుత్రికము' 'కబ్బాయము' అనే సుంకాలను పూర్తిగా తొలగించాడు. అలంకార ప్రియులైన ఆంధ్రదేశ స్త్రీల అవసరాలకు, ఇతర ప్రాంతాల్లో తయారైన బంగారు ఆభరణాలు, విలువైన వజ్ర వైడూర్యాల దిగుమతి విషయంలో సుంకాలను బాగా తగ్గించాడు. గంధం దిగుమతి చేసుకొన్నప్పుడు చెల్లించే పన్నులో 33 శాతం తగ్గించి, తమిళ దేశం మొదలైన ప్రాంతాల నుండి వచ్చే పట్టు బట్టలు, నూలు, ముత్యాల మీద వ్యాపారులకు అంగీకారయోగ్యమైన పన్నులను మాత్రమే వసూలు చేయాలని సుంకాధికారుల్ని ఆదేశించాడు.

సరుకుల ఎగుమతి దిగుమతి సమయాల్లో వ్యాపారులు బసచేయటానికి వసతి సౌకర్యాలను కల్పించాడు. స్వదేశీ విదేశీ వ్యాపారం సాగించడానికి సరళీకృత ఆర్థిక విధానాన్ని ప్రకటించాడు. సుంకాలను పూర్తిగా తొలగించడం, మరికొన్నింటిపై రాయితీల నివ్వడం, రేవులో వ్యాపారులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడం, రాజోద్యోగులు, సుంకాధికారులు వ్యాపారులను పీడించి వసూలు చేయటాన్ని నిరోధించడం లాంటి అనేక చర్యలు చేపట్టి అనపోతారెడ్డి మోటుపల్లి రేవు పట్టణాభివృద్ధికి, తద్వారా నౌకా వ్యాపార విస్తరణకు పూనుకొన్నాడు. 1970 దశకంలో మోటుపల్లి వద్ద రాష్ట్ర పురావస్తు శాఖ జరిపిన త్రవ్వకాల్లో మధ్యయుగానికి చెందిన చైనా పింగాణీ పాత్రలు, చైనా నాణేలు, చోళుల నాణేలు, కంచు విగ్రహాలు వెలుగుచూశాయి. మోటుపల్లి రేవును ఇరుగుపొరుగు ప్రాంతాల వారే కాక చైనా లాంటి సుదూర ప్రాంత వ్యాపారులు కూడా వినియోగించుకొన్నారని రూఢి అయింది. ఇసుక దిబ్బల నుండి బయల్పడ్డ రెండు కట్టడాల్లో ఒకటి సుంకాలను వసూలు చేసే 'కస్టమ్స్ హౌస్'గానూ, మరోటి వ్యాపారుల వసతి కొరకో లేక సరుకులను నిల్వ చేసే గిడ్డంగి గానో ఉపయోగపడి ఉంటాయని పురాతత్వ వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. అవచి కుటుంబం ఈ రేవు ద్వారా నిర్వహించిన నౌకా వ్యాపారం రెడ్డి రాజుల కాలంలోనే కాబట్టి, ఈ కట్టడాలు రెడ్డిరాజుల నాటివేననే మరో అభిప్రాయం కూడా ఉంది.

బహమనీలతో యుద్ధం

బహమనీ సుల్తాన్ మొదటి మహమ్మదుషా సింహాసనమెక్కిన సంవత్సరం (క్రీ.శ. 1360)లో అతడు కాపయనాయకుని పాలనలోనున్న వరంగల్‌పైకి దండెత్తాడు. వరంగల్‌ను వశపరచుకొని తూర్పుగా గుంటూరు సమీపంలో కృష్ణా తీరానున్న ధరణికోట వరకూ వెళ్ళి అక్కడి అమరేశ్వరాలయానికి నష్టం కలిగిస్తాడు. బహమనీ సైన్యాన్ని

అనపోతారెడ్డి మంత్రి కేతయమల్లవేమ సేనాధిపతి ఎదిరించి తరిమికొట్టడమే గాక రెడ్డి రాజ్యాన్ని రక్షించాడు. అనపోతారెడ్డి తనపట్ల చూపుతున్న అభిమానానికి మల్లయ మంత్రి, ఈ యుద్ధంలో విజయానికి కృషి చేశాడు. అనపోతారెడ్డి ఆయురారోగ్య ఐశ్వర్య వంశాభివృద్ధికి శ్రీధాన్యవాటీపురం (అమరావతి)లోని అమరేశ్వరాలయానికి జీర్ణోద్ధరణ చేసి, అమరేశ్వరుణ్ణి పునఃప్రతిష్ఠ చేసినట్లు మల్లయవేముని క్రీ.శ. 1361వ సం.పు అమరావతి శాసనం తెలియజేస్తుంది.

రేచెర్ల వెలమలతో యుద్ధం

ముసునూరి కాపయనాయకుడు వరంగల్‌ను స్వాధీనం చేసుకొన్నపుడు జరిగిన యుద్ధంలో అతనికి సాయంచేసిన రేచెర్ల వెలమలు తరువాత స్వతంత్రులై నల్లగొండ జిల్లాలో మూసీనది ఒడ్డునున్న ఆమనగల్లును రాజధానిగా చేసుకొని కొంత భూభాగాన్ని పాలించారు. ఆ వంశానికి చెందిన సింగమనేడు తన రాజ్య విస్తరణలో భాగంగా జల్లిపల్లి కోటను ముట్టడిస్తాడు. కొందరు రాజుల మూకుమ్మడి దాడిలో అతడు ప్రాణాలు కోల్పోతాడు. సింగమనేని కొడుకులైన అనపోత, మాదానాయకులు (క్రీ.శ. 1361-1384) తమ తండ్రి మరణానికి కారణ భూతులైన శత్రురాజులను హతమార్చడానికి పూనుకొంటారు. సింగమనేడు మరణానికి రెడ్డిరాజులు కూడా కారణమని అపోహపడిన వారు, అనపోతారెడ్డి పాలిస్తున్న రెడ్డి రాజ్యంపై ధరణికోట దగ్గర తీవ్రమైన యుద్ధం చేస్తారు. అయితే జయాపజయాలెలా ఉన్నా, వెలుగోటివారి వంశావళి అనపోతారెడ్డి ఓడిపోయాడని తెలుపుతోంది. రెడ్డి రాజ్యంలోని శ్రీశైల ప్రాంతాన్ని ఆక్రమించుకొని మాదానాయకుడు ప్రతీకారం తీరిందన్న సంతృప్తితో వెనుదిరిగిపోతాడు. శాసనాధారాలు లేని ఈ యుద్ధంపై చారిత్రకులు సరైన నిర్ణయానికి రాలేకపోయారు. ఈ ధరణికోట యుద్ధమే రెడ్డి రాజులకూ, రేచెర్ల వెలమలకూ జరిగిన మొదటి యుద్ధం.

విజయ నగరరాజు కవ్వింపు : రాజధాని కొండవీడుకు మార్పు

అనవేమారెడ్డి కొల్లూరు శాసనంలో చెప్పినట్లు అనపోతారెడ్డికి ప్రతి సంవత్సరమూ యుద్ధాలతోనే సరిపోయింది. బహమనీలు, వెలమలతో పోరాడి రాజ్యాన్ని రక్షించుకొంటున్న సమయంలో విజయనగరాధీశుడైన మొదటి బుక్కరాయలు, రెడ్డిరాజ్యపు దక్షిణ, పశ్చిమ భాగాలను వశపరచుకొన్నాడు. క్రీ.శ. 1364లో బుక్కరాయలు తూర్పుదండయాత్రలో రెడ్డి రాజ్యంలోని కొంత భూభాగాన్ని ఆక్రమించినట్లు తెలుస్తుంది. విజయనగర రాజుల వల్ల రానున్న ముప్పును గ్రహించిన అనపోతారెడ్డి రాజ్యరక్షణ వ్యూహాల్లో నిమగ్నుడౌతాడు. ముందు రాజధాని అద్దంకి నగరంపై దృష్టిని సారిస్తాడు. కేవలం స్థలదుర్గమైన అద్దంకి చిన్న నగరమేకాని, నలు దిక్కుల నుండి వచ్చే శత్రువుల దాడిని తట్టుకోగల దుర్గం కాదని గ్రహించాడు. సమతల ప్రదేశంమీద ఉండడం చేత శత్రువులు సులువుగా దాడిచేసే

వీలుంది. రాజ్యాన్ని రక్షించుకోవాలంటే బలమైన కోటగోడలతో నున్న రాజధాని ఉండాలనుకొన్నాడు. కుండిన నగరంగా పిలువబడిన కొండవీడును, వినుకొండ, బెల్లంకొండ, కొండపల్లి కోటలకంటే బలమైనదిగా నిర్మించాడు ప్రోలయ వేమారెడ్డి. శాఖానగరంగా కూడా అయిన కొండవీడులో ఒక పట్టణాన్ని నిర్మించి, సకల సౌకర్యాలు కల్పించి తన రాజధానిని అద్దంకి నుండి కొండవీడుకు మార్చాడు. శత్రుదుర్భేద్యమైన కోట గోడలను నిర్మించి, యంత్రోపపరికల్పితంగా చేసి కొండవీటి నుండి అనపోతారెడ్డి పాలించాడని క్రీ.శ. 1364వ సంవత్సరపు మాన్యమాపుర శాసనం, కాటయవేముని అన్నవరం శాసనం, శ్రీనాథుని శృంగార నైషధం తెలియ జేస్తున్నాయి.

అనపోతారెడ్డికి మల్లన, సోమయ, కేతయ మల్లవేమన మంత్రులు రాజ్యాంగ, రాజకీయ, ఆర్థిక విషయాల్లో సలహాలనిచ్చి పరిపాలన సజావుగా సాగడానికి తోడ్పడ్డారు. ఆర్థిక వాణిజ్య శాస్త్రాలపై అవగాహన ఉన్న సోమయ మంత్రి మోటుపల్లి రేవు అభివృద్ధికి రాజుకు తగు సలహాలనిచ్చి, నౌకా వ్యాపారుల కొరకు సంస్కృత తమిళ తెలుగు భాషల్లో అభయ శాసనాన్ని వేయించాడు. చతురంగ బలనిర్వహణా దక్షుడైన కేతయ మల్ల మంత్రి ధరణికోటను రక్షిస్తుండేవాడు. బహమనీ సైన్యాన్ని తిప్పికొట్టడంలో కీలక పాత్ర వహించాడు. అనపోతారెడ్డికి కుడిభుజంగా ఉంటూ రెడ్డి రాజ్య ఔన్నత్యానికి తనవంతు సహకారం అందించిన యుక్తిపరుడుగా కూడా పేరుగాంచాడు.

అనపోతారెడ్డి కూడా తన తండ్రి ప్రోలయ వేముని వలెనే ప్రజారంజకుడై పాలించాడు. జ్యోతిష ఆయుర్వేద విద్యలను ప్రోత్సహించి, అగ్రహారాలను పునరుద్ధరించడమే కాక, బ్రాహ్మణులకు ఎన్నో దానాలు చేశాడు. తెనాలి సమీపంలోని కొల్లూరు, గుడివాడ సమీపంలోని ఈడుపుగల్లు, వినుకొండ సమీపంలోని నాగళ్ళ, పొన్నూరు సమీపంలోని పచ్చల తాడిపర్రు మొదలైన గ్రామాలను అగ్రహారాలుగా మార్చి బ్రాహ్మణులకు దానం చేశాడు. యోగ్యులైన బంధువులకు తగిన పదవులనిచ్చి గౌరవించాడు. అనపోతారెడ్డి ఆస్థానంలో కవులు, గాయకులు, వేద మంత్రాలను పఠించే ఘనాపాఠీలు ఉన్నారు. అనపోతారెడ్డి ఆస్థాన విద్వాంసుల్లో బాలసరస్వతి ముఖ్యుడు. ఇతడు శాసన పాఠ రచయితగా పేర్కొనబడి, అనవేముని ఆస్థానంలో కూడా సేవలను అందించిన గొప్పపండితుడు.

అనపోతారెడ్డి భార్య మనుమాంబ. త్రిపురాంతక దేవుని కృపవల్ల కొడుకు పుట్టినందువల్ల, అతనికి త్రిపురాంతకాలయమున్న కుమారాచలం (కుమారగిరి) కొండపేరు మీదుగా 'కుమారగిరి రెడ్డి' అని పేరు పెట్టారు. అనపోతారెడ్డి కూతురు అన్నమ లేక దొడ్డాంబికను మేనల్లుడు కాటయ వేముని కిచ్చి వివాహం చేశాడు. అనపోతారెడ్డి అనంతరం, కుమారగిరిరెడ్డి చిన్న వాడైనందున అనవేమారెడ్డి క్రీ.శ. 1364లో కొండవీడు సింహాసనాన్నధిష్ఠించి రెడ్డి రాజ్యాన్ని పాలించాడు.

ఆదర్శ పాలకుడు అనవేమారెడ్డి

(క్రీ.శ. 1364 - 1386)

అనపోతారెడ్డి తరువాత, అతని తమ్ముడు అనవేమారెడ్డి కొండవీటి సింహాసనాన్ని అధిష్ఠించి, క్రీ.శ. 1364 నుండి క్రీ.శ. 1386 వరకూ ప్రజారంజకుడై రెడ్డి రాజ్యాన్ని పాలించాడు. అనవేముని చరిత్ర, జీవిత విశేషాలు తెలుసుకోవటానికి పెదచెరుకూరు (క్రీ.శ. 1371), నడుపూరు (క్రీ.శ. 1374), సింహాచలం (క్రీ.శ. 1375), వాడపల్లి (క్రీ.శ. 1377), పలివెల (క్రీ.శ. 1377), శ్రీశైలం (క్రీ.శ. 1378), దాక్షారామం (క్రీ.శ. 1381), మాన్యమాపురం (క్రీ.శ. 1382), అనపర్తి (కుమారగిరి రెడ్డి క్రీ.శ. 1390) శాసనాలతోపాటు దృజ్జవరం, ఇప్పగల్లు, పచ్చల తాడిపర్రు, కొల్లూరు, వానపల్లి, పెదపలకలూరు శాసనాలు, వెన్నెలకంటి సూరన రచించిన విష్ణుపురాణం, శ్రీనాథుని శృంగారనైషధ గ్రంథాలు ఉపకరిస్తాయి.

యుద్ధాలతో సతమతమైనా, రెడ్డిరాజ్య కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింప జేసిన అనపోతారెడ్డి అనుకోకుండా క్రీ.శ. 1364వ సం.లో మరణించాడు. తక్షణ కర్తవ్యం బోధపడని రాజప్రాసాదంలోనే కాక రాజధాని నగరంలో కూడా గుసగుసలు ప్రారంభమైనాయి. అనపోతారెడ్డి కుమారుడు కుమారగిరిరెడ్డి అందరి మదిలో మెదిలాడు. రాజ్యమంటే ఏమిటో, రాజకీయ మంటే ఏమిటో తెలియని అతిపిన్నవయసు. విద్య, వినోదాలు, ఆటపాటలతో కాలం గడుపుతున్న కుమారగిరి రెడ్డికి పట్టం కడితే, రాజ్యరక్షణ సవాలుగా పరిణమించే అవకాశమున్నందున, రాజధానిలో రాజకీయ ధురంధరులు ఆలోచనల్లో మునిగారు. రెడ్డి రాజ్య నిర్మాత ప్రోలయ వేమారెడ్డి ఆశయాల మేరకు పాలించిన అనపోతారెడ్డికి పాలనా పరంగానూ, రక్షణపరంగానూ చేదోడు వాదోడుగా నున్న అతని తమ్ముడు అనవేమారెడ్డికి పట్టం కట్టాలని కాటయరెడ్డి మొదలైన రాజకుటుంబీకులు, మంత్రులు, పండితులు ఏకాభిప్రాయానికి వచ్చారు. అన్న చనిపోయి దుఃఖంలో ఉన్న అనవేమునికి ఈ నిర్ణయం రుచించక, ప్రశ్నార్థకంగా చూశాడు.

కుమారగిరికి యుక్త వయసూ, పరిపాలనా దక్షతా అబ్బిన తరువాత తిరిగి అతనికే కొండవీటి సామ్రాజ్యాన్ని అప్పగించమనీ, అంతవరకూ రాజ్యంలో శాంతి భద్రతలను కాపాడి, రాజ్యభారాన్ని వహించమని ప్రాధేయపడిన రాజకీయ చతురులు, మంత్రులు, హితులు ఇచ్చిన సలహా ప్రకారం సింహాసనాన్నధిష్ఠించడానికి అనవేముడు అంగీకరించాడు. ప్రచారంలో నున్నట్లు, అనవేముడు కుయుక్తితో సింహాసనాన్ని ఆక్రమించాడనడం సరికాదని తెలుస్తుంది. అతని అనపర్తి శాసనంలో అనపోతారెడ్డి, అనవేమారెడ్డి, ధర్మనిరతితో పాలించారని పేర్కొనడం చేత పై వాదం అపోహ మాత్రమేననిపించక మానదు. శ్రీశైలం, దృజ్జవరం శాసనాల్లోని 'రాజ్యరమాశ్రీ స్వయంవర లబ్ధనాయక", "రాజ్యశ్రీ రమాస్వయం వరపతి శ్రీయన్న వేమప్రభుః" అన్న విశేషాలు అప్పటి కాల పరిస్థితుల ప్రకారం అనవేముని రాజ్యశ్రీ స్వయంగా వరించిందనుకోవడానికి ఆస్కారమిస్తున్నాయి.

మంత్రులు, సామంతులు, దండనాయక, మండలేశ్వరులు ముక్త కంఠంతో అనవేముని ప్రతిభా పాటవాలు, శక్తియుక్తులను అంచనా వేయటంతో, అన్నతోపాటు పాలనా వ్యవహారాల్లో కూడా అనుభవమున్నందున రాజమకుటం అనవేమారెడ్డిని వరించింది. కొండవీటి సింహాసనంపై తొలిసారిగా కూర్చున్న అనవేముని మదిలో రెండు ఆలోచనలు మెదిలాయి. పిన్నవాడైన కుమారగిరిని విద్యాబుద్ధుల్లో, యుద్ధ తంత్రాల్లో నేర్పరిని గావించి యువరాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేయడం మొదటిదైతే, తన తండ్రి ప్రోలయ వేముడు నిర్మించిన సామ్రాజ్యంలో తన అన్న పాలనలో శత్రువులపాలైన కొన్ని భూభాగాలను తిరిగి వశపరచుకోవడంతోపాటు రాజ్యాన్ని ఇంకా విస్తరించడం రెండోది. మేనమామ దగ్గర నేర్చుకున్న యుద్ధ చతురత, అన్న ఆజ్ఞల కింద నిర్వహించిన రాజ్యాంగ విధులు, అతని ఆలోచనలను మరింత బలోపేతం చేశాయి. కుమారగిరికి రాజవిద్యలనన్నింటినీ నేర్పటానికి తగు ఏర్పాట్లు చేశాడు. అస్త్ర శస్త్ర ప్రయోగంలో మెలకువలను నేర్పించడమేకాక, మల్లయుద్ధం, గుర్రపు స్వారీ మొదలైన వాటిలో పేరుగాంచిన విలువిద్యా నిపుణులు, మల్ల యుద్ధ జెట్టీలను నియమించాడు. సంగీత వాద్య పరికరాలపై సంప్రదాయ పద్ధతిలో శిక్షణ నిప్పించి, నృత్య గాన ప్రక్రియలపట్ల అవగాహన కల్పించడానికి తగు ఉపాధ్యాయులను నియమించాడు. తరువాత రాజ్యంలో సుస్థిరత సాధించి, ప్రజల మన్ననలను పొందాడు. ఆర్థిక స్వావలంబనకు వర్తకాన్ని ప్రోత్సహించి ఎగుమతి, దిగుమతులను కూడా అనుమతించాడు అనవేమారెడ్డి.

అనపోతారెడ్డి పాలన చివరి సంవత్సరాలలో శత్రువులు చేజిక్కించుకొన్న కొంత భూభాగాన్ని తిరిగి స్వాధీన పరచుకొని కొండవీటి సామ్రాజ్య గత వైభవ ప్రాభవాలను దిగంతాలకు ప్రసరింపజేయాలని దృఢంగా విశ్వసించాడు. మంత్రులు, సామంతులు, మండలేశ్వర, దండనాయకులతో మంతనాలు జరిపాడు. యుద్ధానికి సిద్ధం కావాలన్న వారి ఏకగ్రీవ నిర్ణయానికి బాధ్యుడైనాడు. బలవంతులైన విజయనగర రాజుల జోలికిగానీ,

కొండవీటికి ఎంతో దూరంలో నున్న తూర్పు గాంగుల మీదికి గాని, సమ ఉజ్జీలైన వెలమల మీదికి గానీ యుద్ధానికి తరలిపోవడానికి ఇది అదను కాదని గూఢచారులు సమాచారాన్ని అందించారు. వారి సూచనమేరకు ముందుగా గోదావరీ ప్రాంతంలో స్వతంత్ర పాలన సాగిస్తున్న మండలేశ్వరులను జయించి తరువాత తూర్పుదిశగా ముందుకు సాగటం మంచిదనుకొన్నాడు. అందుకు కావలసిన సైన్యం, ఆయుధాలు, గజాశ్వ వస్తు వాహనాలను సమకూర్చుకొన్నాడు.

అంతలోనే కొండవీటిలో యుద్ధభేరి మోగింది. సైన్యాధ్యక్షుడు, వివిధ దళ నాయకులు సంకేత వచనాలతో సైన్యాన్ని సమాయత్తం చేశారు. కదన కుతూహలంతో సేనావాహిని బయలుదేరింది. తన అన్న జయించిన దీవిని తిరిగి శత్రువులు చేజిక్కించుకొన్నందున దీవిని జయించడానికి అటువైపుగా వెళ్లమని తన సేనానాయకుడు, ఆంతరంగిక మంత్రివర్యుడైన చెన్నమనాయకునికి సూచనలిచ్చాడు అనవేమారెడ్డి. జలదుర్గమైన దీవి కోటను చుట్టు ముట్టి అనతి కాలంలోనే స్వాధీనం చేసుకుని 'దీవి దుర్గ విభాళ' అనే బిరుదును పొందాడు.

దీవిని జయించిన సమరోత్సాహంతో కృష్ణాగోదావరీ నదుల మధ్యగల ప్రాంతాన్ని స్వాధీనపరచుకోవాలనుకొని ముందుకు సాగాడు. డిండి, సూరవరం పట్టణాల నుండి కొద్దిపాటి భూభాగాలను పాలిస్తున్న సూర్యవంశపు రాజులను లొంగదీసుకొన్నాడు. నిడదవోలు (నిరవద్యపురం) నుండి పాలిస్తున్న చంద్రవంశపు చాళుక్యులు అనవేముని ఆధిపత్యాన్ని అంగీకరించారు. కామవరపుకోట నుండి పాలిస్తున్న భక్తిరాజచోడుని కొడుకైన అన్నదేవచోళుడు అన్యాయంగా కాజేసిన రాజసింహాసనాన్ని చేజిక్కించుకొని తన ముద్దుల చెల్లి వేమసాని భర్త భీమదేవ చోడునికి పట్టం కట్టాడు అనవేమారెడ్డి. కోనసీమకు వెళ్ళిన అనవేముని సేనలు అక్కడున్న అనేక స్థల జల వన గిరి దుర్గాలను జయించడంతో అనవేమారెడ్డి "సాగర గౌతమీ సలిల సంగమ జలదుర్గ సాధన రఘురామ" అనే బిరుదును పొందాడు.

విజయ పరంపరతో సమరసింహుడైన అనవేముని మదిలో రాజమహేంద్ర వరం మెదిలింది. కవులతో, గాయకులతో అలరారుతున్న రాజమహేంద్రిని తన అధీనంలోకి తెచ్చుకోవాలనుకొన్నాడు. శక్తియుక్తులతో శత్రుదుర్భేద్యమైన రాజమహేంద్రవరపు కోటను జయించి పట్టణాన్ని పూర్తిగా స్వాధీన పరచుకొన్నాడు. తూర్పు దండయాత్రలో జయించిన కోటలను ప్రస్తావిస్తూ అనవేముని శ్రీశైలం శాసనం 'రాజమహేంద్ర నిరవద్య నగరాది బహువిధ స్థల దుర్గ వర్గ విదళన బలరామ' అని పొగిడింది. తన అన్న అనపోతారెడ్డి సూరవరం వద్ద పొందిన అపజయానికి ప్రతీకారంగా వేంగిని జయించిన అనవేమునికి, తాను ఋణం తీర్చుకొన్న సంతృప్తి మిగిలింది.

రాజమహేంద్రానికి సమీపంలో నున్న కోరుకొండను పాలిస్తున్న మంచి కొండ వంశీయులు ముమ్మడి సింగమ నాయకులకు అనవేమారెడ్డి సకల సైన్యంతో వస్తున్న సంగతి తెలిసింది. అతన్ని ఎదుర్కొనడానికి సిద్ధమయ్యారు మంచికొండ ప్రభువులు. ముందుగా ఊహించినట్లే ఇరువర్గాలకూ జరిగిన యుద్ధంలో విజయం అనవేమారెడ్డినే వరించింది. అనవేముని సార్వభౌమత్వాన్ని అంగీకరించిన కోరుకొండ పాలకులు, ప్రతి యేటా కొంత కప్పం చెల్లిస్తూ తమ ప్రాంతాన్ని పాలించుకునే హక్కును సంపాదించారు.

కోరుకొండను జయించిన తరువాత పిఠాపురం, కొఠాము ప్రాంతాల నేలుతున్న కొప్పుల వంశీయులను కూడా లోబరచుకొని, కొద్ది సంవత్సరాల క్రితం కొండవీటి రాజ్యంపైకి దండెత్తివచ్చిన కళింగ గాంగరాజు మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకొన్నాడు అనవేమారెడ్డి. దండనాయక సైన్యాధ్యక్షులతో చర్చించిన మీదట సింహాచలం వైపు సేనలను తూర్పు దిశగా నడిపించాడు. చెన్నమనాయుని అధ్వర్యంలో సాగిన ఈ దండయాత్రలో మార్గమధ్యంలో ఉన్న యలమంచిలి చాళుక్యులను, ఒడ్డాది మత్స్యరాజులను కూడా లోబరచుకోవటానికి పథకరచన చేశారు. యలమంచిలి చాళుక్య రాజు నాలుగవ ఉపేంద్ర దేవుడు, అనవేమారెడ్డికి లొంగిపోయాడు. వశపరచుకొన్న సైన్యం కూడా కదిలిరాగా, కదన కుతూహలుడైన అనవేమారెడ్డి తాను ఆక్రమించదలచుకొన్న సింహాచలం దగ్గరలోనే ఉందని తెలుసుకొని సంతోషించాడు. ఆంధ్ర కళింగ దేశాలకు సింహాచలమే ఎల్లగా ఉండాలని, సింహాద్రి అప్పన్న తన రాజ్య సరిహద్దును శత్రువుల బారి నుండి కాపాడాలని మనసారా కోరుకొన్నాడు. శారదా నదీ తీరానున్న వడ్డాది నుండి సింహాచలం ప్రాంతాన్ని తమ అధీనంలో ఉంచుకొని పాలిస్తున్న మత్స్యరాజు వీరార్జున దేవుడు అనవేముని సైన్యపు ధాటికి తట్టుకోలేక లొంగిపోయాడు. మళ్లీ సైన్యం ముందుకు సాగింది. సింహాచలం కొండను చూచిన సైనికులు కేరింతలు కొడుతూ ఆలయాన్ని సమీపించారు. సింహాద్రి నరసింహనాథునికి ఏప్రిల్ 4వ తేది, క్రీ.శ. 1375వ సం.లో తన కోర్కె నెరవేరినందుకు కొన్ని దానాలను ప్రకటించాడు అనవేమారెడ్డి. అతని ప్రధాని, దండనాయకుడు చెన్నమనాయకుడు ఒడ్డాది రాజు తనకు బహుమతిగా ఇచ్చిన 'గోటివాడ'లో కొంత భూమిని దానం చేశాడు. ఈ ప్రాంతాన్ని తన ఏలుబడిలోకి తెచ్చుకొన్నందుస అనవేమారెడ్డి, 'సింహాచలాది వింధ్యపాద ప్రతిష్ఠాపిత కీర్తి స్తంభ" అనే బిరుదును పొందాడు. తరువాత కొండవీటికి తిరిగి వచ్చి ధర్మపాలన సాగించాడు.

కొండవీటి సింహాసనానికి తూర్పుదిశ నుండి ముప్పు తప్పినా వాయవ్య ప్రాంతంలో వెలమలు, పశ్చిమ ప్రాంతంలో విజయనగరరాజులు కయ్యానికి కాలుదువ్వుతూనే ఉన్నారు. వారిరువురికి సరైన సమాధానం చెప్పాలనుకొన్నట్లు అనవేముడు ముందుగా రేచెర్ల వెలమల పైకి దండెత్తివెళ్ళాడు. వారి భూభాగంలోని వాడపల్లి వరకూ స్వాధీనం చేసుకొన్నట్లు అక్కడున్న క్రీ.శ. 1377 నాటి శాసనం వల్ల తెలుస్తుంది. వెలుగోటివారి వంశావళిలో పేర్కొన్నట్లు అనవేమారెడ్డి వెలమరాజుల చేతిలో ఓడిపోయాడనేది వాస్తవం కాదని

చారిత్రకుల అభిప్రాయం. తాను తూర్పు దండయాత్రలో ఉన్నప్పుడు విజయనగర మొదటి బుక్కరాయల ప్రోత్సాహంతో అతని దండనాయకుడు కొండవీటి భూభాగంలో ఉన్న వినుకొండ ప్రాంతాన్ని ఆక్రమించుకొన్నాడు. అంతేగాక, తన భూభాగంలోని వింజనంపాడు అనే గ్రామాన్ని అతడు దానం చేయడం, అనవేమునికి మరీ ఆగ్రహం తెప్పించింది. క్రీ.శ. 1372వ సం.పు చాంగలవీడు శాసనం ఈ విషయాన్ని ధ్రువపరుస్తుంది. ఉదాసీనంగా ఉంటే ఉనికికే ముప్పు కలుగుతుందని గ్రహించి, పడమటి దాడి దూకుడుకు కళ్ళెం వేయడానికి నిశ్చయించుకొన్నాడు. భారీ సైన్యంతో కదిలిన అనవేముని పశ్చిమ దండయాత్రలో శ్రీశైలం వరకూ ఆక్రమించుకొని తన విజయానికి చిహ్నంగా శ్రీశైలంలో క్రీ.శ. 1378వ సం. జనవరి 6వ తేదీన ఒక శాసనం వేయించాడు. అందులో అతని గుణగణాలతోపాటు పూర్వ దిగ్విజయ యాత్రా విశేషాలు అన్నీ ఉన్నాయి.

తూర్పు దండయాత్రలో అనవేమారెడ్డి కొలువులో ఉన్నతోద్యోగాల్లో ఉన్న అతని బావమరిది కాటయరెడ్డి, అతని సోదరుడు మారయరెడ్డి, నూంకయ, నల్లనూంకయ, దువ్వూరి దొడ్డారెడ్డి, మొదలైన యుద్ధతంత్ర నిపుణులు సహకరించారు. కాటయరెడ్డి జలదుర్గాలను ముట్టడించి యుక్తితో వశపరచుకోవటంలో సిద్ధహస్తుడు. అనవేమునికి ఎన్నో జలదుర్గాలను సాధించి పెట్టి 'జలదుర్గమల్ల' అనే బిరుదును పొందాడు.

అనవేముని వ్యక్తిత్వం

అనవేమారెడ్డి దిగ్విజయ యాత్ర పూర్తయిన తరువాత కొండవీటి నుండి ప్రజారంజకమైన ధర్మపాలన సాగించినట్లు అతను విడుదల చేసిన శాసనాలు వెన్నెలకంటి సూరన రాసిన విష్ణు పురాణం తెలియజేస్తున్నాయి. దక్షిణాన కందుకూరు నుండి ఉత్తరాన సింహాచలం వరకూ, పశ్చిమాన శ్రీశైలం నుండి, తూర్పు సముద్రం వరకూ గల మహితాంధ్రదేశాన్ని పాలించినట్లు అతని మాన్యమాపురం శాసనం పేర్కొంటుంది. అనపోతారెడ్డి జయించిన కొత్త ప్రాంతాలు అతని పాలనలోనే తిరిగి ఆయా పాలకులు వెనక్కు పొందారు. ఇంకా చివరిరోజుల్లో విజయనగర రాజులు రెడ్డి రాజ్యపు నైరుతి భాగంలో కొంత భూమిని ఆక్రమించారు. అన్న తనకు అందించిన రాజ్యాన్ని కాపాడి, అనవేముడు ఇంకా విస్తృతం కూడా చేసిన ధీశాలి. ప్రజలతో చక్కటి సంబంధ బాంధవ్యాలను కలిగి ఉన్నాడు. శాంతి భద్రతలను కాపాడటానికి, సమాజాన్ని నీతిమంతం చేయటానికి అవసరమైనపుడు సామదాన భేద దండోపాయాలను వినియోగించి, 'ప్రజాపరిచిత చతుర్విధోపాయ' అనే బిరుదు పొందాడు. యుద్ధ నీతిలో చతురుడు. ప్రత్యేకించి ఏనుగుల్ని లొంగదీసుకోవడంలో రహస్యాలను తెలుసుకొన్నవాడు. కత్తి సాములో 'కరవాల భైరవుడు', 'క్షురికాసవశయ', 'కరవాలవైనతేయ' బిరుదులను పొందాడు. కొత్తగా స్వాధీనం చేసుకొన్న భూములను రెడ్డి రాజ్యానికి కలిపి, 'మహనీయాంధ్రదేశ పట్టాభిషేక సంవృత మహాభాగ్య' అని కీర్తించబడ్డాడు.

అనవేమునికి సకల విద్యలలో ఆరితేరిన మామిడి పెద్దన్న, మంత్రి పదవితో పాటు దండనాయక పదవిని కూడా నిర్వహించిన వీరుడు. చక్కటి పాలన సాగించడంలో అనవేమారెడ్డికి సహాయపడి 'అనవేమాధిప రాజ్యభార భరణ' అని పేరుగాంచాడు. అతని ప్రత్యేక సేవలకు గుర్తింపుగా వేతనంతోపాటు, అదనపు సౌకర్యాలను కూడా కల్పించాడు. అతని మరొక మంత్రి ఇమ్మడీంద్రుడు. నమ్మకమైన సేవలకు అనవేముడు ఇమ్మడిలంక అను గ్రామాన్ని దానంచేశాడు. సైన్యాధ్యక్షుడైన అల్లాడరెడ్డి సలహాలతోపాటు సైన్య సమీకరణ, ఆధునిక సైన్య పద్ధతుల్లో తర్ఫీదునిచ్చి నిర్వహించడంతోపాటు పూర్వ దిగ్విజయయాత్రలో ప్రధాన పాత్ర పోషించాడు. రాజదర్బారు కవులు, గాయకులు, కళాకారులతో నిండి ఉండేది. కొలువులో బాలసరస్వతి, త్రిలోచనాచార్యుడు, ప్రకాశభారతియోగి అనే కవులున్నారు. వారి పాండిత్యానికి మెచ్చి దానాలను చేసిన అనవేమారెడ్డి 'బహుసహస్ర సువర్ణదాన సంతోషిత మహాకవీశ్వర' అనే బిరుదును పొందాడు.

అనవేముని పాలనలో రాజ్యం ఆర్థికంగా ముందంజలో ఉందనీ, మోటుపల్లి రేవునుండి విదేశీ వ్యాపారం బాగా జరిగి ప్రభుత్వానికి సుంకం రూపేణా ఎంతో ఆదాయాన్ని అందించేదనీ అనవేమారెడ్డి వాడపల్లి శాసనం తెలియజేస్తుంది. వ్యవసాయాభివృద్ధికి చెరువులు, బావులు త్రవ్వించాడని; పంటలు బాగా పండి, రాజ్యం సుభిక్షంగా, శాంతియుతంగా ఉందని అదే శాసనం పేర్కొంటుంది.

వసంతోత్సవం

సాంప్రదాయికంగా చిరకాలం నుండి చైత్ర మాసంలో జరుపుకునే వసంతోత్సవం లేక మదనమహోత్సవం అనే వేడుకలను అనవేమారెడ్డి పునరుద్ధరించాడు. వసంత మాసంలో రాజధాని వీధులన్నింటినీ మామిడి తోరణాలతో అలంకరింపజేసి, రాజ్యంలోని వివిధ ప్రదేశాల నుండి తరలివచ్చే జనానికి వసతి సౌకర్యాలు కల్పించాడు. మార్గమధ్యంలో సత్రాలు, చలిపందిళ్ళు నిర్మించి యాత్రికుల భద్రతకు రక్షక భటులను నియమించాడు. అప్సరసలను పోలిన ఆంధ్ర యువతులు అలంకరించుకొని తమ జతగాళ్ళతో బండ్లపైన, కాలినడకన జంటలు జంటలుగా, జట్లు జట్లుగా రాజధానికి చేరుకొనేవాళ్ళు. శృంగార పురుషులు రవసెల్లాలు ధరించి హుషారుగా పురవీధుల్లో సంచరిస్తూ రాజు వసంతోత్సవం జరిపే చోటుకు చేరేవాళ్ళు. అందగాడైన ప్రతి యువకుడూ ఆ రోజు మన్మథుడే. సింగారించుకొన్న ప్రతి యువతీ ఆనాడు రతీదేవే. మోటుపల్లి రేవు ద్వారా విదేశాల నుంచి వచ్చే కస్తూరి, కుంకుమ, ఘనసార, హిమాంబు, కాలాగరు, గంధం మొదలైన సువాసనలు వెదజల్లే ద్రవ్యాలను విదేశీ స్వదేశీ వ్యాపారుల నుండి పెద్ద మొత్తాల్లో సేకరించి వసంతోత్సవంనాడు జలకాలాటలోనూ, రాజు ప్రత్యేకంగా సందర్శకుల మీద చల్లేవాడు.

నాట్యం, నృత్యం, కోలాటం మొదలైన ఆటలను ఆడ, మగ తేడా లేకుండా ఆడేవాళ్ళు. రంగురంగుల బట్టల్ని ధరించేవాళ్ళు. వివిధ ఆభరణాలతోపాటు పూలను కూడా ధరించేవాళ్ళు. ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న జనంతో రాజధానీ నగరం నిండిపోయేది. ఈ వసంతోత్సవాల్ని ప్రతి సంవత్సరం జరిపించడం చేత అనవేమారెడ్డి "వసంతరాయ" బిరుదును పొందాడు. వసంతోత్సవ సమయంలో కర్పూరం ప్రజలపైకి రాజు చల్లడంతో అనవేముని 'కర్పూర వసంతరాయల'ని పిలిచారు. అనవేముడు తిరిగి ప్రవేశ పెట్టిన ఈ వసంతోత్సవాలను కుమారగిరి రెడ్డి ఇంకా ఘనంగా జరిపించి అతడు కూడా "కర్పూర వసంతరాయ" బిరుదును పొందాడు.

అనవేముని ధర్మకార్యాలు

శాంతికాముకుడైన అనవేముడు స్వతహాగా ధార్మికుడు. రాజధర్మంగా, ధర్మబద్ధమైన యుద్ధాలు చేశాడు. శైవ మతాన్ని ఆచరించి ప్రచారం చేశాడు. శివునికి ప్రతిరోజూ ఆరుసార్లు పూజలను నిర్వహించాడు. పంచారామాలకు గజఘంటలను, శ్రీశైలం, త్రిపురాంతకం ఆలయాలకు దానాలను సమర్పించాడు. తాను శైవుడైనా శ్రీకూర్మం, సింహాచలం దేవాలయాలకు గొప్ప దానాలిచ్చాడు. క్రీ.శ. 1371వ సం.లో సముద్రతీరంలో నున్న చెఱకుపల్లి (ఇక్షుగ్రామం)లో ఆషాఢ పూర్ణిమ సందర్భంగా ఏర్పడిన చంద్రగ్రహణం రోజున అనుష్ఠానాలను స్వయంగా నిర్వర్తించి, ఆగ్రామాన్ని వేదశాస్త్రాల్లో నిష్ణాతులైన బ్రాహ్మణులకు అష్టభోగతేజస్వామ్యంగా దానంచేశాడు. వాడపల్లిలో మాచారెడ్డి అనే ఉద్యోగి అనవేమారెడ్డికి పుణ్యంగా అక్కడి అగస్తేశ్వరాలయ గోపురాన్ని, చంద్రశాలను నిర్మించటానికి ఆర్థిక సాయాన్నందించాడు. రెడ్డి రాజుల కులదేవత మూలగూరమ్మకు యుద్ధాల్లో విజయం లభించినందుకు మూడు గ్రామాలను దానం చేసినట్లు క్రీ.శ. 1377వ సం.పు అమీనాబాదు శాసనంలో చెప్పబడింది.

శ్రీశైలంలో వీరశైవ భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా గండకత్తెరతో తమ తలల్ని తామే కత్తిరించుకుని శివునికి అర్పించి శివసాయుజ్యాన్ని పొందేవారు. కర్నాటక, ఆంధ్ర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు శ్రీశైలం ఆలయంలో శైవాగమార్చనలు జరుపుకొన్న తరువాత శిరస్సులను కత్తిరించుకొనేవాళ్ళు. వారికి సౌకర్యంగా 'వీరశిరో మంటపా'న్ని నిర్మించాడు. హేమాద్రి వ్రత ఖండంలో చెప్పిన వివిధ దానాలను చేసి బ్రాహ్మణులకు అగ్రహారాలను బహూకరించాడు. సత్రాలను నిర్మించి బాటసారులకు ఊరట కలిగించాడు. ప్రోలయవేముని ఆశయాలనూ, అనపోతారెడ్డి ఆదర్శాలతో రెడ్డి రాజ్యాన్ని పాలించి, ధర్మానవేమునిగా పిలువబడి రెడ్డిరాజ్యకీర్తిపతాకను ఎగురవేశాడు.

'కర్పూర వసంతరాయలు' కుమారగిరి రెడ్డి

(క్రీ.శ. 1386 - 1402)

కొండవీటికి పశ్చిమవైపునున్న త్రిపురాంతకుడు శత్రువుల దాడుల నుండి కాపాడుతాడని రెడ్డి రాజుల నమ్మకం. నేటి ప్రకాశం జిల్లాలోని త్రిపురాంతకం కొండకు కుమారాచలం, కుమారగిరి అని పేర్లున్నాయి. అనపోతారెడ్డికి పుట్టిన మగ శిశువుకు కుమారగిరిపై నున్న త్రిపురాంతక దేవుని పేర 'కుమారగిరి రెడ్డి' అని పేరు పెట్టుకున్నాడు. శాసన సాహిత్యాల్లో ఇతన్ని కొమరగిరిరెడ్డిగా కూడా ప్రస్తావించడం జరిగింది.

చక్కని పరిపాలననందించి కొండవీటి సామ్రాజ్య ప్రాభవాన్ని రెడ్డి రాజుల వైభవాన్ని కందుకూరు నుండి కటకంవరకూ, శ్రీశైలం నుండి తూర్పు సముద్రం వరకూ ప్రసరింపజేసి, వసంతోత్సవాలను ఘనంగా జరిపించి కర్పూర వసంతరాయలుగా పేరు గాంచిన కుమారగిరిరెడ్డి చరిత్ర తెలుసుకోవడానికి సమకాలీన శాసనాలు, సాహిత్యం, లోకల్ రికార్డులు ఎంతో ఉపయోగపడతాయి. కాటయ వేమారెడ్డి పాలకొలను, సింహాచలం, అమరావతి, తొత్తరమూడి, మధురపూడి, సంతానసాగరం, గోపవరం శాసనాలు, గొగ్గయ దేవనాయని సర్పవరం శాసనం (క్రీ.శ. 1388), భండారుశెట్టి తాళ్ళూరి మఠం శాసనం (క్రీ.శ. 1399) అల్లయవేముని కోరుమిల్లి, వేమవరం శాసనాలూ, కుమారగిరిరెడ్డి అనపర్తి, కొమరగిరిపురం (క్రీ.శ. 1390), కొత్తూరు శాసనం (క్రీ.శ. 1400), ఇంకా విజయనగర పాలకులైన రెండవ హరిహరరాయలు, అతని మనుమడైన రామచంద్రరాయల త్రిపురాంతకం (క్రీ.శ. 1385-86), యనమదల, పరుచూరు శాసనాలూ, శ్రీనాథుని హరవిలాసం, కాశీఖండం, భీమేశ్వరపురాణం, కొమ్మన శివలీలావిలాసం ఇంకా తెలుగు చాటువులను పరిశీలించాల్సి ఉంటుంది.

అప్పటి వరకూ కొండవీటి సింహాసనం పైనున్న పినతండ్రి అనవేమారెడ్డి మరణించిన నేపథ్యంలో కుమారగిరిరెడ్డి సింహాసనాన్నధిష్ఠించిన వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. అనవేమారెడ్డి క్రీ.శ. 1386లో మరణించిన వార్త రాజ్యమంతటా పాకింది. రాచనగరులోనూ, రచ్చబండల మీద కొండవీటి సింహాసనం గురించి చర్చలు కొనసాగాయి. తన తరువాత కుమారగిరిని రాజును చేయాలనుకొన్న అనవేమారెడ్డి ఆలోచనలను తెలుసుకున్న అతని వారసులు సింహాసనాన్ని కాజేయాలని కుట్ర పన్నారు. ఉపద్రవాన్ని ముందుగానే పసిగట్టిన కుమారగిరిరెడ్డి బావమరిది కాటయవేమారెడ్డి నాటకీయంగా

కుమారగిరిని కొండవీడుకి రాజుగా చేశాడు. అంతేగాక, ధర్మరాజుకు కృష్ణునివలే పరిపాలనలో శక్తియుక్తుల నర్పించినట్లు కాటయ వేముని తొత్తరమూడి శాసనం వల్ల తెలుస్తుంది. కాటయ వేముని రాజకీయ చతురతకు పాలుపోని కుమారగిరి దాయాదులు మౌనం వహించక తప్పిందికాదు.

కుమారగిరి రెడ్డి కొండవీటి నుండి రాజ్యం చేస్తుండగా, కలిగిన కొడుక్కి తన తండ్రి పేరు మీదుగా 'వీరాన్న పోతారెడ్డి' అని పేరు పెట్టుకొన్నాడు. ఇతడే రెండవ అనపోతారెడ్డి. కుమారగిరిరెడ్డి అతనికి బాల్యంలోనే సకల శాస్త్రాలూ, విద్యలూ నేర్పించాడు. అనపోతారెడ్డి పిన్నవయస్కునిగా నున్నప్పుడే, దాక్షారామాన్ని సందర్శించిన కుమారగిరిరెడ్డి తనతొడపై కొడుకునుంచుకొని వెండి, బంగారు నాణెములతో తులాభారం తూగి, వాటిని దాన, ధర్మాలకు వినియోగించాడు. అనపోతారెడ్డికి యుక్త వయసొచ్చిన తర్వాత యువరాజు పట్టాన్ని అప్పగించాలనుకొన్నాడు. కుమారగిరి రెడ్డి అంత వరకూ ఉన్న ఆచారాన్ని కాదని బ్రాహ్మణుల స్థానంలో మంత్రిగా, దండనాయకునిగా తన బావమరిది కాటయ వేమారెడ్డిని నియమించడానికి సాహసించాడు. రాజు ఆనతి మేరకు పాలనా పరమైన బాధ్యతలను అతడు నిర్వర్తించాడు. కాటయవేమారెడ్డి, కుమారగిరిరెడ్డికి దండనాయకునిగా, ప్రధానిగా, చతురంగ బలసమీకరణ, చతుర్విధోపాయాల నందిస్తూ అతనికి అండదండగా నిలిచాడు. తన మనసులో మెదలిన తూర్పుదేశ దండయాత్ర గురించి కాటయవేమునికి వివరించాడు.

కాటయ వేమారెడ్డి తూర్పు దండయాత్ర

యుద్ధతంత్ర నిపుణుడైన కాటయవేముడు అదను చూచి దండయాత్రకు ఏర్పాట్లను కావించాడు. కొండవీటి కోట బురుజు మీద యుద్ధభేరి మ్రోగింది. వివిధ దళాధిపతులూ, దండనాయకులూ, సహాయక మంత్రులూ సర్వసన్నద్ధమైనారు. పథక రచన చేసిన కాటయ వేమారెడ్డి ముందుగా రాజు ఆదేశాలను చదివి, సైన్యానికి వినిపించాడు. శత్రు రాజులవల్ల ఏర్పడ్డ బెడద గురించీ, దేశభక్తి పరాయణులైన సైనికులకు గంభీరోపన్యాసం చేశాడు. యుద్ధభేరీలు మోగుతూనే ఉన్నాయి. కాటయవేముని ఆవేశపూరిత ప్రసంగం, భేరి, కాహళవాద్య శబ్దాలకు సైనికుల్లో కదన కుతూహలం పెల్లుబికింది. అప్రమత్తంగా ఉన్న వీరసైనికులంతా సరంజామాతో బయలుదేరారు. కాల్బల నాయకులు గమ్యస్థానమైన తూర్పుదేశ చిత్రపటాన్ని, వివిధ కోటల ముట్టడికి చొరబడాల్సిన మార్గాలున్న పటాలను తమ వెంట ఉంచుకొని కదనానికి కాలు కదిపారు.

కొండవీటి నుంచి బయలుదేరిన సైనికులు కృష్ణానదిని దాటిన తరువాత దండుబాటలో నున్న పాలకొల్లు పట్టణాన్ని చేరుకొన్నారు. పంచారామాల్లో ఒకటై ఎప్పుడూ భక్తులతో కిటకిటలాడే ఈ ఆలయం ఆ రోజు సేనావాహినితో నిండిపోయింది. కాటయవేముడు క్షీరారామలింగేశ్వరుని దర్శించి ఆలయ నిర్వహణకు కొంత భూమిని

ప్రకటించాడు. తనరాకకు గుర్తుగా పాలకొల్లులో ఒక శాసనం వేయించుకున్నాడు. మహా పరాక్రమవంతుడైన కాటయవేమునికి జగనొబ్బగండ, కేళాదిరాయ, భుజబలభీమ, పాండ్యరాయగజసింహ, పల్లవ త్రినయన మొదలైన బిరుదులున్నట్లు ఈ శాసనం పేర్కొంటుంది.

సేనలు పాలకొల్లు నుంచి రాజమహేంద్రవరం వైపు కదిలాయి. క్రమశిక్షణతో, వరుసలుగా ఏర్పడిన చతుర్విధదళాలు రెడ్డి రాజుల పౌరుషానికి ప్రతీకలుగా ముందుకు సాగాయి. ఒక్కసారిగా గోదావరిని చూచిన సైనికులు ఉరకలు వేశారు. ఎక్కువగా లోతులేని గోదావరిని సులువుగా దాటి రాజమహేంద్రవరం కోటలో ప్రవేశించారు. ఈ తూర్పు దండయాత్రలో తనకు విజయం చేకూర్చమని కాటయవేముడు స్థానిక వేణుగోపాలస్వామిని ప్రార్థించి ముందుకు సాగాడు. తరువాత కాటమరేని కోటను జయించాడు.

కాటయవేముడు రాజనీతిజ్ఞుడేకాక గొప్ప సాహితీవేత్త కూడా. కుమార రాజీయం, మాళవికాగ్నిమిత్రం, శాకుంతల గ్రంథాలపై చక్కటి వ్యాఖ్యలు రాశాడు. రాజమహేంద్రానికి ఈశాన్యంగా ఉన్న కొప్పుల రాజ్యాన్ని క్రీ.శ. 1388లోనే వశపరచుకొన్నాడు. అంతటితో ఆగక మొల్లేరు, రామగిరి, వజ్రకూటం మొదలైన కోటలను కూడా స్వాధీనపరచుకొన్నాడు.

సైన్యానికి సూచనలిస్తూ ముందుకు నడిపిస్తున్న కాటయవేముడు సింహాచలం చేరుకున్నాడు. స్వామిని దర్శించి కొన్ని దానాలను ప్రకటించినట్లు క్రీ.శ. 1386 నాటి శాసనం తెలియజేస్తుంది. సింహాచలాన్ని స్వాధీనం చేసుకున్న తరువాత కళింగంలోని వీరకొట్టాన్ని జయించాలని నిశ్చయించుకొని ముట్టడించి పాలకుడైన పురుషోత్తముని లొంగదీసుకొని, ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకొన్నాడు.

కుమారగిరి తూర్పు దండయాత్రలో అల్లయ వేమారెడ్డి, అల్లయదొడ్డారెడ్డి పాల్గొని సహకరించి సప్తమాడియాలు, జంతరునాడు, జయపురాలను కూడా జయించి సింహాచలం, చిలుకసరస్సుల వద్ద జయస్తంభాలను నాటినట్లు వేమవరం శాసనం, శివలీలావిలాసం అనే గ్రంథం తెలియజేస్తున్నాయి. ఈశాన్యంగా ముందుకు నడిచిన కాటయవేమునికి కళింగంలోని ముఖ్యనగరమైన కటకంపై దృష్టి పడింది. కటకాన్ని జయించి 'కటకచూరకార' బిరుదును పొందినాడని గోపవరం శాసనం చెబుతుంది. తూర్పు దండయాత్ర ముగించుకొని క్రీ.శ. 1387లో కొండవీటికి తిరిగి వచ్చాడు. విజయపరంపరతో వచ్చిన యోధునికి రాచమర్యాదలతో, కర్పూరహారతులతో కుమారగిరిరెడ్డి ఎదురేగి స్వాగతం పలికి సభామందిరానికి తీసుకొచ్చాడు. కాటయవేముడు ప్రారంభం నుండి దండయాత్రా విశేషాలను పూసగుచ్చినట్లు చెప్పాడు. వ్యూహ ప్రతివ్యూహాలు, సాధించిన విజయాలు, ఓడిపోయిన రాజులిచ్చిన కట్నకానుకల గురించి వివరించిన తరువాత వాటిని రాజుకప్పగించాడు. విజయగర్వం తొణికిసలాడుతున్న కాటయవేమని కౌగిలించుకొని అభినందించాడు కుమారగిరిరెడ్డి.

ఈ దండయాత్రలో కాటయవేమునికి వెన్నంటి నిలిచిన మరో వీరుడు అల్లాడరెడ్డి. కుమారగిరిరెడ్డి తూర్పు రాజ్యానికి రాజమహేంద్రవరాన్ని రాజధానిగాచేసి, తన కుమారుడు వీరాన్నపోతారెడ్డిని యువరాజుగా పట్టం కట్టిపాలనా బాధ్యతలను అప్పగించాడు. తాను కొండవీటికి పరిమితమై, దేశవిదేశాల నుంచి వస్తున్న సుగంధ ద్రవ్యాలతో వసంతోత్స వాలను జరుపుకొంటూ సాహిత్య కళారంగాలకు ఎంతో సేవ చేశాడు.

కుమారగిరిరెడ్డి అనపర్తి శాసనంలో తనతో దక్షిణ (విజయనగర రాజు), పశ్చిమ (వెలమలు), ఉత్తరం (కళింగ గాంగులు) వైపున్న రాజులు స్నేహ భావంతో ఉన్నారని చెప్పుకొన్నా వారితో పోరాటాలు తప్పలేదు.

విజయనగర రాజులతో యుద్ధం, మైత్రి

కుమారగిరిరెడ్డి సింహాసనాన్నధిష్ఠించేప్పుడు కొండవీటిలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు విజయనగర పాలకులకు అనుకూలంగా ఉన్నాయి. అదను చూచుకొని కుమారగిరికి సమకాలికుడైన రెండవ హరిహరరాయలు (క్రీ.శ. 1377-1404) కొండవీటి భూభాగంలోని పశ్చిమ ప్రాంతంపై క్రీ.శ. 1385వ సంవత్సరంలో దాడిచేసి శ్రీశైలం, త్రిపురాంతకాలదాకా ఆక్రమించుకున్నాడు. దాంతో కుమారగిరి తగిన అంగబలాన్నిచ్చి కాటయవేమారెడ్డిని రాయల సైన్యం మీదికి పంపాడు. సేనా వాహినిగా కదిలి వస్తున్న కాటయ వేమునితో యుద్ధం కంటే సంధి మేలనుకొన్నాడు హరిహర రాయలు. రెడ్డి రాజులతో సఖ్యంగావుంటే బహమనీ, వెలమరాజులను సులువుగా ఎదుర్కొనవచ్చని హరిహరరాయలు సంధి కుదుర్చుకొని శ్రీశైలం, త్రిపురాంతక ప్రాంతాన్ని కుమారగిరిరెడ్డికి తిరిగి అప్పగించాడు. అంతేకాక కాటయవేమారెడ్డికి తన కూతురు హరిహరాంబనిచ్చి వివాహం జరిపించి మైత్రీ బంధాన్ని మరింత దృఢం చేసుకున్నట్లు అల్లయ వేమారెడ్డి వేమవరం శాసనం పేర్కొంటుంది. ఐదారు సంవత్సరాలు ఇలా కొనసాగిన మైత్రికి భంగం కలిగింది. కొండవీటిలోని అంతర్గత కలహాలు, కరవుల మూలంగా కుమారగిరిరెడ్డి పాలనా పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్న సమయంలో (క్రీ.శ. 1400 సం.లో), విజయనగర సేనలు శ్రీశైలం, ఎనమదల, పరుచూరు ప్రాంతాలను వశపరచుకొన్నట్లు అక్కడి శాసనాలు రుజువు చేస్తున్నాయి.

బహమనీలతో పోరు

బహమనీ సుల్తాను ఫిరోజ్‌షా (క్రీ.శ. 1397-1422) విజయనగర సామ్రాజ్యం మీదికి దండయాత్రకు వెళుతూ రెడ్డి రాజ్యంపైకి కూడా కొంత సైన్యాన్ని పురమాయించాడు. వాయువ్య ప్రాంతంలో జరిగిన దాడిని, కుమారగిరిరెడ్డికి అణకువగా పాలిస్తున్న తిప్పానాయకుడు బహమనీ సైన్యాన్ని ఎదుర్కొని కంభంమెట్టు దగ్గర తిప్పికొట్టడంతో వారు పలాయనం చిత్తగించారు.

వెలమలతో సంబంధం

రెడ్డిరాజ్యానికి పశ్చిమంగా ఉన్న వెలమలతో వైరం లేదని కొమరగిరి చెప్పుకొన్నాడు. సింగయమాదానేడు, దాచభూపాలుడు అనే వెలమరాజుల చేతిలో కుమారగిరి ఓడిపోయినట్లు ప్రస్తావిస్తున్న వెలుగోటివారివంశావళి కథనాన్ని చారిత్రకులు అంగీకరించడం లేదు. వెలుగోటివారివంశావళిలో గానీ, వెలమరాజుల శాసనాల్లో గానీ కాటయ వేముని ప్రస్తావనేలేదు. కుమారగిరికి వెలమలకు యుద్ధం జరిగిన ఆధారాలు దొరకలేదు.

కళింగ గాంగులతో యుద్ధం

కళింగ దేశాన్ని పాలిస్తున్న నాలుగవ నరసింహదేవుడు (క్రీ.శ. 1377-1409), తన రాజ్యపు దక్షిణ భాగాన్ని రెడ్డి రాజులు ఆక్రమించుకోవడం సహించలేక సైన్యంతోసమాయత్తమై క్రీ.శ. 1399లో రాజమహేంద్రవరం పైకి దండెత్తి వచ్చాడు. తూర్పు రాజ్యాన్ని పాలిస్తున్న అనపోతారెడ్డి, అతని సహాయకుడు దేవనాయకుడు విహరణగిరి (సింహాచలం) వద్ద ఎదుర్కొని గాంగ సైన్యాన్ని తరిమికొట్టారు. తిరిగి వస్తూ, సర్పవరంలోని భావనారాయణ ఆలయాన్ని దర్శించి భూదానాలను కూడా చేసినట్లు అక్కడ శాసనం తెలియజేస్తుంది.

కుమారగిరి రెడ్డి కొడుకు అనపోతారెడ్డి మరణం

రాజ్యంలో శాంతిని సాధించి, సుస్థిర పాలన సాగిస్తున్న కుమారగిరిరెడ్డి వసంతోత్సవాలను జరుపుకొంటూ సంగీత సాహిత్య సభలతో విలాసంగా, వినోదంగా కాలం గడుపుతున్నాడు. విధి వక్రించి, ఆనంద డోలికల్లో ఓలలాడుతున్న కుమారగిరి జీవితంలో విషాదం కమ్ముకొంది. తూర్పు రాజ్యాన్ని పాలిస్తున్న తన కుమారుడు, యువరాజైన రెండవ అనపోతారెడ్డి అనుకోకుండా మరణించటం కుమారగిరి పాలిట పిడుగుపాటైంది. తాను నిర్మించుకున్న కలల సౌధం కళ్ళముందు కుప్పకూలింది. ఆశలు అడియాసలయ్యాయి. మేరునగధీరుడు, వీరుడైన కుమారగిరిరెడ్డి కుమిలిపోయాడు.

రాజ్యంలోని తూర్పు ప్రాంతాన్ని నియంత్రించటానికి రాజ ప్రతినిధిని నియమించాల్సిన అవసరాన్ని గుర్తించిన కుమారగిరిరెడ్డి బాగా ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చాడు. తనకు అన్ని వేళలా, అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉన్న కాటయ వేమునికి రాజమహేంద్రవరాన్ని అప్పగించాలనుకొన్నాడు. తాను సాహిత్య, సంగీత కచేరీల్లో ఉల్లాసంగా గడిపిన రోజుల్లో రాజ్యభారాన్ని మోయటమే కాక, రాజ్యాన్ని విస్తరించిన కాటయవేమారెడ్డి సమర్థ నాయకత్వాన్ని గుర్తించాడు. రాజకీయ చతురత, కార్యదక్షత, పాండిత్య ప్రతిభ మూర్తీభవించిన కాటయ వేమునికి రాజమహేంద్రవర పాలనను

అప్పగించినట్లు కాటయ వేముని గోపవరం శాసనం వెల్లడిస్తోంది. విషాదంలోంచి, హుషారులోకి రావటం అంత తేలిక కాకపోయినా, క్రమంగా మళ్లీ మామూలు జీవితాన్ని కల్పించుకొని మునుపటిలా వసంతోత్సవాల్లో పాల్గొనాలనుకొన్నాడు కుమారగిరిరెడ్డి.

కొండవీటిలో వసంతోత్సవం

అది చైత్రమాస పంచమి రోజు. తొలికోడి కూసింది. కొండవీడు నిద్రనుండి కొద్దికొద్దిగా మేల్కొంటోంది. అందరూ లేచి పండుగ సంరంభానికి సమాయత్త మౌతున్నారు. ఇంకా మసక చీకటి తెర తొలగనేలేదు. పిన్నలూ, పెద్దలూ, యువతులూ, ప్రౌఢలూ, వనితలూ, వృద్ధ నారీమణులూ సుగంధ పరిమళ ద్రవ్యాన్ని కలబోసిన నులివెచ్చని నీటితో తలంటుకొని, సాంబ్రాణితో కురులారబెట్టు కొంటున్నారు. యువకులు బావుల వద్ద చేరి స్నానాలు ముగించుకొని కడవలతో నీళ్లను ఇళ్లకు తెస్తూ ముచ్చటించుకొంటున్నారు. వనితలు వాకిళ్లూడుస్తూ, కళ్లాపులు జల్లుతూ, రంగవల్లులతో అలంకరిస్తున్నారు. లేగదూడల అరుపులతో ఆకాశాన ఉదయభానుడుపక్రమిస్తున్న సంగతి తెలిసి, ఇంటి పనులు త్వరత్వరగా ముగించు కోవాలనుకొంటున్నారు పురజనులు. కొత్త చీరలను కట్టుకున్న యువతులు సిగలకు చుట్టుకున్న బట్టల్ని తీసి మల్లెచెండుల్ని తురుముకుంటున్నారు. కళ్లకు కాటుక, చెంపలకు లక్క, నుదుటిపై తిలకాన్ని దిద్దుకొని అద్దంలో ఒద్దికగా చూచుకొంటూ, మైమరచి పోతున్నారు కొండవీటి సుందరీమణులు. యువకులు తెల్లని వస్త్రాలు ధరించి తలపాగాలు చుట్టుకొని మెడలో ముత్యాల హారాలు, ముంజేతుల కంకణాలకు మల్లెమాలలను అలంకరించుకొని యువతులతో పోటీపడుతున్నారు. తెలియని ఆనందంతో ఆ గడపా ఈ గడపా తిరుగుతున్న బాలబాలికల కేరింతలు పండుగ సంబరాన్ని తెలియజేస్తున్నాయి.

వింత వింత అలంకరణలతో, ద్వారాలకు తోరణాలతో, నేలంతా ముగ్గులతో కొత్త అందాల్ని సంతరించుకొని, రాజధాని ముస్తాబైంది. రాజును మేల్కొలుపు గీతాలతో నిద్రలేపారు. చెలికత్తెల అందెల సవ్వడికి రాణి సైతం మేల్కొంది. వందిమాగధులు పొగడ్తలు కురిపిస్తుండగా రాజూ, రాణీ తమ తమ స్నాన గృహాలకు చేరుకున్నారు. పన్నీరు, అగరు, చందనం, మందార పూలను, పారసీ దేశాలనుంచి తెప్పించిన పరిమళ ద్రవ్యాన్ని మేళవించిన నీటితో స్నానం చేశారు. తరువాత వారికి సౌందర్యాన్ని ఇనుమడించే సుగంధ ద్రవ్యాలనుపూసి బయటికి రావడానికి సిద్ధంచేశారు.

నిన్నటి రోజున కొండవీటికి చేరిన చుట్టాలు సైతం కొత్త బట్టలతో మెరిసి పోతున్నారు. బాల సూర్యుడు బారెడు పైకి లేచాడు. ఒక్కసారిగా ఊరంతా కదిలింది. రాజమందిరం నుంచి కదలిన సేవకులు, పరివారం, ఏనుగులు, గుఱ్ఱాలు బారులుతీరి బయటికి రావడంతో వాటి వెనుక దండనాయకుడు, మహా ప్రధాని కాటయవేముడు,

తెల్లని వస్త్రాలతో అలంకరించిన ఏనుగుపై అంబారీలో కొండవీటి ప్రభువు కుమారగిరిరెడ్డి, అతని పట్టపురాణి. అంతేవాసుల ఉమ్మడి సందడితో కోట ద్వారం నుంచి ప్రవాహమై బయటికి వస్తుండగా నగర వాసులు వరుసల్లో వారిని అనుసరిస్తుంటే ఉత్సవ కుతూహలం, పండుగ సంబరం. ముద్దులొలికే మూడేళ్ల పాపనుండి పండు ముదుసలి వరకూ ఆనందం పొంగిపొర్లుతుండగా బయలు దేరారు. అది వసంతోత్సవ ప్రారంభ సన్నివేశం. దేశం నలుమూలల నుండి వచ్చిన జనపదుల సమాగమం.

ఉత్సవాలను తిలకించడానికి వచ్చిన జనం మీదికి స్వయంగా కస్తూరి మొదలైన సుగంధ ద్రవ్యాలనూ, కర్పూర కళికలను వెదజల్లి ఆనందించిన అనవేమారెడ్డిని గుర్తుకు తెచ్చుకొని 'ఘనసార కస్తూరికాది వస్తు విస్తార విరచితా పూర్వ వసంత విహార' అనీ, 'కర్పూర వసంత రాయ'లనీ జనం కొనియాడారు. వసంతోత్సవాన్ని చైత్రమాసంలో జరుపుకోవడం చేత చైత్రోత్సవమనీ, మదనుని పూజించడం చేత మదనోత్సవమనీ, రంగులు చల్లుకొని ఉల్లాసంగా పండుగ చేసుకోవడంతో హోలికోత్సవమనీ అంటారు. చైత్రమాసంలో వసంతాగమన సందర్భంగా జరుపుకొనే వసంతోత్సవాల గురించి కాళిదాసు శాకుంతలం, వాత్స్యాయనుని కామసూత్రాలు, ధర్మసింధు, నిర్ణయసింధు, భోజుని రత్నావళి, హేమాద్రివ్రత ఖండం, ఎఱ్ఱన నృసింహపురాణం, శ్రీనాథుని హరవిలాసం, భీమేశ్వర పురాణం, కాటయవేముని కుమారగిరి రాజీయం, నంది తిమ్మన పారిజాతాప హరణం, కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక అనే కావ్య, ప్రబంధాల్లో ఎన్నో వివరాలున్నాయి.

అనవేముని తరువాత అంత భారీగా ఉత్సవాలను జరిపిన కుమారగిరి రెడ్డికి అవచి తిప్పయశెట్టి ఎంతగానో సహకరించాడు. నౌకా వ్యాపారదక్షుడైన తిప్పయ బర్మానుండి పర్షియా వరకూ సముద్ర వ్యాపారం చేస్తూ, అక్కడ లభించే సుగంధ పరిమళ ద్రవ్యాలను సేకరించి కొండవీటి వసంతోత్సవాల సందర్భంగా కుమారగిరికి ప్రతి ఏటా కానుకలుగా అందించేవాడు. వసంతోత్సవాల పట్ల ఆసక్తిగల తిప్పయను సుగంధ భాండాగార అధ్యక్షునిగా నియమించాడు కుమారగిరి రెడ్డి.

ఆ రోజు ఉత్సవాలకు పంజాబు నుండి హిమము, సుగంధ ద్రవ్యాలు, కర్పూరం, పాదరసం, చందనాగరులు, సింహళము నుండి ముత్యాలు, గంధం, సింధూరాలను, గోవానుండి సంకుమదాన్ని, భూటాన్ దేశంనుండి కస్తూరి, చీనా నుండి పట్టుపీతాంబరాలు, తరుశిగా నుండి సుగంధ ద్రవ్యాలు, సిరియా నుండి పరిమళ ద్రవ్యాలు, తన సొంత నౌకల్లో తెచ్చి వసంతోత్సవాల్లో పాల్గొని తానుకూడా 'వసంతరాయ' బిరుదును పొందాడు తిప్పయశెట్టి. అతని ఉదారత్వానికి, కళాభిమానానికి ముగ్ధుడైన శ్రీనాథుడు తన హరవిలాసాన్ని అవచి తిప్పయశెట్టికే అంకితమిచ్చాడు.

రాజు తన అంబారీలోని కస్తూరి మొదలైన సుగంధ ద్రవ్యాల్ని చేతినిండా తీసుకుని చుట్టూ అనుసరిస్తున్న ప్రజానీకంపై విసరగా, మహానంద భరితులై ఉప్పొంగిపోతున్నారు. మోదుగుపూల రసాన్ని, సింధూరాన్ని, రంగురంగుల నీటిలో కలిపి తయారుచేసిన వసంతాన్ని చల్లుకోడానికి తమతోపాటు బిందెలనూ, పిచుకారీలను తెచ్చుకొన్నారు పురజనులూ, పల్లెవాసులూ ఎవరిపై చల్లాలో వారిని అనుసరిస్తూ మెల్లమెల్లగా ఊరేగింపులో ముందుకు సాగుతున్నారు. కొందరు యువకులు. రోజూ రాజు కనరాడనేమో పూబంతులు ధరించిన యౌవనవతులు, మేడలపైనుంచి, కిటికీలు, తలుపుల సందులనుంచి ఓరకంటితో ఓసారిచూసి మురిసిపోతూ ఊరించే అతని అందచందాలను వర్ణించుకొంటున్నారు. పెళ్లైన స్త్రీలుకూడా ఆతురతతో అతన్ని తిలకించడం భర్తలకు కొద్దిగా కోపం తెప్పించింది కూడా.

నదిలా సాగుతున్న ఆ ఊరేగింపు నగరం వెలుపల నిర్మించిన ఉద్యాన వనాన్ని సమీపించింది. వనం మధ్యలో వేదిక, నాలుగు వైపులా స్తంభాలుగా అరటి బోదెలను నిలబెట్టి పైన మామిడిచిగుర్లు, పూలు, తీగలతో అలంకరించారు. వేదిక మధ్యలో హేమాద్రి తన వ్రతఖండంలో చెప్పినట్లు మన్మథ వినాయక శివ వసంత అప్సరసల విగ్రహాలనుంచి. అందంగా అలంకరించారు. పూజారులు మంత్రాలు వల్లిస్తూ పూజిస్తున్నారు. వేదిక చుట్టూ నృత్త గీత వాద్యాలతో కూడిన మదన పూజా కార్యక్రమం మొదలైంది.

రాజు ఆసీనుడై వచ్చిన ఏనుగు వేదిక ముందు మోకరిల్లింది. భటులు భద్రాసనాన్ని తీసుకు వచ్చారు. ఉత్తరీయాన్ని సవరించుకొని, కుడికాలు ముందు మోపి, రాణికి తనచేయి నిచ్చి, దిగిన వెంటనే మంగళవాద్యాలు మార్మోగాయి. వందిమాగధులు చిందులతో రాజు కీర్తిని దిగంతాలకు పాకేట్లు పాడారు. నర్తకీ మణులు వివిధ భంగిమలతో రాజు దృష్టి నాకర్షించాలని ప్రయత్నిస్తున్నారు. గాయకులు తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తూ 'వసంత' రాగాన్నాలపిస్తున్నారు. పల్లె ప్రజలు వెల్లివిరిసిన ఆనందడోలికల్లో ఓలలాడుతున్నారు. నగర వాసులు కాళ్లూ, కళ్లూ ఆడిస్తూ ఆనందిస్తున్నారు. ఊరంతా సంక్రాంతిలా సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. వాద్య ప్రకంపనాలకు పులకితుడైనాడు కొమరగిరిరెడ్డి. అతని ముఖంలోని ఆనంద పారవశ్యాన్ని గమనించిన రాణి తాను కూడా పులకించి ఉత్సవంలో మమేకమై పోయింది. ఒక్కసారి తల పంకించి చూచిన రాజుకు అశేష జనసమూహం ఓ సముద్రంలా తోచింది. తెల్లని, ఎర్రని, పచ్చని, తలపాగాలతో వనమంతా నిండి పోయింది. అక్కడక్కడా బృందగానాలు, పల్లెపదాలు, కోలాటాలు, చెక్కభజనలు జనాన్ని ఆకట్టుకొంటున్న దృశ్యాలు అతన్ని మరింత ఆనంద పరుస్తున్నాయి. తన వెంట ఉన్న కాటయవేముని దగ్గరగా పిలుచుకొని అంతా కలియజూపాడు కుమారగిరి. ఇంతటి ఉత్సవ వేడుకలకు నీవే కారకుడవన్నాడు. రాజ్యభారాన్ని పూర్తిగా తన బావమరిది, ప్రధాని కూడా అయిన కాటయ వేమారెడ్డికి అప్పగించి తాను లలితకళల్ని ఆదరించి, కవులు, గాయకులు, నర్తక, నర్తకీమణులతో కొలువు తీరడానికి వీలు కలగటానికి అతడే కారణమని మదిలో తలచుకొన్నాడు.

పూజలు ముగుస్తున్నట్లు భజంత్రీలు వేగం పుంజుకోవడంతో ప్రత్యేకంగా తెచ్చిన సుగంధ ద్రవ్యాలు, పూలు, చందనం, అగరు, బిందెలతో తెచ్చిన రంగునీళ్లను పూజారులకిచ్చి తాను ఆ వేదికముందు ఆసీనుడైనాడు. వేదోక్త మంత్రాలతో పూజను కొనసాగించారు. రాజూ, రాణీ, ప్రధానీ, తిప్పయశెట్టి లేచి వేదికను సమీపించి దేవతలందరికీ కానుకలను సమర్పించి, మదనుని ప్రత్యేకంగా పూజించి నమస్కరించడంతో పూజ ముగిసింది. ఇక ప్రజలను కలుసుకోవాలనుకొన్నాడు రాజు. క్షణాల్లో ఆ వార్త వనమంతా వ్యాపించింది. రాజుతో ముచ్చటించే భాగ్యం కలుగు తుందేమోనని ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు ప్రజలందరూ. తనవెంట రాణీ, అవచి తిప్పయశెట్టి, సుగంధ ద్రవ్యాలను తలపై మోసుకొస్తున్న భటులు రాగా ముందుకు సాగాడు వసంతరాయలు. అటువైపూ, ఇటువైపూ బారులుతీరిన జనం పైకి కర్పూర కళికల్ని వెదజల్లుతూ వారి కేరింతలు, ఆనందపు పరవళ్ల మధ్య వనమంతా కలియ దిరిగాడు. 'కర్పూర ఖండాలను, వెదజల్లుతూ దిక్కులనే నవ వధువుల ముఖాలను వసంత రాయలు అలంకరించాడని, సమకాలీన సాహిత్యం వివరిస్తుంది. ఆ రోజు కవులకు, గాయకులకు, ఉత్సవాలను తిలకించడానికి వచ్చిన గ్రామీణులకు చేతికందిన ధనాన్ని ఆనందంగా పంచిపెట్టాడు. అవచి తిప్పయ శెట్టిని చూచి పరవశుడైన కుమారగిరి అతని భుజం తట్టి చిరునవ్వు చిందించాడు. యువతీ యువకులు ఒకరినొకరు చూచుకొంటూ చిరునవ్వులు చిందించు కొంటున్నారు. గుణగుణాలను, వసంతోత్సవ కౌతుకాన్ని గుర్తించిన కుమారగిరి తిప్పయకు రాచచిహ్నాలనిచ్చి గౌరవించాడు. తను స్వయంగా కవి. నాట్యశాస్త్ర ప్రవీణుడు. వసంతరాజీయమనే నాట్యశాస్త్రాన్ని రచించగా, కాటయ వేముడు కాళిదాసు మూడు నాటకాలకు వ్యాఖ్యానాలను రచించిన పండితుడు, సాహితీవేత్త. బావ, బావమరదుల ఆలోచనా సమాగమ ఫలితంగా ఆ రోజు ప్రత్యేక నాట్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. కుమారగిరిని, తానురాసిన 'వసంతరాజీయం'లోని వివిధ అంశాలను ప్రదర్శిస్తున్న ఓ నర్తకి ఆకర్షించింది. తదేకంగా చూస్తున్నాడు రాజు. రాజు తనయందే దృష్టిని నిలిపాడని తెలుసుకొన్న ఆ నర్తకి ఆసక్తిగా, అభినయ యుక్తంగా వివిధ ప్రక్రియల్ని ప్రదర్శిస్తూ మరింత ఆకర్షితురాలైంది. ఆమె ముగ్ధ మనోహర రూప లావణ్యానికి, హస్త ముద్రల ప్రదర్శనకూ పరవశుడైనాడు. భావ ప్రకంపనలకు రూపురేఖలు కల్పిస్తున్న ఆమె సుందర సౌకుమార్యం మరింత ఆకట్టుకొంది. ఆ యువతి ఎవరో తెలుసుకోవాలను కొన్నాడు. అభినయ భావ ప్రకటనా ప్రతిభను కొనియాడాలనుకొన్నాడు. పరవశుడైన తనను, పరికించి చూస్తున్న కాటయ వేముని కళ్లతో సైగచేశాడు. రాజాజ్ఞగా భావించిన కాటయ దగ్గర చేరగా, ఆ నర్తకి ఎవరని అడిగాడు. నాట్యశాస్త్ర ప్రవీణ 'లకుమ' అని మెల్లగా చెప్పగా, వసంతరాయని హృదయాంతరాళంలో ఆపేరు ప్రకంపనలను సృష్టించింది. రాజును నిలకడలేనివానిగా జేసింది.

కొండవీటి రాజనర్తకి లకుమ

ఆనాడు అందమైన యువతీ యువకులతో ఉద్యానవనమంతా నిండిపోయి గోపికా జనంతో నిండిన బృందావనంలా తోచింది. నాట్యానికి, వాద్య గాత్రాలకి పరవశులైన గోపికలు మురళి మ్రోగిస్తున్న కృష్ణుడు ఎక్కడెక్కడా అని ఆదుర్దాగా ముందూ వెనుకా పరికించి చూస్తున్నట్లుగా ఉంది. నచ్చి మనసిచ్చిన వరుని కోసం నేనిక్కడ, నేనిక్కడ అని సైగలు మూగబాసలు చేస్తున్నారు! కొండవీటి యువతులు ఒకరికొరకు మరొకరు, ఇంకొకరికొరకు వేరొకరు అన్నట్లు ఒళ్లంతా కళ్లుచేసుకొని వనమంతా కలియ చూస్తున్నారు. రతీమన్మథ జంటల పంటపొలమా అన్నట్లుందానాడు కొండవీడు.

తన్మయుడై తదేకంగా ఆమె వంకే చూస్తున్న రాజును ఓరకంటితో రాణి గమనిస్తూనే ఉంది. అంతవరకూ 'లకుమా' నాట్యాన్ని చూస్తున్న రాణి మదిలో ఒకింత అలజడి. రేడు చేజారి పోతాడేమోనన్న భయంతో కాటయవేముని వంక జాలిగా చూచింది. రాజు వింత ధోరణిని, రాణి పరిస్థితిని గమనించిన వేముడు నేనున్నాగా అన్న భరోసాతో తల పక్కకు తిప్పుకున్నా చిరునవ్వు తొణికిసలాడే ఆమె పెదవులపై అసహనం తొణికిసలాడింది. లకుమ నాట్య విన్యాసం ప్రేక్షకులను పరవశుల్ని చేస్తోంది. వాద్య గాయక శిఖామణులు మమేకమై రాజును మెప్పించాలని తమ కౌశలాన్ని ప్రదర్శిస్తున్నారు.

మనసెటో వెళ్లిపోయిన కుమారగిరి చూపులు, నర్తకి అభినయ చాతుర్యంపై వాలాయి. నర్తకి రాజువంకే చూస్తూ అతని చూపులకు బందీఅయి కొన్నిక్షణాలు మిన్నకుండిపోయింది. వాద్యాలు సైతం మూగవోయాయి. అనుకోని నిశ్శబ్దానికి సభకూడా స్థాణువై శ్రీకృష్ణుని మురళీ గానానికి లీనమైన బృందావనిలా, వెన్నెల్లో మెల్లమెల్లగా జాలువారుతున్న మందాకినిలా ఉంది. ఎక్కడ నుండో సన్నగా వినిపిస్తున్న వేణుగానం లకుమను తన్మయిని చేసింది. తన నాకర్షించిన చందనపు బొమ్మ, పూరెమ్మ తనదైతే బావుండనిపించింది కుమారగిరిరెడ్డికి.

నాట్యానికి పరవశుడైన కుమారగిరి మెడలోని హారాన్ని తీసి ఆమెకు బహుమతిగా ఇవ్వాలనుకొని వేదిక సమీపిస్తుంటే వినమ్రంగా ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తున్న లకుమ తలను వంచింది. రాజు తన అందమైన చేతులతో ముత్యాలదండను ఆమె

మెడలో వేసి చిరునవ్వు చిలికించగా లకుమ ఒళ్లంతా పులకించింది. కళాకారులను ఉచితరీతిన సత్కరించే రాజు రసహృదయానికి ఉప్పొంగిన రాణిముఖంలో మరుక్షణమే మరో ఆలోచన గోచరించింది.

మృదంగం ముక్తాయింపుతో సభ సద్దు మణిగింది. ఒక్కరొక్కరే లేచి ఉద్యాన ఉపాంత మార్గంగుండా బయటకు వెళుతున్నారు. అందరూ వెళుతున్నారు. రాజుకూడా లేచాడు. కాటయ వేముడు అడుగు ముందుకు వేయని రాజువంక పరికించి చూచి చేయిచాచి దోవచూపాడు కాటయ. మేలిముసుగు కప్పుకొని విభునివైపు చూచింది రాణి. రాజు మాత్రం దివినుంచి దిగి వచ్చిన అచ్చరకాంత లకుమయందే దృష్టిని నిలపటంతో రాణికి మనస్సు చివుక్కుమంది. తనదైనదేదో పోగొట్టుకొన్నట్లైంది. అసహనం అలలా లేచింది. మన్మథ వివశయైన లకుమ తలవంచుకొని వేదిక దిగి పూలబాటకు పక్కగా నిలుచుండిపోయింది. అప్రయత్నంగా కుమారగిరి చేయి లకుమ భుజాన్ని తాకబోయింది. గమనించిన బావమరిది కర్పూర కళికల్ని, విరిసిన మల్లికల్ని ఆచేతికందించడంతో తేరుకున్న రాజు వాటిని నర్తకిపై విసరి వసంతోత్సవాన్ని ఆ నాటికి ముగించి భారంగా రాజమందిరం చేరుకున్నాడు.

లకుమ - కుమారగిరిరెడ్డి (కర్పూర వసంతరాయలు) - ఊహాచిత్రం

ఎన్నడూ లేనట్లు ఆనాటి రాత్రి గంభీరంగా తోచింది. హంసతూలికా తల్పం పైన క్షణంలో నిద్రలోకి జారుకునే రాజుకు క్షణమొక యుగమైంది. ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరైన తనకు ఎంతకూ నిద్దుర రానందుకు పక్కకు తిరిగాడు. లాభంలేక పోయింది. లకుమరూపం తన పాలిట శాపమైంది. ఇటు దిరిగాడు. జాలికూడా లేని జాబిల్లి వెక్కిరించి వెటకారం చేసింది. అటూ ఇటూ పొరలుతున్న రాజును గమనించింది రాణి. లకుమను సమీపించిన ఊహా జగత్తులో విహరిస్తున్న అతనికి తన పక్కమీదున్న రాణి స్మృతిపథంలో లేదు.

అది వెన్నెల విరబూసిన ఉద్యానవనం. మల్లెలు విచ్చుకొని మలయ మారుతంతో కలసి కబుర్లు చెప్పుకొంటున్న వేళ, తన మనసు కోరుకునే అప్సర, తనువంతా నిండిపోయిన ఊర్వశి కన్నుల్లో, కనుసన్నల్లో కవ్విస్తున్న సుకుమార మనోహర రూపలావణ్య సుందరి అటుగా వెళ్లిన అలికిడి పొదపొదలో వెతికాడు. లత లతనూ పలకరించాడు. కాలిబాటనడిగాడు. నీటి మడుగు నడిగాడు ఆమె ఎటు వెళ్లిందని. తన నిరీక్షణలో అనుక్షణం ఉత్కంఠత, కనిపిస్తుందేమోననే ఆత్రుత. దూరంగానున్న శిలామండపంలో కదలాడిందోరూపం. పరుగులెత్తి పరికించాడు. ఆనందంతో పులకించాడు. ఆమె ముమ్మూర్తులా తాను కలలుగంటున్న సౌందర్య ప్రతిమ, లకుమ.

ఇక్కడవాడలో నర్తకీమణి ఇంటిలో కూడా అవతరించింది మౌనం. తన నాట్యాన్ని తదేకంగా చూచి మైమరచిన చక్రవర్తి తనచేతులతో మెడనలంకరించిన హారాన్ని తాకుతూ ఆ క్షణాన్ని మళ్లీమళ్లీ గుర్తు చేసుకొంటూ మదినిండా నిండిపోయిన కర్పూర వసంతరాయని రూపాన్ని గుర్తుకు తెచ్చుకొంటూ ఏదో లోకంలో విహరిస్తుంది లకుమ. ఎంత ప్రయత్నించినా ఫలితంలేకపోయింది. మామూలు ప్రపంచంలోకి రాలేకపోతుంది.

నిద్దురరాని ఆ పొద్దు కంటకప్రాయంగా తోచింది. సన్నగా తానుకూడా దూరతీరాలకు పయనిస్తోంది. కొండల్లో, కోనల్లో, లోయల్లో, వాగుల్లో, వంకల్లో ఎక్కడ చూచినా అందగాడు కుమారగిరి రూపమే. తన నెంతగానో అభిమానించే రాజు ఆ రోజు హారాన్ని బహూకరించాడు. శేష జీవితం ఆ మహనీయునికే అంకితమవ్వాలనీ, అనుక్షణం ఆ లాక్షణికుని ఎదుట నృత్త, గీతికలతో కాలక్షేపం చేయాలని కోరుకొంది లకుమాదేవి. ఇద్దరి మనసులూ ఒక్కటైనాయి. ఇద్దరి భావాలూ పరస్పరం ముచ్చటించుకొంటున్నాయి, ఇచ్చగించుకొంటున్నాయి. పొద్దుతెలియని హద్దులు మీరి విహరిస్తున్నాయి.

ఇద్దరూ నిద్దరకుపక్రమించారు. అక్కడ రాజమందిరంలో ఒకరు. ఇక్కడ నర్తకీమణి ముఖశాలలో ఇంకొకరు. కలల అలలపై పయనించిన ఇద్దరూ తెల్లవారగానే ఊహల్లోంచి ఉలిక్కిపడి లేచారు.

కుమారగిరిరెడ్డి కొండవీటి సభను అలంకరించాడు. మంత్రులు, దండ నాయకులు, సాహితీమూర్తులు, రాజకుటుంబీకులు తమ తమ ఆసనాల్లో ఉన్నారు. అది ప్రత్యేక సమావేశం కావటాన రాజు ఏ విషయాన్ని ప్రకటిస్తాడోనని ఉత్సాహంగా వేచి చూస్తున్నారు. రాజు తలపంకించి కాటయవేమునిని వంక చూశాడు. ఉదయాన్నే తనకు పంపిన వర్తమానం మదిలో మెదిలింది కాటయవేమునికి. తాము ముచ్చటించుకొన్న లకుమాదేవి గుణగణాలను తను సభకు ప్రస్తావించి ఆమెను రాజనర్తకిగా నియమించటానికి రాజు తీర్మానించాడని ప్రకటించటానికి సిద్ధమైనాడు.

సదస్యులతో సభ నిండుగా ఉంది. చాన్నాళ్ల తరువాత కొలువు దీరిన కుమారగిరి రత్నఖచితమణిమకుటాన్ని ధరించి, వజ్రసింహాసనంపై ఠీవిగా కూర్చున్నాడు. అందాలొలికే ఇద్దరు సుందరాంగులు అటూ ఇటూ వింజామరలు వీస్తుండగా, ఆ చల్లగాలి రాజు మదిలో, మరికొద్ది నిముషాల్లో తన కొలువులో ఆస్థాననర్తకిగా రాబోయే 'లకుమ'ను తలపింపజేసింది. సభను మరోమారు కలియ జూశాడు. ఆహూతులంతా ఆనందాతిశయంతో తన నిర్ణయాన్ని అంగీకరిస్తూ ప్రకటన కొరకు నిరీక్షిస్తున్నట్లుగా తోచింది. వందిమాగధులు రాజును స్తుతించి, ప్రశంసించారు. వేదశాస్త్ర పారంగతులైన బ్రాహ్మణులు మంత్రోచ్చాటనలు గావించారు.

ప్రభువు నిర్ణయం ప్రకారం, పరిచారికలు వెంటరాగా చక్కగా అలంకరించిన సౌందర్యరాశి లకుమను సాదరంగా ఆహ్వానించాడు దండనాథుడైన కాటయవేముడు. అసహనాన్ని అణచిపెట్టుకొంటూ, చిరుదరహాసంతో రాజువంక చూశాడు. అతని దృష్టిమాత్రం లకుమపైనే ఉందని గమనించి, 'ప్రభూ!' అని పలకరించగా, పులకితుడైన వసంతరాయడు మంగళవాద్యాలు, వేద ఘోష, పెద్దల ఆశీర్వచనాల నడుమ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించమని ఆదేశించాడు.

రాజుకు ముందుగా కూర్చున్న పట్టమహిషి సభకు అలంకారంగా ఉన్నా ఆమె ముఖంలో చోటుచేసుకున్న గాంభీర్యం, దాని వెనుక అంతర్లీనమై, అవ్యక్తమైన బాధనుకూడా గమనించక పోలేదు. ప్రభుత్వపరంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని రాణికూడా ఆమోదించిందని భావించాడు కుమారగిరి. తాను మాత్రం ఉల్లాసంగా, ఉత్సాహపు పొలిమేరలు దాటిన సరససమ్రాట్టుగా వెలిగిపోతున్నాడు ఆ క్షణంలో.

సంగీత నృత్య శాస్త్రాల్లో ప్రావీణ్యం కలిగి తన మనోభావాలకు తగినట్లు ఆడి పాడగల నర్తకి రాజనర్తకిగా తన కొలువులో నెలవౌతున్నందుకు అతని ఆనందం అవధులు దాటింది. ప్రతిభకు పట్టంకట్టే భాగ్యం కలిగినందుకు మనసంతా పులకించింది. ఏవేవో ఊహాలోకాల్లో విహరిస్తున్న రాజుకు కాటయవేముడందించిన బంగారుపళ్లెం, పట్టు పీతాంబరంలో ఉన్న 'పట్టాన్ని అందుకొని, సభాముఖంగా లకుమాదేవికి బహూకరించాడు.

అప్సరసలను తలదన్నుతున్న అందచందాలతో కొద్దిగా తలవంచి ప్రభువుకు నమస్కరించింది. ఆమె కళ్లనుంచి ఆనందబాష్పాలు రాలాయి. సభకు కూడా నమస్కరించి తన కృతజ్ఞతాపూర్వక ఆనందాన్ని వ్యక్తపరచింది. కరతాళ ధ్వనుల మధ్య చిరునవ్వుతో కూర్చుంది లకుమ. కుమారగిరి ఒంటిలోని అణువణువూ ఆనందం ఆవరించి సంతోషంతో పులకించి పోయింది. గౌరవ సూచకంగా అందరూ లేచి నిల్చున్నారు. స్వస్తి వచనాలతోను, మంగళాశీస్సులతోను రాజనర్తకిగా లకుమ నియామకోత్సవం ముగిసింది. రాజు మదిలో ఉత్సాహం, ఉత్తుంగ తరంగంలా ఉరకలేసింది. లకుమసైతం ఆనంద డోలికల్లో ఓలలాడింది. రాణి మాత్రం నిమిత్తమాత్రంగా గడిపిందాక్షణం.

కుమారగిరికి నమస్కరించినపుడెల్లా, లకుమ కాళ్లకు గజ్జెకట్టి అతని నుత్తేజ పరచింది. నర్తిస్తున్న లకుమ పట్ల రాజుకు మోజు పెరిగింది. అభిమానం అనురాగంగా మారింది. కొత్తప్రేమ తొలకరించింది.

సరసుడు, కళాభిజ్ఞుడూ అయిన కుమారగిరి కొండవీటి నగరంలో ఎత్తైన ప్రాసాదాల్లో మేలైన పుష్పక జాతికి చెందిన గృహరాజసౌధాన్ని నిర్మించాడు. ప్రియురాళ్లతో విహరించడానికి కేళీరథాలను నిర్మించి, క్రీడా సరస్సులను తవ్వించాడు. వసంతోత్సవ రాజనర్తకి హోదాలో నివసించడానికి లకుమకు పలు అంతస్తుల భవంతిని కేటాయించాడు. సేవకులను నియమించాడు. వస్తు వాహన గాయక వాద్యగాండ్రను సమకూర్చాడు.

రాజు తన కోరికను పైకి వెల్లడించకున్నా అంతరంగాన్ని అర్థంచేసుకొన్న లకుమ మాత్రం తన హద్దులు మీరకుండా మసలుకొంటోంది. ఆమె నాట్యానికి స్పందిస్తూ, నర్తన శాలలో కానుకల నందిస్తూ అనేక బహుమానాలను ప్రకటించేవాడు. రాజమందిరం లోనూ, కొండవీటి ఉద్యానవనాల్లోనూ, కేళీ గృహాల్లోనూ విహరించే స్వేచ్ఛ ఉన్నా తన కలలరాణి, అంతరంగవాణి, నర్తకీమణి లకుమతో కొన్నాళ్లపాటు గడపటానికి తీర్థయాత్రల పేరిట రాజధానికి దూరంగా వెళ్లాలనుకున్నాడు.

అహోబలాన్ని సందర్శించి, నరసింహుని పూజించాలను కొంటున్నట్లు తెలిపిన కుమారగిరికి తగు ఏర్పాట్లను గావించాడు అతని మనసెరిగిన కాటయ వేమారెడ్డి. విషయం తెలుసుకున్న రాణి బెంగపడింది. తనదైనదేదో దూరమౌతున్నట్లు భావించింది. ఎగువ అహోబలానికి మెట్లుకట్టించిన తనతాత ప్రోలయ వేముని ఔదార్యాన్ని, అతడు చేపట్టిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలను కనులారా చూడాలనుకొంటున్నట్లు తెలిపాడు కుమారగిరి. దట్టమైన అడవి గుండా ప్రయాణించడం కష్టమని, ఈ ఒక్కసారికి తానొక్కణ్ణి వెళ్తున్నానని రాణిని బుజ్జగించాడు. చెప్పాడు. రెండు మూడు క్షణాలు మౌనంగా ఉన్న రాణి, తగు భద్రతా ఏర్పాట్లతో వెళ్లి త్వరగా తిరిగి రమ్మని నమస్కరించి వీడుకోలు చెప్పింది.

కొయ్యశిల్పానికి మారు రూపమన్నట్లు కొండవీటి వడ్రంగుల పనితనానికి మచ్చుతునకలుగా నిర్మించిన రెండు కేళీరథాలను సిద్ధపరచారు. ఉద్యాన, ఉపాంత వనాలనుండి తెప్పించిన వివిధ పుష్పాలతో, లతలతో మాలాకారులు అలంకరించారు ఆరథాల్ని. వసంతరాయని కిష్టమైన కర్పూరాది సుగంధ పరిమళాలను వెదజల్లారు. ఆవచి తిప్పయ విదేశాలనుంచి కుమారగిరి కోసం తెచ్చిన అగరు, జవ్వాది మొదలైన వాసన ద్రవ్యాలను రథాలచుట్టూ కట్టిన రంగురంగుల తెరలపై చల్లారు. ఆ రెండురథాలూ రతీమన్మథుల పూలవిమానాల్లా ఉన్నాయి. తెల్లటి గుర్రాలను పూన్చి యాత్రకు సిద్ధం చేశారు. కుమారగిరి వెంట నర్తకి లకుమ మాత్రమే వెళ్తుందనీ, రాణి కొండవీటే ఉంటుందని అంతఃపురంలో గుసగుసలు మొదలైనాయి.

రథాలు కొండవీటి నగర రాజవీధిన సాగిపోతున్నాయి. ఆ దృశ్యాన్ని పురజనులు మేడల్లోంచి తొంగితొంగి చూస్తున్నారు. రాజు కొరకు యువతులు, లకుమ కొరకు యువకులు పోటీపడి మరీచూస్తున్నారు. రథం మధ్యలో రాజు మన్మథునిలా కూర్చున్నాడు. వెనుక వస్తున్న రథాన్ని అందరూ కుతూహలంగా చూస్తున్నారు. ఆ రథం మధ్యలో రతీదేవిని పోలిన సుకుమార లావణ్యవతి లకుమా దేవి ఒద్దికగా అమరింది. అందాన్ని రాశిగా పోసినట్లుంది. వెంట్రుకలను కొప్పుగా సింగారంచుకొని లక్కదిద్దిన చెంపలు, చెవులకు స్ఫటికపు తమ్మెలు, మెడలో చంద్రహారాలు ముంగురులలో తారలు, పాపటలో చూడామణి, ఆమె అందాన్ని రెట్టింపుచేస్తున్నాయి, రాజులో ఉత్సాహాన్ని ఉరికొల్పుతున్నాయి.

లకుమ అందచందాలను చూచే భాగ్యం కలిగినందుకు ఆనందించిన కొండవీటి మగధీరులు, కుమారగిరికి ఆ సౌందర్యరాశి సొంతమైనందుకు కొంచెం అసూయ పడ్డారు. పురవీధులు దాటి రెండు రథాలు దూరంగా వెళ్లిపోయాయి. కొండవీటి నుండి దక్షిణంగా సాగింది ప్రయాణం. దారిపొడవునా ప్రకృతి కాంత అందచందాలను కనులారా చూచిన లకుమ పులకించిపోయింది. చెట్లూ, లతలూ, పొదలూ వారిద్దరినీ ఉల్లాస పరిచాయి. అహోబల ఆలయాన్ని సమీపించిన రాజు తన్మయంతో పులకితుడైనాడు. ఇద్దరూ ఎగువ అహోబలం గుడిముందరి కొండమీది నుంచి వొంపు సొంపులతో జాలువారే జలపాతంలో స్నానంచేశారు.

ప్రోలయ వేమారెడ్డి కట్టించిన మెట్లను ఒక్కొక్కటి ఎక్కుతూ అంతటి మహత్కార్యాన్నీ, యాత్రికులకు సౌకర్యాన్ని కలిగించిన తనతాత గురించి లకుమకు వివరించాడు ప్రభువు. ఇంతలో పూజా ద్రవ్యాలుంచిన పళ్లేలను రాజుకు, లకుమకు అందించారు పరిచారికలు. ఆలయ స్థానాధిపతి పూర్ణకుంభంతో స్వాగతమిచ్చాడు. పత్ర చిత్ర తోరణాలతో ఆలయ ప్రాంగణమంతా అలంకరించారు. కర్పూర వసంతరాయల అంతరంగ మెరిగిన అనుచరులు మండపంలో పరిమళద్రవ్యాల నుంచారు. అర్చన పూర్తికాగానే హారతిని స్వీకరించి కొంచెంసేపు అక్కడే విశ్రాంతి తీసుకొన్నారు. స్వామికీ, పూజారులకూ అనేక

దానాలను ప్రకటించాడు కుమారగిరిరెడ్డి. (చెంచు) లక్ష్మీనరసింహుల ఇతివృత్తాన్ని స్మరించుకొని ఇష్టం లేకుండానే ఇద్దరూ తమ తమ విడిది గృహాలకు చేరుకున్నారు.

మధ్యాహ్నం భోజనం ముగించుకొని, కుమారగిరిరెడ్డి లకుమను చేరుకున్నాడు. పరిచారికలు పక్కకు తప్పు కొన్నారు. తన మనోభీష్టం సిద్ధించినందుకు రాజు ఎంతో ఆనందభరితుడైనాడు. జీవితాంతం ఆమెతోనే గడపాలనుకొంటున్నట్లు లకుమకు తెలిపాడు. రాజనర్తకి పదవినిచ్చి సత్కరించిన విభునికి కృతజ్ఞతా పూర్వకంగా పాదాభివందనం చేసింది. అది తన భాగ్యమనుకొంది. ఆ అందాల బరిణె రెండు భుజాలను పట్టుకొని ఆప్యాయంగా పైకి తీసుకొని కౌగిలించు కున్నాడు కుమారగిరి. పక్క పక్కన కూర్చున్న వీళ్లిద్దరూ అరమరికల్లేని సంభాషణలు చేసుకున్నారు, ఊసులాడుకొన్నారు, మనసు విప్పి మాట్లాడుకొన్నారు, అవధులెరుగని ప్రేమను పంచుకొన్నారు. సాయం సమయం వరకూ సాగిన వారి ప్రణయ కలాపాలు, సందెవేళ గుడిగంటల శబ్దంతో ఆగిపోయాయి. మళ్లీ ఎవరి విడిదికి వారు వెళ్లారు.

రాత్రికి సింహాచల క్షేత్రానికి పయనం కట్టాలి. కుమారగిరికి తమకిష్టదేవతయైన అహోబిల నరసింహుని సన్నిధిలో రాజనర్తకి చేత నృత్యం చేయించి ఆ స్వామిని ప్రసన్నుని చేసుకోవాలని పించింది.

లకుమ కొద్దిసేపట్లో నృత్యాభినయానికి అలంకరణ చేసుకొని సమాయత్తమైంది. నట్టువాంగం మొదలైంది. అహోబలుని ఎదుట తన విద్యను ప్రదర్శించడం ఒక మహావకాశంగా భావించింది. నాట్యం పూర్తికాగానే సింహాచలానికి వెళ్లడానికి నరసింహుని వద్ద సెలవు తీసుకొన్నాడు. కదలిన రథాలు ఉత్తరంగా వారానికిపైగా ప్రయాణించి కృష్ణా, గోదావరి నదులను దాటాయి. కోనసీమ కొబ్బరిచెట్లు శిరస్సువంచి రాజును స్వాగతమిస్తున్నాయి. ఆంధ్రదేశంలో ప్రసిద్ధిగాంచిన ద్రాక్షారామాన్ని దర్శించాలనుకొన్నా రిద్దరూ లకుమ, కుమారగిరులు భీమేశ్వర, మాణిక్యాంబలను దర్శించడానికి వచ్చారని తెలుసుకొన్న పురకాంతలూ, యువకులూ ఆరాటంతో వీధిలోకి వచ్చారు. రథాలను అనుసరించారు. రాజును చూడాలనే తలంపు నవ వధువులకూ, లకుమను తిలకించాలనే కోరిక కోడెగాండ్రకూ కలిగింది. ఒకరినొకరు తోసుకుంటూ ముందుకు రావాలని పోటీపడుతున్నారు. ఒకరినొకరు ఒత్తుకొంటున్నారు. మునిగాళ్లపై లేచి రాజును, రాజ నర్తకిని చూశారు. తమ జన్మ ధన్యమైందనుకొన్నారు.

ఆ అందాల భామినుల ముఖారవిందాలను పరికిస్తూ పులకిస్తున్నాడు వసంత రాయలు. హావభావాలను ప్రదర్శిస్తున్న ఆ కాంతలను ఉగాది వసంతోత్సవాలకు రప్పించాలనుకొన్నాడు. లకుమ నృత్యాభినయాన్ని కనులారా చూసే భాగ్యం తమ కెప్పుడు కలుగుతోందనని దాక్షారామ యువకులు ఉరకలేస్తున్నారు. ఆలయ ప్రధాన ద్వారంగుండా ప్రాంగణంలోకి ప్రవేశించిన లకుమా కుమారగిరులు పరివార దేవుళ్లకు ప్రణమిల్లారు.

అతడు భీమేశుని దర్శించి స్తుతించాడు. లయకారుని మాయలుగుర్తొచ్చి మైమరచాడు. అప్పటికే వార్తతెలిసిన జాణలు లకుమ నాట్య విన్యాసాల్ని, అభినయ చాతుర్యాన్ని చూడాలనుకొని రాజనర్తకిని నాట్యమాడమన్నారు. రాజుకూడా ఆడమన్నాడు. ఆగమసంప్రదాయాలతో దైవసాన్నిధ్యంలో ఆలయ నర్తకి నాట్య మాడాలేగానీ, రాజనర్తకికి ఆ అర్హత లేదంటుంది లకుమ. రాజాజ్ఞగా స్వీకరించి నాట్యమాడాలని మళ్లీ ఆదేశిస్తాడు. సర్వజగదారాధకుడైన పరమశివుని ముందు అహంకరించడం తగదని రాజును వేడుకొంది. మళ్లీ మళ్లీ ఆజ్ఞాపించాడు.

ఒక్కసారి స్మృతిపథంలోనున్న గతంలోకి వెళ్లింది లకుమ. తనతల్లి బాపట్ల భావనారాయణస్వామి ఆలయ నర్తకీమణి. పల్లెను, తనను వదలి రాజనర్తకిగా కొండవీడు వెళ్లొద్దని వారించిన దృశ్యం కళ్లముందు మెదలాడింది. కుమారగిరి కొలువులో చేర్పించిన దోరపరెడ్డి మాటలకు ప్రభావితయై తప్పిదాన్ని తలచుకొని కంటనీరు బెట్టుకొంది. అపచారం చేయలేనని విన్నవించుకొంది.

తన తల్లి దేవదాసిగా తనకు తాను ఆలయానికి అర్పించుకొన్న సంప్రదాయ శీల. తానో భోగలాలసుడైన రాజును మెప్పించటానికి తన నాట్యాన్ని ప్రదర్శించ ఒప్పుకొన్న ఊహాలోకవిహారిణి. ఆనాడు సేనాని వెంట కొండవీటికి బయలు దేరినపుడు, తన కోసం దాచి ఉంచిన మాంగల్యం కూడా చూపించింది. హోదాకోసం సాదా జీవితాన్ని కాదనుకొన్న తాను అటు రాజు మనసు నొప్పించలేక, దాక్షారామ ఆలయ నర్తకిని ఒప్పించలేక బాధపడింది. సంప్రదాయంపట్ల లకుమకుగల గౌరవాన్ని గుర్తించిన రాజు సరిపుచ్చుకొన్నాడు. ఆ క్షణం నిశ్శబ్దంగా స్తంభించింది ఆలయ ప్రాంగణం. దాక్షారామ యువతీ యువకులు చేసేదిలేక నిరుత్సాహంగా తమ తమ ఇళ్లకు చేరుకొన్నారు.

తొలుత భీమేశునికి, తరువాత భూమీశునికి నమస్కరించటంతో సద్దు మణిగింది ఉత్కంఠత. లకుమ కాలి గజ్జెలను స్పృశించి, అంతటి గొప్ప నర్తకిని దర్శించినందుకు తమ జన్మధన్యమైందని ఉప్పొంగిపోయారు ఆలయ నర్తకీమణులు. తనతండ్రి కాపయరెడ్డికి, మాణిక్యాంబలకు రెండు అఖండ దీపాలను కానుకగా సమర్పించింది లకుమ.

అలకతోనున్న చెలికాని చెంతచేరింది లకుమ. రాజధిక్కారాన్ని మన్నించమంది. సమాధానపడని రాజును ఎలాగో ఒప్పించింది గోదావరీతీరసైకత సీమలో తాను నర్తనమాడటానికి. ఆనందపరవశుడైన రేడు చిటికెలో మునుపటి వాడయ్యాడు.

సింహాచలం దర్శించకనే కుమారగిరి కొండవీటికి చేరుకొన్నాడు. ఆనాడు కొండవీట వెల్లివిరిసిన వెన్నెలకాంతి పరిజనుల కళ్లలో తొణికిసలాడింది సంబరాల సంక్రాంతి. మేడలమీది నుంచి వడివడిగా దిగుతున్నారు యౌవనవతులు. వారి ననుసరిస్తున్నారు యువకులు. ఎదురేగి స్వాగతించాడు కాటయవేముడు. రాజువెంట నడిచింది లకుమ. దూరంగా నిల్చుండి చూస్తుండి పోయింది రాణి.

రాజు ప్రజాహితాన్ని మరచి వేశ్యాలోలుడైనాడని, పట్టపురాణిని నిర్లక్ష్యం చేస్తూ నాట్యగానాలతో కాలం వెళ్ల దీస్తున్నాడని, విజయనగర రాజుల కుతంత్రాలకు తోడు అంతఃపురంలో అసంతృప్తి ఛాయలు పొడచూపుతున్నాయని, కొండవీటిలో గుసగుసలు బయలు దేరాయి.

వసంతరాయలు పగలనక, రేయనక లకుమ నాట్యానికి లోలుడై తన ఊహల్లో కేరింతలు కొడుతున్న భంగిమలకు రూపకల్పనలు గావించాడు. నాట్యకళ పట్ల రాజుకున్న ఆదరణ, తనంటే అభిమానం వెలకట్టలేని లకుమ అతడు కోరినపుడెల్లా నాట్యం చేసింది. భావ ప్రకంపనలు వెల్లువకాగా వసంత రాజీయాన్ని రచించాడు రాజు. తన మనోవాంఛ తీరిందని, జన్మకు సఫలత చేకూరిందని తృప్తి పడ్డాడు.

ప్రభువు పరకాంతాలోలుడై రాచమర్యాదను కాలరాస్తున్నాడని కాటయవేముడు, మహారాణీ ఇద్దరూ బాధపడ్డారు. రాజును తిరిగి రాచకార్యాలవైపు మళ్లించడానికి పథకం పన్నారు. మహారాణి, లకుమ చెంతకు చేరింది. రాజు కొరకు, ప్రజల కొరకు రాజ్యం విడిచి వెళ్లమని తగు ఏర్పాట్లు చేస్తానని లకుమను బతిమాలింది. తనకంటే కొండవీటి ప్రతిష్ఠ, జనహితం ముఖ్యమని భావించిన లకుమ అలాగేనంది. చెమ్మగిల్లిన కళ్లను ఒత్తుకొని లకుమ మందిరంనుండి వెళ్లిపోయింది రాణి. కొంచెం సేపు బిత్తరపోయింది నర్తకీమణి.

తానులేని రాజు, రాజులేని తాను ఆ చిత్రమైన పరిస్థితిని ఊహించలేకుంది లకుమ. రాజుకు తన సౌభాగ్యం కంటే లక్షలమంది బాగోగులే ముఖ్యమనీ, అందుకు తాను దూరం కావటమే ఉచితమని తోచింది లకుమకు. ఆలయ నర్తకినైన తనకు ఆస్థాన నర్తకిగా ఉన్నతమైన హోదా, స్థానం లభించాయి. రాజుతో కూడా ఎంతో కాలం సన్నిహితంగా గడిపింది. తృప్తిగా తనువు చాలిస్తే చరిత్రలో స్థానముంటుందని భావించింది. తనకు బాగా గుర్తు రాజనర్తకిగా తన తల్లిని కలుసుకోవాలని బాపట్ల వెళ్లింది. ఆభరణాలతో అలంకరించుకొని దాసదాసీ జనంతో, రాజపల్లకిలో వచ్చిన తననుచూచి తన తల్లి ఆనందంతో ఉప్పొంగి పోతుందనుకొంది. ఆలయం ముందర తనను గుండెల కత్తుకొంటుందని ఆశపడింది. సంప్రదాయం పట్ల గౌరవమున్న తన తల్లి, ఒక నర్తకిగా ఆలయ ప్రవేశంచేస్తే తనకభ్యంతరం లేదనీ, ఆలయాన్ని వదిలి వెళ్లిన లకుమ స్థానంలో మరొకరిని నియమించుకొన్నారని కబురు పంపింది. కనీసం తన కోసం దాచిన మాంగల్యాన్నైనా ఇమ్మని ప్రాధేయపడింది. దాన్నికూడా ఆమె పెంపుడు కూతురుకిచ్చిన సంగతి తెలిసి కుమిలిపోయింది. ధ్వజస్తంభం వరకూ వచ్చి ఆగిన తల్లిని దూరంనుంచే చూచి నమస్కరించింది. తనను మన్నించమని భావనారాయణుని వేడుకొని వెనుకకు మళ్లింది. కని పెంచిన తల్లిని కాదన్నందుకు తనకు ప్రాయశ్చిత్తం లేదనిపించింది. అందుకే... ఈ కఠోర నిర్ణయం తీసుకుంది.

కేళీ గృహంలో ఒంటరిగా ఏదో ఆలోచిస్తున్న కుమారగిరికి ఎదురుగా వచ్చిన లకుమ వింతగా తోచిందా రోజు. రాజు ముఖంలో కూడా ఎందుకో ఆనందం తొలగి, ఆందోళన దోబూచులాడుతోంది. తెచ్చుకొన్న చిరునవ్వుతో ఆమె అభినయించింది. అప్పుడప్పుడూ ఆమె నడుమున బిగించుకొన్న వడ్డాణంలోని ఛురికను స్పృశిస్తుంది. రాజు ఆనందంలో మునిగిపోయాడు. నాట్యంలో హస్తాభినయం పతాక స్థాయికి చేరుకొంది. పరవశుడైన రాజు ఆనందంతో తలాడిస్తున్నాడు. లకుమకు మదిలో రాణికి తానిచ్చిన వాగ్దానం మెదిలింది. వేగంగా కదిలిస్తున్న ఒక చేత్తో ఛురికను తీసి తన కడుపులో గుచ్చుకొంది. రక్తపు చుక్కలు తన చెంపలపై బడటంతో తత్తర పడ్డ రాజు చకితుడై 'లకుమా', 'లకుమా' అని పిలుస్తూ సమీపించాడు. నడుమున చేతి నుంచుకొని పదతాడనం చేస్తున్న నర్తకి కూలిపోయింది. మరు నిముషంలో బిత్తర చూపులతో రాయని ఒడిలో వాలిపోయింది. చివరిసారిగా లకుమ 'ప్రభూ' అన్న శబ్దం రాజును కలచివేసింది. ఒకరికళ్లలో మరొకరు నిలిచారు నిముషంపాటు. రెప్పపాటులో శ్వాస విడిచింది లకుమ. తన కలల రాణి, వలపుల విరిబోణి ఇకలేదని తెలిసి విలవిలలాడాడు కుమారగిరి. ముందుగానే ఊహించిన కాటయ వేముడు రాజును ఓదార్చాడు. వార్త విన్న రాణి, అసమాన ప్రజ్ఞాశాలి అకాల మరణానికి తాను కారణమని వగచి వగచి విలపించింది. జనహితంగా, ఆ నర్తకి పేరు కొండవీట చిరస్థాయిగా ఉండాలని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించింది.

వసంతోత్సవాలను పునరుద్ధరించి, సంగీత నృత్య సాహిత్య సదస్సులలో ఉల్లాసంగా వినోదంగా కాలం గడుపుతున్న కుమారిగిరి ఈ విషాదఘడియలను ఊహించనైనా లేదు. తన కల కళ్లముందు కల్లగా మారుతుందని అనుకోనైనాలేదు. గృహరాజ సౌధం అలికిడి లేని చావడిగా మారింది. వసంతోత్సవ సంబరాలతో వెలిగిపోయిన కొండవీట విషాదం నిండింది. రాజు కళ్లల్లో చీకట్లు ముసురుకొన్నాయి. నిర్వీర్యుడై, నిశ్చేష్టుడైన రాజు గుణగణాలను వల్లిస్తూ, కాటయ 'కుమారగిరి రాజీయా'న్ని రచించాడు. కుమారగిరి కొడుకు అనపోతారెడ్డి అకాల మరణం అతనికి మరో పిడుగుపాటైంది, అసూయతో ఉబుసుపోని విధి తనను వెక్కిరించిందని కుంగిపోయాడు. తనకు అన్ని వేళలా ఆసట, బాసటగా నున్న కాటయ వేమునికి రాజమహేంద్రవర పాలన నప్పగించాడు. నిర్లిప్తంగా కొంతకాలం పాలించిన కుమారగిరి క్రీ.శ. 1402లో మరణించడంతో కొండవీడు రాజకీయం బీటలు వారింది. నిట్టనిలువునా రెండుగా చీలి కృష్ణానది హద్దుగా మారింది. కాటయ వేమునికీ, పెదకోమటి వేమారెడ్డికీ స్పర్ధలు పెరిగి కొండవీటి వైభవ, ప్రాభవాలు నిలిచిపోయిన జ్ఞాపకాల ప్రవాహంగా మిగిలి పోయాయి.

కుమారగిరిరెడ్డి చివరి రోజులు

కొండవీడు సింహాసన మెక్కినప్పటినుంచి కవితాగోష్ఠులు, సంగీత కచేరీలు, నృత్యహేళలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా కాలం గడిపాడు కుమారగిరిరెడ్డి. రాజుకైనా బతుకుబాట ఎగుడు దిగుడేనని, ఎదురైన కొన్ని చేదు అనుభవాలు రుజువు చేశాయి. మనసారా ప్రేమించిన లకుమాదేవి మరణం, అల్లారు ముద్దుగా పెంచుకొన్న ఆశాదీపం అనపోతారెడ్డి అణగారి పోవడం కుమారగిరిని కుంగదీశాయి. ఉత్సవ సంరంభంతో వసంత వేడుకల్ని జరిపించిన వసంతరాయనికి దెబ్బమీద దెబ్బ తగిలి గుండె పగిలిపోయింది.

కొడుకు అనపోతారెడ్డి చనిపోయిన తరువాత రాజమహేంద్రవర రెడ్డి రాజ్యశాఖకు తన మహాప్రధాని కాటయవేమారెడ్డిని అధిపతిగా చేశాడు కుమారగిరిరెడ్డి. ఇది నచ్చని పెదకోమటిరెడ్డి వర్గీయులు కుమారగిరికి వ్యతిరేకులైనారు. వరుస విజయాలను తెచ్చిపెట్టి కుమారగిరి అభిమానానికి పాత్రుడైన కాటయపై పెదకోమటి వేమారెడ్డి, అతని అనుచరులు అసూయ పెంచుకుని ఎప్పటికైనా దెబ్బతీయాలని నిర్ణయించుకొంటారు. తనకు అత్యంత ఆప్తుడూ, అన్ని విషయాల్లో సలహాలూ, సూచనలిచ్చే మహాప్రధాని కాటయవేముడు రాజమహేంద్రవరం వెళ్లటంతో కుమార గిరిరెడ్డి ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాడు. అదే సమయంలో రాజ్యంపై ముస్లింల దండయాత్ర, వెనువెంటనే వచ్చిన కరవు రాజును మరిన్ని ఇబ్బందులకు గురిచేశాయి. కంభంమెట్టు దగ్గర గజారావు తిప్పానాయని చాకచక్యంతో ముస్లిం దండయాత్రను తిప్పికొట్టడం కుమారగిరికి కొంచెం ఊరట కలిగించింది.

క్రీ.శ. 1399-1400 ప్రాంతంలో కుమారగిరి రాజ్యంపై కళింగ గజపతి కూడా దాడిచేశాడు. కుమారగిరికి నమ్మకమైన గొగ్గయదేవుడు పెద్ద సైన్యంతో వెళ్లి గజపతి సైన్యాన్ని సింహాచలం వద్ద జరిగిన యుద్ధంలో తిప్పికొట్టడం కూడా కొంచెం సంతోషాన్ని కలిగించింది. గొగ్గయదేవుని సర్పవరం శాసనం ఈ విషయాన్ని తెలియజేస్తుంది.

మునుపటి ఔన్నత్యాన్ని కోల్పోయి బలహీనపడిన కుమారగిరి విజయనగర రాజుల దాడిని కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. నెల్లూరు సీమలోని ఉదయగిరి రాజ్యాన్నేలుతున్న విజయనగర రాజు రామచంద్రరాయలు కుమారగిరి అధీనంలో నున్న కొండవీటి రాజ్యం

దక్షిణ భూభాగంలో కొంతమేరకు ఆక్రమించుకొని తన రాజ్యంలో కలుపుకొన్నాడు. యుద్ధంమీద యుద్ధం, కొండవీడులో సమన్వయంలేని అధికారులతో సతమతమౌతున్న కుమారగిరిరెడ్డి ఈ యుద్ధంలో మాత్రం గెలుపు సాధించలేక మిన్నకుండి పోయాడు.

ఇదే అదననుకొన్న కందుకూరు రెడ్డి రాజ్యశాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న మొదటి మాచారెడ్డి కొడుకు కుమార కోమటి రెడ్డి, కుమారగిరిరెడ్డి పాలనలో ఉన్న కృష్ణాతీరం వరకూ గల కోస్తా ప్రాంతాన్ని చెప్పాపెట్టకుండా ఆక్రమించుకొన్నాడు. ఏ మాత్రం విశ్వాసం లేకుండా దాయాదులైన కందుకూరిరెడ్లు చేసిన ఈ దుశ్చర్య కుమారగిరిరెడ్డి ఆధిపత్యానికి సవాలై కొండవీటి కోట బీటలు వారినట్లయింది. ఇన్ని బాధల్లో కూడా కుమారగిరిరెడ్డి తన దానగుణాన్ని మానుకోలేదు. కృష్ణాతీరంలో ఉన్న కొత్తూరు వద్దగల వసంతరాయ లక్ష్మీనరసింహ దేవాలయానికి క్రీ.శ. 1400వ సంవత్సరంలో కొంత భూమిని దానం చేసినట్లు చెబుతున్న అక్కడి శాసనమే కుమారగిరిరెడ్డి ఆఖరి శాసనం.

దురదృష్టాలన్నీ ఒక్కుమ్మడిగా వెంబడిస్తాయనే సామెత కుమారగిరి పాలిట రుజువైన నిజం. క్రీ.శ. 1402వ సంవత్సరంలో కోమటి వేమారెడ్డి కొండవీడు సింహాసనాన్ని ఆక్రమించటానికి గట్టి ప్రయత్నమే చేశాడు. దేశ విదేశాలలో వర్తక, వాణిజ్యాలను నెరపి, నట గాయక పండితులతో కీర్తింపబడిన దర్బారును కాపాడు కోలేని దుస్థితిని తట్టుకోలేక, కొండవీటిలో ఉండటానికి మనసొప్పక, మనశ్శాంతికోసం తనకు మరింత ఆప్తుడైన కాటయ వేమారెడ్డి దగ్గరకు వెళ్లాలని నిర్ణయించుకొని రాజమహేంద్రవరం చేరాడు కుమార గిరిరెడ్డి. ఎంతోమంది పండితుల్ని తనరాజ్యానికి రప్పించుకొని, వారిని మెచ్చుకొని ఎన్నో బహుమతులతో గౌరవించిన కుమారగిరి, ఎవరికో తన సొంత రాజ్యాన్నే వదలి వేరేచోటికి పోవాల్సిన దురవస్థ అతని అభిమానుల్ని, రాజ్యంలోని రైతుల్ని ఎంతగానో బాధించింది.

బావమరిది పంచన కొంతకాలం గడుపుదామని వచ్చిన కుమారగిరికి అక్కడ కూడా విధి వెక్కిరించింది. మానసికంగా కుంగిపోయిన రాజుకు ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. తన బాగోగులకు కారణభూతుడైన కుమారగిరి ఆరోగ్యం కుదుటపడ టానికి మంచి వైద్యులను రప్పించి చేయగలిగిందల్లా చేశాడు కాటయ వేమారెడ్డి. కుమారగిరి ఆరోగ్యం బాగుపడటానికని క్రీ.శ. 1402వ సంవత్సరంలో మకర సంక్రాంతి సందర్భంగా కాటయ కొన్ని దానాలను కూడా చేశాడు. అయినా లాభంలేక పోయింది. రోజు రోజుకీ ఆరోగ్యం క్షీణించి అదే సంవత్సరంలో కాటయవేముని సమక్షంలోనే కుమారగిరి కళ్లుమూశాడు. కర్పూర కళిక ఆరిపోయింది. "అమరావతికి సరిజోడు కొండవీడు" అని కీర్తింపబడిన కొండవీడు గత వైభవ ప్రాభవాలను ఒక్కసారిగా కోల్పోయింది. కొండవీటి నుండి కవులూ, కళాకారులూ, నాట్యగత్తెలూ, సంగీత విద్వాంసులూ ఒక్కొక్కరుగా వలస బోయారు. కొండవీడు బోసిపోయింది. సంగీత సరస్వతి మూగవోయింది. నటరాజు నర్తనం ఆగిపోయింది. ఒక శకం ముగిసిపోయింది.

కొండవీడులో పెదకోమటి వేమారెడ్డి

(క్రీ.శ. 1402 - 1420)

దాదాపు తిరుగుబాటే చేసిన పెదకోమటి వేమారెడ్డి, కోటలోని ఉన్నతోద్యోగులను, రాజవంశీకులను మంచి చేసుకొన్నాడు. మెల్లమెల్లగా తనపట్ల ఉన్న వ్యతిరేకతను పోగొట్టుకొన్నాడు. అంతఃకలహాలతో సతమతమౌతున్న విజయ నగర రాజులను ఆసరాగా తీసుకొని, ఇంతకుముందు వారు కాజేసిన భూభాగాన్ని పెదకోమటి వేమారెడ్డి తిరిగి స్వాధీనం చేసుకొని కొండవీడులో తన పాలన సుస్థిరం చేసుకోవటంలో కూడా విజయం సాధించాడు. అంతేకాక కొద్ది రోజుల క్రితం కొండవీడుకు చెందిన తెనాలి వరకూ గల ప్రాంతాన్ని ఆక్రమించుకొన్న కందుకూరు రెడ్డి రాజ్యశాఖకు చెందిన కోమటిరెడ్డి నుంచి తిరిగి స్వాధీనపరచుకొని కొండవీడుకు కొత్తకళను తెచ్చాడు.

ఒక్కొక్క ప్రాంతాన్ని కలుపుకొంటూ వస్తున్న పెదకోమటి వేమారెడ్డి రాజమహేంద్రవర రాజ్యాన్నికూడా కొండవీడు కిందికి తేవాలనుకొన్నాడు. అయితే ఈ కోరిక రెడ్డిరాజ్యం చిన్నాభిన్నం కావడానికి దారితీస్తుందని ఊహించలేక పోయాడు. దాంతో రాజమండ్రి పాలనా వ్యవహారాలను చూస్తున్న కాటయవేమారెడ్డితో తలపడటానికి సిద్ధమయ్యాడు. ఇందుకోసం రాజమహేంద్రవరం పశ్చిమప్రాంతాన్ని పాలిస్తున్న అన్నదేవచోడునితో చేయికలిపి వ్యూహరచన చేశాడు.

అదును చూచుకొని బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షాతో కలసి రాజమహేంద్రవరంపైకి దండెత్తివచ్చాడు పెదకోమటి వేమారెడ్డి. రాజమహేంద్రవరం రెడ్డిరాజ్య శాఖకు చెంది, కాటయవేమునికి కుడిభుజంగా నిలిచిన అల్లాడరెడ్డి ఆ దాడిని ఎదుర్కొని తిప్పికొట్టి రాజమహేంద్రవరం పరువు నిలిపాడు. ఈ సందర్భంగా వెలమలకు, రెడ్లకు మధ్య పొడచూపిన విభేదాలు బహమనీలకు, విజయనగర రాజులకూ, ఓడ్ర గజపతులకూ బాగా ఉపయోగపడ్డాయి. ఏది ఏమైనా ఈ యుద్ధ తంత్రాలకు రెడ్డి రాజ్య యోధులైన కాటయ వేముడూ, పెదకోమటి వేముడూ చివరికి బలికావాల్సి వచ్చింది.

పెదకోమటి వేమారెడ్డి గొప్ప విద్వాంసుడు, కవి. మునుపటి రెడ్డిరాజుల వలెనే అతడు కూడా ప్రజారంజకుడై, సాహిత్యాన్నీ, కళల్ని అవకాశమున్నంత వరకు ప్రోత్సహించాడు. సంగీత సాహిత్య నృత్య గ్రంథాలపై స్వయంగా వ్యాఖ్యానాలు రాశాడు. అంతటి ప్రతిభా విశేషాలుగల పెదకోమటి మరణంతో విజయనగర రాజులు విజృంభించి కొండవీడు సీమలో ఎక్కువ ప్రాంతాన్ని ఆక్రమించుకొన్నారు.

కొడిగట్టబోయే దీపంలా మిణుకు మిణుకు మంటున్న కొండవీటి సింహాసనంపైకి పెదకోమటి వేమారెడ్డి కొడుకు రాచవేమారెడ్డి క్రీ.శ. 1420వ సంవత్సరంలో వచ్చాడు. రాజ్యభారాన్ని ఏ మాత్రం మోయలేని రాచవేముడు ఖాళీ అయిన ఖజానాను నింపటానికి అనాలోచితం, అసంబద్ధమైన పన్నులు విధించి, ప్రజాకంటకుడుగా పేరు తెచ్చుకొన్నాడు. కేవలం నాలుగేళ్లు మాత్రమే పాలించిన రాచవేమారెడ్డి ప్రజలచేతిలోనే హత్యకు గురై బాగా కాసిన కాయల స్థానంలో కుక్కమూతి పిందె కాసినట్లు ఉజ్జ్వలంగా వెలుగొందిన ఒకప్పటి కొండవీటి రాజ్యానికి చరమగీతం పాడాడు. రెడ్డిరాజ్యం పూర్తిగా విజయనగర రాజుల వశమైంది. దాదాపు నూరేళ్లపాటు విజయగర్వంతో ప్రకాశించిన కొండవీటి రాజ్యకాంతులు చీకటి నాశ్రయించాయి.

గుంటూరు సీమ

ఏస కొంచెము లేని హృదయంగమం బైన సిసలైన తెనుగు రంజిల్లు చోటు
కట్టులో బొట్టులో కడమసీమల యందు నగ్రతాంబూలంబు నందుచోటు
ఆజానుబాహువులై కోరమీసాల మగవారు దండిగా మసలుచోటు
కంటికింపైన చక్కని అందగత్తియ లింటింట విద్యుత్తు లీనుచోటు

అవల పల్నాడు, కొండవీడివల నిలిచి
జననమెత్తిన చిఱుత బాలునకు గూడ
గురువులై వీరగాథలు గరపు చోటు
వీరభాషాభిరామ! గుంటూరు సీమ!!

– జాషువా

రెడ్డిరాజ్య శాఖలు

అద్దంకినుంచి కొండవీటికి పాకిన రెడ్డిరాజ్యప్రాభవం తూర్పు తీరంలోని కళింగం వరకూ వ్యాపించటానికి కృషిచేసిన మొదటి రెడ్డిరాజు అనపోతారెడ్డి. అప్పటి నుంచి గోదావరి – కళింగదేశాల మధ్య ప్రాంతం రెడ్ల అధీనంలోనే ఉంది. అనపోతారెడ్డి పాలనలోనే నెల్లూరు సీమకు చెందిన దువ్వూరి వంశీయులైన కాటయరెడ్డి కుటుంబీకులు రాజమహేంద్రవర బాధ్యతలను నిర్వర్తిస్తూ వచ్చారు.

కుమారగిరిరెడ్డి పాలనలో తూర్పు తీరంలో కొద్దికొద్దిగా అలజడులు పొడచూపాయి. సరైన నాయకుణ్ణి ఆ ప్రాంతంలో నియమించకపోతే ఆ ప్రాంతాన్ని కోల్పోవలసి వస్తుందని భావించాడు కుమారగిరిరెడ్డి. మంత్రిమండలి సూచన మేరకు క్రీ.శ. 1390లో కుమారగిరి కొడుకు రెండో అనపోతారెడ్డికి రాజమహేంద్రవరసీమ అధికారాన్ని అప్పగించి, అతనికి సలహాలనిచ్చి, రాజ్యం బాగోగులను చూడటానికి తనకు ముఖ్య సలహాదారు, మహాప్రధాని అయిన కాటయ వేమారెడ్డిని నియమించటంతో కొండవీటిరెడ్డి రాజ్యానికి రాజమహేంద్రవర శాఖ పుట్టుకొచ్చింది.

కొండవీటి సింహాసనంపై వసంతరాయనిగా వెలుగొందుతూ, అర్ధ సింహాసనం పై తన కొడుకును నిలిపి కొన్ని బాధ్యతల నుంచి తప్పుకొన్న కుమారగిరిరెడ్డి సంతోషానికి అవధులు లేవు. మునుపటి కంటే మిన్నగా సాహితీ చర్చలు, సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలు, విందులు, వినోదాలతో కొండవీడు పండుగలు చేసుకొంటుంది.

అదనుచూసుకొని విధి చక్రం తిప్పింది. సంతోష, సంరంభాలలో మునిగి తేలుతున్న కుమారగిరికి పిడుగుపాటులాంటి వార్త చెవినబడింది. తన ఒకే ఒక్క కొడుకు యువరాజైన రెండో అనపోతారెడ్డి రాజమహేంద్రవరంలో మరణించాడన్న వార్త అది. కుమారగిరి, అతని భార్య కుప్పకూలారు. అనుకోని ఈ శిక్ష వారిని తల్లడిల్ల జేసింది. కళ్లముందే కన్నకొడుకు మరణించటం భరించరాని బాధను మిగిల్చింది. కాటయవేముడు సైతం మూగవోయిన ఘటన అది. కుంగిపోయి, కుమిలిపోతున్న కుమారగిరికి కాటయ వేముడు బాసటగా నిల్చాడు. అనపోతారెడ్డి బాల్య చేష్టలను గుర్తుకు తెస్తూ రాజును ఓదార్చాడు.

పుత్రశోకంతో పరిపాలనా వ్యవహారాలను పట్టించుకోలేక పోతున్న కుమారిగిరి సంతాపాన్ని తానుకూడా పంచుకొని కష్టకాలంలో కూడా నేనున్నానంటూ వెన్నంటి ఉన్నాడు కాటయ వేమారెడ్డి. తనకు జరిగిన ఈ నష్టం ప్రజలకు కష్టం కలిగించ కూడదనుకొని కుమారగిరిరెడ్డి, కాటయ వేమారెడ్డిని రెండో అనపోతారెడ్డి స్థానంలో రాజమహేంద్రవర సింహాసనంపై కూర్చోబెట్టాడు. పూర్తి కాలం రాజకీయ కార్యకలాపాలకు సమయం వెచ్చించలేని కుమారగిరి బలహీనతను ఆసరాగా తీసుకొని కొండవీటి సింహాసనంపై కన్నేసి ఉంచిన ఇంటి దొంగల గురించి కలలోనైనా ఊహించలేక పోయాడు కుమారగిరి రెడ్డి. రాజకీయాల్లో బంధుత్వాన్ని, రక్త సంబంధాల్ని మరచిపోతే అధికార పిపాస కుమారగిరి సింహాసనానికే ఎసరుపెట్టింది.

అస్తవ్యస్తంగా ఉన్న కొండవీటిలో ఉండటానికి ఇష్టపడని కుమారగిరిరెడ్డి రాజమహేంద్ర వరానికి చేరుకొంటాడు. చేరిన కొద్దినాళ్లకే మరణిస్తాడు. కుమారగిరి రెడ్డి మరణించిన తరువాత కొండవీటి బాధ్యతలను నిర్వర్తిస్తున్న పెదకోమటి వేమారెడ్డికి, రాజమహేంద్రవరం బాధ్యతలు చూస్తున్న కాటయ వేమారెడ్డికి వైరం పెరిగింది.

కాటయ వేమారెడ్డి కొండవీటితో తెగతెంపులు చేసుకొని స్వతంత్రం ప్రకటించు కొన్నాడు. కాటయవేమునికి కుమారగిరి అనే కొడుకు, హరిహరాంబ, అనితల్లి అనే కూతుళ్లున్నారు. కుమారగిరి రెడ్డి (కర్పూర వసంతరాయలు) సోదరి దొడ్డాంబిక కాటయ వేమారెడ్డి భార్య. రాజమహేంద్రపుర శాఖకు చెందిన అల్లాడరెడ్డి కొడుకులు వేమారెడ్డి, వీరభద్రారెడ్లకు హరిహరాంబ, అనితల్లులనిచ్చి పెళ్లి చేశాడు.

కాటయ వేమారెడ్డి మరణించేటప్పటికి అతని కొడుకు రెండో కుమారగిరి రెడ్డి వయసు కేవలం పది సంవత్సరాలలోపే. రెండో కుమారగిరి రెడ్డిని సింహాసన మెక్కించిన అల్లాడరెడ్డి, కర్పూర వసంతరాయనికి కాటయ వేముని మాదిరిగా, అతనికి చేదోడు వాదోడుగా ఉంటూ రాజమహేంద్రవర రాజ్యాన్ని నడిపించాడు. దురదృష్టం వెన్ను చరుస్తుంటే రాజ్యం ముందుకెలా వెళ్తుంది? ఎవరూ ఊహించని సంఘటన ఒకటి చోటు చేసుకొంది. రెండో కుమారగిరిని కూడా విధి కబళించింది. అకాల మృత్యువు అతన్ని కాలసర్పమై కాటేసింది.

పదవీ వ్యామోహం, అధికార దాహాలు లేక అంకిత భావంతో రెడ్డిరాజ్యానికి సేవలందిస్తున్న అల్లాడరెడ్డి, రెండో కుమారగిరి రెడ్డి సోదరి అనితల్లికి రాజ్యాన్ని అప్పగించి రాజ్యభారాన్ని తాను కూడా మోయటానికి సిద్ధపడతాడు. రెడ్డిరాజుల పట్ల తనకుగల విశ్వాసాన్ని ఈ విధంగా ప్రకటించుకొన్నాడు.

ఇంతలో అన్నదేవచోడుడు, కోనసీమను ఆక్రమించుకోవటానికి కొద్దిపాటి సైన్యంతో దొడ్డిదారిన బయలు దేరాడు. ఎత్తుకు పై ఎత్తువేసిన అల్లాడరెడ్డి ఆ దాడిని ఎదుర్కొని తిప్పికొట్టి అనితల్లికి బాసటగా నిలిచాడు. అదే సమయంలో రాజమహేంద్ర పురరాజ్యాన్ని

సవాలుచేసిన ఓడ్రగజపతులను, విజయనగర రాజులను సమాధాన పరచి వారితో స్నేహ సంబంధాలను నెలకొల్పిన వ్యక్తి అల్లాడరెడ్డి. ఆ రెండు రాజ్యాలతో ఏ మాత్రం ముప్పురాకుండా చూసుకొన్నాడు. అంతేకాకుండా బంధుత్వాన్ని కూడా మరచిపోయి కయ్యానికి కాలుదువ్విన పెదకోమటి వేముని ఓడించి, పీచమణచిన ఘనతకూడా అల్లాడరెడ్డికే దక్కింది. రెడ్డిరాజ్య సుస్థిరతకు పాటుపడ్డ అల్లాడరెడ్డి క్రీ.శ. 1420లో చనిపోవడంతో రాజమహేంద్రవర రాజ్యం బలహీనపడింది.

పరిపాలనాదక్షుడు, సమర్థుడూ అయిన అల్లాడరెడ్డి మరణించిన తరువాత రాజమహేంద్రపుర రాజ్యాన్ని, అల్లాడరెడ్డి అన్న అనప్రోలారెడ్డి కొడుకులైన మూడవ కుమారగిరిరెడ్డి, మూడవ అనపోతారెడ్డి వశపరచుకొన్నారు. ఆర్భాటంగా సాగిన ఈ వ్యవహారం మూన్నాళ్ల ముచ్చటే అయింది. పాలనానుభవం లేని వాళ్లిద్దరూ మూడేళ్లు మాత్రమే పాలించగలిగారు.

అటు తరువాత అల్లాడరెడ్డి కొడుకు వేమారెడ్డి, గజపతితో ఒప్పందం కుదుర్చుకొని రాజమహేంద్రపుర రాజ్యంలోని కళింగ ప్రాంతాన్ని అతనికి అప్పగించి, అతని చేయూతతో రాజమహేంద్రపుర సింహాసనాన్ని కైవసం చేసుకొన్నాడు. శివలీలా విలాసంలో మాత్రం రాజమహేంద్రపురం సింహాసనంపై తన తమ్ముడైన వీరభద్రా రెడ్డిని వేమారెడ్డే కూర్చో బెట్టాడని చెప్పబడింది. క్రీ.శ. 1423లో సింహాసనమెక్కిన వీరభద్రారెడ్డి 25 ఏళ్లపాటు రాజ్యాన్నేలి, చివరి రోజుల్లో ఓడ్రగజపతులు, దేవరకొండ వెలమల పన్నాగాలకు బలై, రాజ్యాన్ని గజపతులకు అప్పగించాల్సొచ్చింది. కొండవీడు మాదిరిగానే రాజమహేంద్రపుర రాజ్యం కూడా తన దీప్తులను దిగమింగుకొని, మరుగున పడిపోయింది.

కందుకూరు శాఖ

కాకతీయ పతనానంతరం ఆంధ్రదేశంలో కొత్తగా ఏర్పడిన రాజ్యాల్లో రెడ్డి రాజ్యం ఒకటి. నెల్లూరి సీమలోని పాకనాటికి చెందిన ప్రోలయ వేమారెడ్డి అద్దంకిని రాజధానిగా చేసుకొని రెడ్డి రాజ్యాన్ని విస్తరించటానికి పూనుకొన్నాడు. అదే సమయంలో రెడ్డి రాజ్యంపై సాగిన ముస్లిం దండయాత్రను తిప్పికొట్టి, అన్నకు తోడుగా నిలిచినవాడు మల్లారెడ్డి. అంతవరకూ ఇతరుల పాలైన మోటుపల్లి ఓడరేవును తిరిగి స్వాధీనం చేసుకొని తన పరాక్రమాన్ని చాటుకొన్నాడు. కృతజ్ఞతా పూర్వకంగా ప్రోలయ తమ్మునికి నెల్లూరి సీమలోని కందుకూరు ప్రాంతాన్ని స్వతంత్రంగా ఏలుకోమని ఇచ్చాడు. అప్పటినుంచి కందుకూరును ముఖ్యపట్టణంగా చేసుకొని పాలించాడు మల్లారెడ్డి.

కందుకూరి రెడ్ల చరిత్ర తెలుసుకోవటానికి చుండి, పెదపూడి, లేపాక, టంగుటూరు, కందుకూరు, కొండమురుసుపాళెం, తమిళనాడులోని కంచికి సమీపంలోని దామల్‌వద్ద దొరకిన శాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. తెనాలి సమీపంలోని పెదపూడి వద్ద దొరకిన రాగిరేకు శాసనం కందుకూరి రెడ్ల గురించిన వివరాలను అందిస్తుంది.

అయితే అటు శాసనాల్లోగాని, ఇటు సమకాలీన సాహిత్యంలోగాని ఎక్కువగా కనబడేది మల్లారెడ్డి, పినకోమటిరెడ్డి, మాచారెడ్డి, అన్నారెడ్డి, శ్రీగిరి రెడ్లే. ఈ శాఖ ప్రతినిధులు నేటి నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల్లోని కొంత భూభాగాన్ని పాలించారు. తమిళనాడులో దొరికిన శాసనం ప్రోలయ వేమారెడ్డి తమ్ముడు, మల్లారెడ్డి మనుమడైన రెండవ రాచవేమారెడ్డి కొడుకు గణపతిరెడ్డికి చెందింది. బహుశా కంచిని సందర్శించిన సందర్భంలో గజపతిరెడ్డి పై శాసనాన్ని వేయించి ఉండొచ్చు. అంతేకాని అక్కడ వరకూ వీరిరాజ్యం విస్తరించిందని చెప్పటానికి వీలులేదు.

మల్లారెడ్డి తరువాత అతని మనుమడూ పినకోమటి రెడ్డి కొడుకూ అయిన శ్రీగిరిరెడ్డి కాలం నుంచి వీరు స్వతంత్రులుగా పాలించారు. వీరి శాసనాల్లో అద్దంకి కిచ్చిన ప్రాధాన్యం కొండవీడుకు లేకపోవడం గమనించాల్సిన విషయం. ఎందుకంటే అద్దంకి నుంచి పాలించిన ప్రోలయ వేముని తమ్ముడైన మల్లారెడ్డి అద్దంకి రాజధానిగా నున్నప్పుడే కందుకూరు సీమను పొందాడు కాబట్టి.

క్రీ.శ. 1398నాటి కందుకూరు శాసనంలో శ్రీగిరిరెడ్డి, పిన కోమటిరెడ్డి, గౌరాంబికల పెద్దకొడుకని చెప్పబడింది. రెడ్డి రాజన్యుల లాగే ఇతడు కూడా సాహితీ పిపాసి. సంగీత మకరందాన్ని తాగిన వాడు. చుండి శాసనం ఇతన్నొక కళాకారునిగా పేర్కొంటుంది. శ్రీగిరి అనే గురువును అనుసరించిన శ్రీగిరి రెడ్డి ఎన్నో వ్రతాలు, దానాలు చేయటమే కాక, సాగునీటికి, తాగునీటికి ఎన్నో చెరువులు తవ్వించి రైతు బాంధవుడనిపించు కొన్నాడు. 1398లో కందుకూరు రాజ్యంపై దండయాత్ర చేసిన బహమనీసుల్తాన్ ఫిరోజ్‌షా సైన్యాన్ని తరిమి కొట్టడంలో శ్రీగిరి రెడ్డి ప్రముఖ పాత్ర పోషించాడని పెదపూడి శాసనం పేర్కొంటుంది. అతనికి శ్రీగిరిరెడ్డి సోదరులైన మాచారెడ్డి, రాచవేమారెడ్డి సహకరించి ముష్కరమూకల్ని తోకముడుచుకొని పారిపోయేట్లు చేశారని కడప జిల్లాలోని టంగుటూరు (క్రీ.శ. 1406), లేబాక (క్రీ.శ. 1413) శాసనాలు వివరిస్తున్నాయి.

విజయనగరరాజైన రెండవ హరిహర రాయలు చనిపోగా సింహాసనం కోసం అతని కొడుకులు విజయనగర పాలనలో నున్న సిద్ధవటం, చంద్రగిరి సమీప ప్రాంతాలను, తరువాత కడప జిల్లాలోని పొత్తపినాడు, పులుగునాడులతోపాటు రాయచోటి కోటను ఆక్రమించుకొని కందుకూరు రాజ్యాన్ని విస్తరించి వశపరచుకొన్నారు. శ్రీగిరి సోదరుడు అన్నారెడ్డి, అతని కొడుకు మూడో మల్లారెడ్డి ఈ దండయాత్రల్లో పాల్గొన్నట్లు టంగుటూరు, లేబాక శాసనాలు తెలియజేస్తున్నాయి. శ్రీ గిరిరెడ్డి క్రీ.శ. 1406లో మరణించిన తరువాత కందుకూరు రాజ్యానికి అతని తమ్ముడైన రెండో మాచారెడ్డి కొడుకు రెండో కోమటిరెడ్డి రాజయ్యాడు. అతడు తీరాంధ్రలోని కొంత ప్రాంతాన్ని ఆక్రమించుకొన్నాడని పెదపూడి శాసనంలో ఉంది. అలాగే 'ఉదయగిరి సీమ'ను కూడా తన రాజ్యంలో కలుపుకొన్నాడు. రెండో కోమటిరెడ్డికి సోమేశరెడ్డి, శివలింగారెడ్డి అనే ఇద్దరు కొడుకులున్నారు. శివలింగారెడ్డి కుమారగిరిరెడ్డి మాదిరిగా సంగీత, సాహిత్యాల్లో పండితుడు. ఈ సమయంలోనే రెండో

కోమటిరెడ్డి పెదతండ్రి కొడుకు మల్లారెడ్డి చుండి నగరాన్ని వశపరచుకొని కందుకూరులోని జనార్దనస్వామి ఆలయానికి మండప, గోపుర, ప్రాకారాలను నిర్మించి భూములను దానం చేశాడు.

ఇంతలో పెదకోమటి వేమారెడ్డి మళ్లీ తీరాంధ్ర ప్రాంతంలోని కొంత భాగాన్ని వశపరచుకొనటంతో కందుకూరు రాజ్యం కొంత నష్టపోయినట్లు అతని అలపాడు, కసువుకుర్రు శాసనాలు తెలియజేస్తున్నాయి.

వ్యూహాత్మకంగా విజయనగర ప్రభువు మొదటి దేవరాయలు, క్రీ.శ. 1427 ప్రాంతంలో గతంలో తాము పోగొట్టుకొన్న ఉదయగిరి, సిద్ధవటం సీమలను చేజిక్కించుకోవటం చేత శ్రీగిరిరెడ్డి కుమారుడైన మూడో కోమటిరెడ్డి కాలంలో కందుకూరు విజయనగర సామ్రాజ్యంలో చేరిపోయింది. విజయనగర సామంతులుగా చుండి అధిపతులు 1430 వరకు కొనసాగినట్లు శాసనాధారాలున్నాయి.

తంగటూరు

చిట్వేలి కైఫీయత్తు (చిట్టివేలి)

అద్దంకి నగర శింహ్వాసనాధీశ్వరులయిన పైన వ్రాశ్ని చెన్నారెడ్డి - అన్నారెడ్డి-మల్లారెడ్డి గార్లు పొత్తపినాడు శీమ యేలినందు్క దాఖలా యేమంటె సదరహు తాలూకు మజుకూరులో మవుజే తంగటూరి గ్రామమందలి కైలాసేశ్వరుని ఆలయమునకు గర్భగుడికి తూర్పు పాతురాయిపైన శాసనము.

స్వస్తిశ్రీ శక వరుషంబులు ౧౩౨౮ (AD 1406) అగునేతి వ్యయ సంవత్సర మాఖ శు ౧౦ బుధవారం నాడు స్వస్తిశ్రీ జగనొబ్బ గండకేళాదిరాయ అనయ మండలిక రగండ - అళగియ వరద శిరః ఖండన - చంజిమల చూరకార అమరాభరణ రూపనారాయణ భుజబల భీమ పాండ్యరాయ గజకేసరి గుజరి దళవిబాళ - రాచూరి దుర్గ విబాళ వైందేర బసవ శంకర అద్దంకి నగర సింహ్వాసనా ధీశ్వర వేమారెడ్డిగారి తమ్ముడున్నూ పెరుమాళ్లరెడ్డి గారి పుత్రులున్నూ చెన్నారెడ్డి అన్నారెడ్డి మల్లారెడ్డి గార్లు తమ తండ్రిగారికి సుకృతము గాను పొత్తపినాటి లోను తంగటూరను కైలాసేశ్వర దేవరకున్నూ పున్నమినాటి తిరుణాళ్ల మహోత్సవాలకున్నూ యిరువై కుంటల భూమి మాన్యం యిచ్చినట్టుగా వ్రాశి వున్నది.

మెకంజీ కైఫీయత్తులు - కడప జిల్లా - నాలుగో భాగం, పేజి 157

ముద్రణ : సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం,
యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప. మార్చి 2007.

సేకరణ : కట్టా నరసింహులు

లేబాక

తరువాత మరికొన్ని దినములు్కు విజయనగర సింహాసనాధీశ్వరుండైన బుక్కరాయలు యితని కొమారుడు హరిహరరాయలు యితని కొమారుడు ప్రౌధ దేవ రాయలు యీ రాయిల రాజరికంలో అద్దంకి సింహాసనాధీశ్వరుండై అనవేమారెడ్డి మనుమడు మల్లారెడ్డి యీ ప్రదేశం యేలుతూ వుండి యీ గ్రామాన శివ కేశవులకు కొంత భూమిన్ని యిచ్చి చేయించిన కైంకర్యముల శాసనము వివరము.

గ్రామాన తూర్పు చెన్నకేశవస్వామి దేవాలయం గోపురాన్కు వెలుపట నిలువరాతి శాసనం.

స్వస్తిశ్రీ శకవర్షంబులు (1329) ౧౩౨౯ (క్రీ.శ. 1407) అగునేటి సర్వజిత్తు సంవత్సర జ్యేష్ట శుద్ధ 15కు సోమ గ్రహణ పుణ్యకాలమందు శ్రీమతు జగన్నొబ్బ గండరేడాది రాయ అనవేమరెడ్డి నిజకరగండ అప్పయగారి పృధివీ రాజ్యం చేయుచుండి ... మహాదేవరణ నోత్తుమ నారాయణ భుజబల భీమపాండ్యరాయ గజకేసరి పరిధర హేమాద్రి దాన చింతన జేసి యెన శ్రీమతి వేమారెడ్డి గారి మనమడు మల్లారెడ్డిం గారు తమ తండ్రి అన్నారెడ్డి గారికి సకృతంగాను లెంబాక ఖరవేశ్వర దేవరకు ౨౦ కుంటలు, చెన్నకేశవ దేవరకు మడి ౨౦ కుంటలు మహోత్సవాలకు పొలం సహా ఆచంద్ర స్థాయిగాను యిస్తిమి ఇది యెవ్వరయినా మానిపినన కపిల గోవును చంపినవాడు మంగళం మహాశ్రీశ్రీశ్రీ.

(A.P. Archieves R.No. 1134, p.200)

సేకరణ : కట్టా నరసింహులు

క్రీ.శ. 1325 ప్రాంతంలో ఆవిర్భవించిన రెడ్డి రాజ్యం క్రీ.శ. 1424 వరకూ, అటు తరువాత మరో పాతికేళ్లపాటు ఆంధ్రదేశంలో తనకంటూ ఒక స్థానాన్ని, చరిత్రనూ సృష్టించుకొని తరువాత తరాల వారికి ఆదర్శవంతమైంది.

రెడ్డిరాజుల తరువాత కొండవీడు

రాచవేమారెడ్డి తరువాత, కొండవీడు క్రీ.శ. 1424లో లాంగూల గజపతి వశము కాగా, అతడు కొండవీటి కొండపై పెద్దమాలెము కోట, చిన్నమాలెము కోటలను కట్టించి క్రీ.శ. 1431 వరకూ పాలించాడు. లాంగూల గజపతి తరువాత కొండవీడు, విజయనగర ప్రభువులైన నరపతులు ప్రతాపదేవరాయలు, హరిహరదేవరాయల (క్రీ.శ. 1431 నుంచి 1454) వశమైంది.

మారిన రాజకీయ పరిస్థితులవల్ల కొండవీడు మళ్లీ గజపతుల చేతి కొచ్చింది. లాంగూల గజపతి కొడుకు, కపిలేశ్వర గజపతి, క్రీ.శ. 1455లో కొండవీడును ఆక్రమించి గాణదేవుని రాజప్రతినిధిగ నియమించి క్రీ.శ. 1461 వరకూ పాలించాడు. తరువాత, అతని కొడుకు పురుషోత్తమ గజపతి (క్రీ.శ. 1462 నుంచి 1496) కొండవీడును తన అధీనంలో ఉంచుకొన్నాడు. పురుషోత్తమ గజపతి తరువాత ఆయన కొడుకు ప్రతాపరుద్ర గజపతి క్రీ.శ. 1497 నుంచి క్రీ.శ. 1515 వరకు పాలించాడు. ప్రతాపరుద్ర గజపతి కుమారుడు, వీరభద్ర గజపతి తండ్రికి పాలనా సహకారాన్నందిస్తూ కొండవీడులోనే నివసించాడు. ఇతని కాలంలోనే విజయనగర సమ్రాట్టు శ్రీకృష్ణదేవరాయలు తూర్పు దిగ్విజయయాత్రలో భాగంగా కొండవీడుపై దండెత్తాడు. క్రీ.శ. 1515 మార్చి 23న ప్రారంభమైన దాడి మూణ్ణెల్లపాటు సాగి క్రీ.శ. 1515 జూన్, 23వ తేదీన కొండవీడు శ్రీకృష్ణదేవరాయల వశమైంది.

కృష్ణరాయలు, కొండవీడును జయించిన తరువాత తిమ్మరుసు మేనల్లుడైన నాదెండ్ల గోపయ(న్న) మంత్రిని స్థానిక పాలకునిగా నియమించాడు. ఈ నాదెండ్ల గోపయమంత్రి కొండవీటిని క్రీ.శ. 1515 నుంచి క్రీ.శ. 1533 వరకూ పాలించాడు. ఇతడు కొండవీటిలో పరివార పట్టాభిరామ విగ్రహాలను ప్రతిష్ఠించాడు. ఇటీవల ఆ విగ్రహాలు బయటపడగా వాటిని కొండవీడు డెవలప్‌మెంట్ కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి పత్రికాముఖంగా ప్రకటించారు. శ్రీకృష్ణరాయల తరువాత కొండవీడు విజయనగర ప్రభువైన అచ్యుతదేవరాయని (క్రీ.శ. 1529–42) అధీనంలోకి రాగా, అతడు రామయ భాస్కరుడనే ప్రతినిధిని నియమించాడు. ఈ రామయభాస్కరుడే కొండవీడు కొండకింద సొలసవెళ్లే దారిలో కోట కట్టించి అందులో గోపీనాథునికి ఆలయం కట్టించి, ఆ ఊరికి గోపీనాథపురమని పేరు పెట్టాడు.

అచ్యుతరాయల తరువాత విజయనగర ప్రభువైన సదాశివరాయలు కొండవీడులో విఠలయ్యదేవరాయలు, కుమార కొండ రాజయ్యలను తన ప్రతినిధులుగ నియమించాడని దండకవిలె వివరిస్తుంది.

సదాశివరాయల తరువాత (క్రీ.శ. 1570–71) కొండవీడు గోల్కొండ ప్రభువైన ఇబ్రహీం కుతుబ్‌షా వశం కాగా, అతడు ముర్తుజాఖాన్ అను నతనిని కొండవీటి పాలకునిగా నియమించాడు. ఇతడు ప్రజలకు నచ్చని పనులుచేస్తూ, గోపీనాథపురాన్ని తనపేరిట మురుజానగర్ అని పేరు మార్చాడు. తరువాత జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా, పెనుగొండనుంచి పాలించిన అళియరామరాయని తమ్ముడగు తిరుమలరాజు

(క్రీ.శ. 1571-72) అధీనంలో కొచ్చిన కొండవీడు, పరాయిపాలన నుంచి బయటపడింది. తరువాత అతని కుమారుడైన శ్రీరంగ రాయలు, కొద్దికాలం రాజ్యంచేసిన తరువాత, అతని రెండో కొడుకు, రెండో రంగరాయలు కొండవీటి పాలకునిగా నియమించబడినాడు. కొండవీడులో ఇతని శాసనాలు మూడున్నాయి. రెండో రంగరాయలు, గొబ్బూరి తిమ్మరాజును కొండవీడులో తన ప్రతినిధిగా నియమించి పాలించాడు.

రెండో రంగరాయల కాలంలోనే కొండవీటికి వెలుగోటి తిమ్మన లేక తిమ్మప నాయుడు ప్రతినిధిగా క్రీ.శ. 1573 నుంచి 1579 వరకూ పాలించినట్లు తెలుస్తుంది. 1579లో గోల్కొండ ప్రభువైన ఇబ్రహీం ఖుతుబ్‌షా, రాయరావు నేతృత్వంలో దాడిచేసి, వెలుగోటి తిమ్మపనాయని జయించి కొండవీటి దుర్గాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. హైదర్‌ఖాన్‌ను కొండవీటి పాలకునిగా నియమించారు. రాయరావు కొండవీటి రెవెన్యూ అధికారిగా నియమింపబడినాడు. రాయరావు, గోపీనాథపురానికి మళ్లీ మురుజానగరని పేరుపెట్టి, కొండవీటిని 14 సముతులుగా విభజించి, బారాముత్సద్దీలనే ఉద్యోగులను నియమించారు. తరువాత రాయరావు గోల్కొండకు వెళ్లి పాలనలో రాజుకు సహకరించాడు. ఈ విధంగా కొండవీడు క్రీ.శ. 1590 వరకూ బారాముత్సద్దీల ఏలుబడిలో ఉండి, క్రీ.శ. 1591లో అమీనుల్‌ముల్క్ అధీనమైంది. ఇతడు కొండవీడుకు దగ్గరలోగల ముల్లగూరు, యాబలూరిపాటిలో కలిపి కొత్త గ్రామానికి అమీనాబాదు అను పేరు పెట్టాడు. ఇతని దుష్టపాలన తెలిసిన గోల్కొండ ప్రభువు ఖులీకుతుబ్‌షా, అమీన్‌ఉల్‌ముల్క్‌ను అధికారమునుండి తొలగించి, 1592లో ఇతబర్‌ఖాన్‌ను హవల్దారుగా నియమించాడు. తరువాత క్రీ.శ. 1598లో శిఖవస్‌ఖాన్ (సింఘిజ్‌ఖాన్ అని స్థానికులు పిలుస్తారు) ను కొండవీటి పాలకునిగా నియమించాడు. అతడు తన పేరిట శిఖవస్కాన్ పేటను కట్టించాడు. దీనినే శింగిస్కాన్ పేట అని పిలుస్తారు. ఇందులోనే వెన్నముద్ద వేణుగోపాలస్వామి దేవాలయముంది. తరువాత కొండవీడు అమీనులుగా, పరాస్‌ఖాన్ (క్రీ.శ. 1599-1601), అబుశిబ్దీబివులుల్‌ఖాన్ (క్రీ.శ. 1602), అసరస్‌ఖాన్ (క్రీ.శ. 1602-05), ఎక్లస్‌ఖాన్ (క్రీ.శ. 1602-05) వరకూ నియమింపబడినారని తెలుస్తుంది. క్రీ.శ. 1605లో గుంటుపల్లి ముత్తరాజయ్య అమీనుగా నియమింపబడి క్రీ.శ. 1623 వరకూ కొండవీడును పాలించాడు. తరువాత ఇతని కొడుకు భాస్కరుడు క్రీ.శ. 1623 నుండి 1628 వరకూ పాలించాడని (క్రీ.శ. 1614లో ముకుటీఖాన్ కొండవీటి అమీన్ అయినాడు. తరువాత జూపల్లి రంగపతి రావు కొడుకు రంగపతి రావు క్రీ.శ. 1616-18 మధ్య కొండవీడును పాలించాడని) దండెకవిలెలో ఉంది. తరువాత నిజాముల్‌ముల్క్

హైదరాబాద్ నవాబైన తరువాత కొండవీటి సీమకు ఖాజాబహదరుల్లా, మోతన్‌ఖాన్, బాలకృష్ణ అనేవాళ్లను అమీనులుగ నియమించగా కొండవీడు 1749 వరకూ ఈ ముగ్గురి పాలనలో ఉంది.

ఇదిలావుండగా 1690లోనే ఔరంగజేబు సేనానులగు రోహిల్లాఖాన్, బసరత్‌ఖాన్‌లు కొండవీటిపై అధికారాన్ని తమకు రాసిచ్చారని స్థానిక జమీందారులైన మాణిక్యారావు, మానూరివారు 1710లో తగాదాపడగా అప్పుడే గోల్కొండ సందర్శించి వస్తున్న ఆర్కాటు నవాబు పరిష్కరించి, కొండవీటి సీమను వారిరువురికీ పంచి యిచ్చాడు.

తరువాత గోల్కొండ ప్రభువైన నాజరజంగ్ బహదూర్ కాలంలో (క్రీ.శ. 1752) ఫ్రెంచివారు కొండవీడును బహుమతిగా పొందారు. ఫ్రెంచివారు పాత గుంటూరులో ఒక కోట గట్టుకొని కొండవీడునుంచి రాజధానిని పాత గుంటూరుకు మార్చుకొన్నారు. మళ్లీ క్రీ.శ. 1758లో కొండవీడు నిజాం వశమైంది. నాజర్‌జంగ్ తరువాత అతని తమ్ముడైన నిజామలీఖాన్ గోల్కొండ నవాబైనాడు. ఇతడు రజావేరుఖాన్‌ను కొండవీడు ఖిలేదార్‌గా పంపాడు. తరువాత పెళ్లూరి రామయ్య, అసదుల్లాఖాన్, తాతద్దీఖాన్, ఎక్లస్ ఖాన్‌లు క్రీ.శ. 1758 నుంచి 1786 వరకూ కొండవీడు అమీన్‌లుగా పాలించారు. హైదరాబాద్ నవాబైన బసాలత్‌ఖాన్ క్రీ.శ. 1788 సెప్టెంబర్‌లో ఒక ఒప్పందంలో భాగంగా, కొండవీటి సీమను ఈస్టిండియా కంపెనీవారికి అప్పజెప్పాడు. ఇంగ్లీషువారే కొండవీడును ఒక జిల్లాగా ఏర్పరచి, తరువాత తాలూకాగా మార్చి, జిల్లా కేంద్రాన్ని గుంటూరుకు మార్చారు. తరువాత, జమీందారీ వ్యవస్థ ఏర్పడి కొండవీడు ప్రాంతం మానూరి నరసన్నారావు (నరసరావు పేట ఇతని పేరుమీద ఏర్పడింది) అతని తమ్ముడు, శ్రీ వెంకటకృష్ణుని పాలనకింద క్రీ.శ. 1812 వరకూ ఉంది. 1794లో కొండవీటిసీమ గుంటూరు జిల్లాగా ఏర్పడింది. గుంటూరు జిల్లాను 1839లో పరిపాలనా సౌలభ్యంకోసం బ్రిటీషువారు కృష్ణాజిల్లాలో కలిపారు. తిరిగి 1904లో గుంటూరును ఒక జిల్లాగా ఏర్పాటు చేశారు. తద్వారా కొండవీడు బ్రిటీషు దొరల ఏలుబడిలో కొచ్చింది. తరువాత కొండవీడు తాలూకాస్థాయి కూడ కోల్పోయి, పట్టణంగానూ, అటు తరువాత గ్రామంగా మారింది.

కొండవీటి కోట

రెడ్డి రాజ్య స్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి అద్దంకి స్థలదుర్గం నుంచి పాలించిన రాజ్యాన్ని శత్రువుల బారి నుంచి కాపాడటానికి అప్పటికే ఉన్న కోటల్ని బలపరచి, కొన్ని కొత్త కోటలతో మొత్తం 84 కోటల్ని నిర్మించాడని పేరుగాంచాడు. వీటిలో చందోలు, కందుకూరు, ధరణికోట, కొండవీడు, బెల్లంకొండ, వినుకొండ, తంగెడ, కేతవరం, కొండపల్లి ముఖ్యమైనవి. వీటిలో కొండవీడు కోటను వ్యూహాత్మకంగా చుట్టూ ఉన్న కొండల మీద ఎక్కువ భాగం చదునైన ప్రదేశంగల ఒక కొండ చుట్టూ రాతి కోటగోడను నిర్మించాడు. పక్కనున్న కొండల నుంచి కూడా శత్రుసేనలు రాకుండా ఎత్తైన గోడలు నిర్మించి, ఈ కోటగోడకు కలిపాడు. తూర్పునున్న పుట్టకోట నుంచి, పశ్చిమానున్న కొండవీడు నుంచి కోటను చేరుకోవటానికి రాతిమెట్లను ఏర్పాటుచేసి కోటముఖద్వారాలకు కలిపాడు.



కోటగోడచుట్టూ పహారాకోసం అక్కడక్కడా బురుజులు నిర్మించాడు. కొన్ని బురుజుల దగ్గర సైనికుల మనో నిబ్బరాన్ని పెంచటానికి వారికిష్టమైన ఆలయాలను, మండపాలను నిర్మించాడు. కోటలోపల కనీస సైనికబలం నివసించటానికి ఇళ్లూ, ఇతర సాకర్యాలు కల్పించాడు.

కొండవీడు గిరిదుర్గపాలనా వ్యవహారాలను రెడ్డిరాజ్య సర్వ సైన్యాధ్యక్షుడు, తన తమ్ముడైన మల్లారెడ్డి, మరో తమ్ముడు అన్నారెడ్డి చూశారు.

ప్రోలయ వేమారెడ్డి తరువాత అద్దంకినుంచే పాలించిన అనపోతారెడ్డి కాలంలో రాజ్యానికి నాలుగు పక్కల నుంచి బహమనీలు, వెలమలు, విజయనగర రాజులు, కళింగ గాంగుల కవ్వింపులూ, దాడులూ పెరిగాయి. అనపోతారెడ్డి చివరిరోజుల్లో స్థలదుర్గమైన అద్దంకి నుంచి ఈ దాడులను తిప్పికొట్టడం సాధ్యం కాదని, తన రాజధానిని కొండవీడు గిరిదుర్గానికి మార్చాడు. తండ్రి నిర్మించిన కోటను బలోపేతం చేసి ద్వారాల నమర్చి, కోట గోడలవద్ద శత్రువుల నెదుర్కొనటానికి యంత్రాలను నెలకొల్పాడు. అంతేకాదు కోటలోపల రాజప్రాసాదాన్ని, ప్రధాన అధికారులకు, రక్షక భటులకు, సేవక సిబ్బందికి, అతిథులకు వసతి కల్పించి, రాజవీధుల్ని తీర్చిదిద్ది, మార్కెట్ యార్డుల్ని సైతం ఏర్పాటు చేశాడు. వచ్చిపోయే వారికేకాక, నిత్యమూ అక్కడే ఉండేవారి ఉల్లాసం కోసం కొండవీడుకోటలోపల చక్కటి పొదరిళ్లు, పూలమొక్కలతో ఉద్యాన వనాలను ఏర్పరచాడు.

అనపోతారెడ్డి తరువాత అతని తమ్ముడు అనవేమారెడ్డి కొండవీటి సింహాసనాన్ని అధిష్ఠించాడు. అనవేమారెడ్డికి కూడా శత్రువుల బెడద తప్పలేదు. కళింగ దండయాత్రలో ఇతడు అనేక కోటల్ని చేజిక్కించుకొన్నాడు. ఇతని కాలంలో కొండవీటికోట మరింత శోభాయమానమైంది. అనవేమారెడ్డి తరువాత అనపోతారెడ్డి కొడుకు కుమారగిరిరెడ్డి 1386లో కొండవీటిలో పట్టాభిషిక్తుడైనాడు. ఇతడు సాహితీ, కళాప్రియుడు కావటాన కొండవీట ప్రతిరోజూ కవులు, కళాకారుల సందడి ఉండేది. నాట్యమందిరాలు, సభామండపాలు సంగీత సాహిత్య నాట్య కచేరీలతో కళకళలాడుతుండేది. కుమారగిరిరెడ్డి తరువాత కొండవీడు ప్రాభవం కొద్దిగా సన్నగిల్లింది. అతని తరువాత రాచవేమారెడ్డి రాజైన క్రీ.శ. 1424 నుంచి పరరాజుల చేజిక్కిన కొండవీడు ఠీవిని కోల్పోయింది. కటకం నుంచి ఉదయగిరి వరకూ ఏలిన వీరు లాంగూల గజపతి (క్రీ.శ. 1420-31) కిందికి వచ్చిన కొండవీటి కోటకు కొన్ని మరమ్మత్తులు చేసి, పెద్దమోలెంకోట, చిన్నమాలెం కోటలుగా తీర్చిదిద్దాడు. తరువాత క్రీ.శ. 1432 నుంచి 1454 మధ్యకాలంలో విజయనగర పాలకుల కిందున్న కొండవీడు క్రీ.శ. 1455 నాటికి కపిలేశ్వర గజపతి స్వాధీనమైంది.

ఇతని కొడుకు వీరశ్రీ ప్రతాపపురుషోత్తమ గజపతి కొండవీడు నేలినట్లు క్రీ.శ. 1489 నాటి శాసనం వివరిస్తుంది. ఇతని కొడుకు వీరభద్రగజపతి క్రీ.శ. 1497 నుంచి కొండవీడును పాలిస్తూ ఉండగా రెండు నెలలకు పైగా యుద్ధంచేసిన శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1515వ సం॥ జూన్ 23వ తేదీన కొండవీటి దుర్గాన్ని ఆక్రమించి తన మహామంత్రి తిమ్మరుసు మేనల్లుడైన నాదెండ్ల గోపయను కొండవీటి పాలకుడుగా నియమించాడు. క్రీ.శ. 1521లో నాదెండ్ల గోపయ కొండవీడులో రఘునాయకుని పేర సీతా భరత శత్రుఘ్న హనుమంతుని సమేతంగా రాముని ప్రతిష్ఠించాడు. ఇటీవల కొండవీడు కోట తూర్పు ద్వారంనుంచి పుట్టకోటకు వెళ్లేదారిలో భూమిని తవ్వుతుండగా 2010 జనవరి నెలలో బయల్పడిన ఈ విషయాన్ని కొండవీడు డెవలప్‌మెంట్ కన్వీనర్ కల్లి శివారెడ్డి పత్రికాముఖంగా ప్రకటించాడు.

కృష్ణరాయల తరువాత విజయనగర సింహాసనమెక్కిన అచ్యుతరాయలు (క్రీ.శ. 1529-42) కాలంలో కొండవీటి పాలకునిగా నియమింపబడిన రామయ భాస్కరుడు, కొండ కింద పశ్చిమభాగంలో ఒక కోటకట్టించి, గోపీనాథునికి గుడిని కట్టించి, ఆ ప్రదేశానికి గోపీనాథపురమని పేరు పెట్టాడు. ఈ ఆలయమే కత్తులబావిగా పేరుగాంచింది.



గోపీనాథస్వామి దేవాలయం, కొండవీడు (తూర్పునుంచి)

కత్తుల బావి

కొండవీడు సందర్శించిన వారికి, కొండవీడు చరిత్ర తెలుసుకోవాలనుకొనే వారికి కత్తుల బావి ఒక ఆసక్తికరమైన విషయం. శాసనాధారంలేని ఈ కథ చాలా ప్రచారం పొందింది. తన అధీనంలోకొచ్చిన కొండవీడు రాజ్యంలోని 72 మంది పాలెగాళ్లు ఎదురు తిరిగి, ప్రజాకంటకులైనారనీ, వారి పీడ విరగడ చేసుకొనేందుకు గోపయమంత్రి యుక్తిగా గోపీనాథస్వామికి ఒక ఉత్సవాన్ని సృష్టించాడనీ, 72 మంది పాలెగాళ్లను ఆహ్వానించి ముందుగా వారు తూర్పుద్వారం నుంచి గర్భగృహంలోకి ప్రవేశించి, దర్శనమైంతర్వాత ఒక్కొక్కరూ, అర్ధమండపం తరువాతగల ఉత్తరం ద్వారం నుంచి బయటికెళ్లగానే ముందుగా తవ్వించి కత్తులునాటిన అగాధం లాంటి బావిలో పడతోచి వారందరినీ గోపయమంత్రి చంపించాడని, అప్పట్నించి దానికి కత్తుల బావి అనిపేరు ప్రచారంలోకొచ్చిందనీ కొండవీడు కైఫీయతులో ఉందే తప్ప ఇది ఎంత వరకు వాస్తవమో తెలియదు. మరో కథనం ప్రకారం గోపయమంత్రి, గోపీనాథస్వామి గర్భాలయం ముందున్న అర్ధమండపంలోనే లోతైన బావిని తవ్వించి కత్తులు నాటించి పాలెగాళ్లను అందులో పడదోయించి హతమార్చాడని కూడా చెప్పుకొంటారు. బాస్వెల్ అనే బ్రిటీష్ అధికారి 1870లో కొండవీడును సందర్శించినపుడు స్థానిక కరణం చెప్పిన వివరాలు మరోలా ఉన్నాయి. కొండవీటి కోటను స్వాధీనం చేసుకొన్న కృష్ణదేవరాయల అధికారాన్ని అంగీకరించని 72 మంది కొండవీటి (రెడ్డి) అధికారులను వదిలించుకోవటానికి బ్రాహ్మణ మంత్రికి ఆలయాన్ని నిర్మించటానికి సరిపడా ధనమిచ్చి, అందులో ఒక కొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠించే కార్యక్రమాన్ని



కత్తులబావిగా పేరుగాంచిన గోపీనాథస్వామి దేవాలయం, కొండవీడు (దిగువ)

ఏర్పాటు చేసి, కొండవీడు గిరిదుర్గం మీదున్న ఎదురు తిరిగిన రెడ్డి పాలెగాళ్లను ఆహ్వానించి, గోపీనాథస్వామి సభామండపంలో వేచి ఉండేట్లుచేసి, ఒక్కొక్కరికి దర్శనమయేట్లు చేశాడు. వీరు గర్భాలయం ముందుకెళ్లి మెడవంచి స్వామికి నమస్కరించేలోపు, అంతరాళంలో తవ్వి ఉంచిన బావిలో పడేట్లు చేయటానికి ఇద్దరు బలశాలులను నియమించాడని, ఇలా ఒక్కో రెడ్డిపాలెగాడు చొప్పున ఒకరికి తెలియకుండా ఒకరు చివరికి అందరూ బలైపోయారని ఉంది.

ఈ కథలో ఏమాత్రం నిజంలేదు. ఎందుకంటే గోపీనాథస్వామి ఆలయాన్ని నిర్మించింది కృష్ణదేవరాయలు తరువాత రాజైన అచ్యుతదేవరాయలి కాలంలోనని శాసనాధారం ఉందికూడా. ఏది ఏమైనా కత్తులబావికి చాలా ప్రచారం దక్కింది.

అచ్యుతరాయలి తరువాత కొండవీడు గోల్కొండ పాలకులైన కుతుబ్‌షాహీల చేతికి దక్కింది. మహమ్మద్ ఖులీఖుతుబ్‌షా, పాలనలో కొండవీడు కోటలోని కొన్ని భవనాలను మార్చి మరమ్మత్తులు చేయించాడు. ఇబ్రహీం ఖుతుబ్‌షా పాలనలో కొండవీటికి మురుజా అనే గవర్నరును నియమించి కొండవీడు పేరును మురుజాన్నగరు అని మార్చారు. అప్పట్నించి ఖుతుబ్‌షాహీల పాలనలో ఉంది. 1788 సెప్టెంబర్‌లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారి అధీనంలోకొచ్చిన కొండవీడు తరువాత ఉనికిని కోల్పోయింది.

కొండవీటి నుంచి మెట్లమార్గం గుండా కోటపైకెక్కి పశ్చిమ ద్వారంగుండా ప్రవేశించగానే నరసింహస్వామి ఆలయం, రాతిబోడుపై చెక్కిన ఆంజనేయ శిల్పాలు కనిపిస్తాయి. ఇంకా ముందుకు పోగానే ఫారెస్టు హౌస్ అని పిలువబడుతున్న రాజమందిరం కనబడుతుంది. దీనిని కాసు వెంగళరెడ్డి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఉన్నపుడు మరమ్మతులు



కొండవీడు పశ్చిమద్వారం (కొండపైన లోపలినుంచి)

నరసింహస్వామి దేవాలయం, కొండవీడు (కొండపైన)

ఫారెస్ట్ బంగళా, కొండవీడు (కొండపైన)

చేయించి కొంచెంసేపు గడపటానికి వీలుకల్పించాడు. బంగ్లాకు ఆగ్నేయంగా శిథిల శివాలయం, తరువాత ఎగువన మసీదు, అక్కడనుంచి కొంచెం ముందుకు వెళ్లగానే మరో నరసింహాలయం, విష్ణు ఆలయం, నాలుగు స్తంభాలమండపం, ముత్యాలమ్మ చెరువు, ఈ చెరువుకు ప్రారంభంలోనే వరాల (వజ్రాల) కొట్టు, మంచినీటిబావి ఉన్నాయి. ముత్యాలమ్మ చెరువుదాటగానే ఎడమవైపు ధనాగారం, కుడివైపు నేతికొట్టు, ఆయుధాగారం, ఏనుగుల కొట్టు, గుర్రాలకొట్టు, అనే భవనాలున్నాయి. మళ్లీ కొద్దిగా వెనక్కు రాగానే ప్రకృతి అందాలకు అద్దం పడుతున్న చూడచక్కని వెదుళ్ల చెరువు అందర్నీ ఆకర్షిస్తుంది. వెదుళ్ల చెరువునుంచి వెనుక్కు వచ్చి వజ్రాల కొట్టు దాటి తూర్పుగా వెళితే ఒక భూగృహము, రెండంతస్తుల మండపము, తూర్పుద్వార మండపము ఉన్నాయి.

కొండవీటి దుర్గాన్ని శత్రువుల బారి నుంచి రక్షించుకోవడానికి కీలకమైన ప్రదేశాలలో దాదాపు 23 ఎత్తైన బురుజులను నిర్మించారు. వాటిని చుక్కలకొండ, కోనేటయ్య, పెదతిరుపతయ్య, సజ్జామహల్, బొల్లమూరయ్య, పోతరాజు, కాట్రేటి, మిర్యాలచట్టు, పాముకుదురు, గంజికాలువ, జెట్టి, లేళ్ళకురువ, పడమటిగవిని, హనుమంతుని, వీరన్న, బ్రహ్మదేవుని, తిరుపతి, బొడంకొండ, మూలగూరమ్మ, తూర్పు కట్టెలదిడ్డి, ఆళ్ళవారి బురుజులుగా పిలుస్తారు. ఉత్తరాన చుక్కలకొండ బురుజు, ఆగ్నేయంగా జెట్టి బురుజు, దక్షిణాన నెమళ్ళ బురుజు, దీనికి ఉత్తరాన గల మిర్యాలచట్టు బురుజు కొండవీటి కోటపైగల ముఖ్యమైన బురుజులు.



శివాలయం, కొండవీడు (కొండపైన)



మసీదు, కొండవీడు (కొండమీద)

గుర్రాల కొట్టు, కొండవీడు (కొండపైన)

ధనం కొట్టు, కొండవీడు (కొండపైన)



నేతికొట్టు, కొండవీడు (కొండపైన)



వెదుళ్ల చెఱువు కొండవీడు (కొండమీద)



కోట బురుజు, కొండవీడు (కొండపైన)



తూర్పుద్వారం, కొండవీడు (కొండపైన లోపలినుంచి)

తూర్పు ద్వార మండపం నుంచి కిందికి దాదాపు 1 కి.మీ. దూరం మెట్లదారి ఉంది. అది దిగగానే ఒక రాతిగోడల కోనేరు, కింది రాతి కోట కనిపిస్తాయి. ఉత్తరంగా 1 కి.మీ. దూరంలో ఎత్తైన మట్టికోట, ద్వారపు శిథిలాలు, నంది, ఆంజనేయ, నాగరాజ,



తూర్పుద్వారం, కొండవీడు (కొండపైన బయటినుంచి)

పుట్ట (మట్టి) కోట, కొత్తపాలెం, కొండవీడు

గణేశ, చండి విగ్రహాలను చూడవచ్చు. ఇక్కడినుంచి మట్టికోటను చూచుకొంటూ, కొండవీడు, కొండవీటికోట గ్రామాలను చేరుకొని అక్కడున్న తిరుమల నరసింహ దేవాలయం, రామేశ్వరాలయాలను చూడవచ్చు. ఇక్కడినుంచి మెట్లద్వారా కొండవీటికోట పశ్చిమ ద్వారాన్ని చేరుకోవచ్చు. కొండవీటికోట గ్రామంనుంచి సొలస-నరసరావుపేట దారిలో 2 కి.మీ. దూరాన గోపయ మంత్రి నిర్మించిన కోట, గోపీనాధస్వామి దేవాలయం, దానిముందు ఎత్తైన దీపస్తంభాలు కనిపిస్తాయి. దానికి దక్షిణంగా నాదెండ్ల దర్వాజా, ఉత్తరంగా కొండపల్లి దర్వాజాలున్నాయి. అక్కడ్నించి దక్షిణంగా 3 కి.మీల దూరంలోగల చెంఘిస్‌ఖాన్‌పేట, శిఖవస్‌ఖాన్‌పేట లేక శింగిసాన్‌పేటలో అరుదైన, అందమైన విజయనగర కాలంనాటి వెన్నముద్దబాలకృష్ణుని విగ్రహాన్ని చూడటంతో కొండవీడు యాత్ర ముగుస్తుంది.

కొండవీడు చేరుకోవటానికి గుంటూరు నుంచి ఫిరంగిపురం వచ్చి అక్కడ్నించి 6 కి.మీ. ప్రయాణించగానే మట్టికోట (కొత్తపాలెం)కు ఎడమవైపుకు ఒకదారి చీలుతుంది. ఫిరంగిపురం-సొలసరోడ్డులో కొండవీడు, కొండవీటి కోట గ్రామాలకు చేరుకోవచ్చు. చిలకలూరిపేట - గుంటూరు రోడ్డులోని బోయపాలెం నుంచి, నాదెండ్ల నుంచి, నరసరావుపేట నుంచి కూడా కొండవీడు చేరుకోవచ్చు.

KODAVEEDU KOTA AREA



FORT AREA :75.48 Ha.,
CIRCUMFERENCE : 4072.83 Rmt

కొండవీటి రెడ్డిరాజులు


కామ భూపాలుడు
వేమ భూపాలుడు
ప్రోలయ కోమటిరెడ్డి
(భార్య అన్నమాంబ - దొడ్డయరెడ్డి కుమార్తె)
మాచారెడ్డి
ప్రోలయ వేమారెడ్డి
అన్నయ రెడ్డి
వేమసాని (దొడ్డ వేమసాని)
మల్లారెడ్డి
అన్నయరెడ్డి కుమారులను (2), కుమార్తెలను (1) దత్తత తీసుకొన్నాడు.
అనపోతారెడ్డి (భార్య మనుమాంబ)
అనవేమారెడ్డి
వేమాంబ (భర్త భీమలింగారెడ్డి)
దొడ్డాంబ (భర్త కాటయ వేమారెడ్డి)
కాటయ వేమారెడ్డి 2
కుమారగిరి రెడ్డి (కర్పూర వసంతరాయలు)
అన్నమాంబ (మల్లమాంబ) (భర్త కాటయ వేమారెడ్డి 2)
వీరాన్నపోతారెడ్డి (అనపోతారెడ్డి 2)
రెడ్డిపోత
పెద్ద కోమటిరెడ్డి
నాగారెడ్డి
పెద్దకోమటి వేమారెడ్డి
అమరుకి కావ్య వ్యాఖ్యాత
మాచారెడ్డి
రాచ వేమారెడ్డి

ఈమని శివనాగిరెడ్డి

దొడ్డయ రెడ్డి వంశము (పంట రెడ్లు)

(కొండవీటి రెడ్లతో వియ్యమందిన వంశము)

↓

దొడ్డయ రెడ్డి

↓

↓	↓	↓	↓
పోతయ రెడ్డి	చిన్నయరెడ్డి	అన్నమాంబ	నాగయ్యరెడ్డి
↓		(ప్రోలయ వేమారెడ్డి తల్లి)	(నాగసేనాని)
మాకా రెడ్డి			

రాజమహేంద్రవర రెడ్డి వంశము (పంట రెడ్లు)

(కొండవీటి రెడ్లతోను దువ్వూరి రెడ్లతోను వియ్యమందిన వంశము)

↓

కాటయరెడ్డి

↓

మారారెడ్డి

↓

కాటయ వేమారెడ్డి

(భార్య దొడ్డాంబిక - ప్రోలయ వేమారెడ్డి కుమార్తె)

↓

కాటయ వేమారెడ్డి 2

(భార్య మల్లమాంబ (అన్యమాంబ - అనపోతారెడ్డి కుమార్తె)

(రెండవ భార్య హరిహరాంబ - రెండవ హరిహరరాయల కుమార్తె)

↓

↓	↓	↓
కుమారగిరిరెడ్డి 2	హరిహరాంబ (భర్త వేమారెడ్డి)	అనితల్లి (భర్త వీరభద్రారెడ్డి అల్లాడ రెడ్డి కుమారుడు)

కందుకూరి రెడ్లు (దేసూటి రెడ్లు)

మల్లారెడ్డి
(ప్రోలయ వేమారెడ్డి సోదరుడు)

పిన కోమటిరెడ్డి
(భార్య గౌరాంబిక)

- శ్రీగిరిరెడ్డి → మూడవ కోమటిరెడ్డి
- మాచారెడ్డి → రెండవ కోమటిరెడ్డి (కుమార కోమటిరెడ్డి)
- అన్నారెడ్డి → రెండవ మల్లారెడ్డి
- రెండవ రాచవేమారెడ్డి → గణపతిరెడ్డి
  - సోమేశరెడ్డి
  - శివలింగారెడ్డి

దువ్వూరి పెరుమాళ్లు (పెరుమాంబ) రెడ్డి వంశము (పంట రెడ్లు)

(రాజమహేంద్రవర రెడ్డి రాజులతో వియ్యమందిన వంశము)

దువ్వూరి పెరుమాంబరెడ్డి

- అల్లాడరెడ్డి (భూపతిరెడ్డి, భార్య వేమాంబ)
  - వేమారెడ్డి (భార్య హరిహరాంబ)
  - వీరభద్రరెడ్డి (భార్య అనితల్లి, కాటయ వేమారెడ్డి కూతురు)
  - దొడ్డారెడ్డి
- పెద్దకోటారెడ్డి
- అనప్రోలారెడ్డి
- అన్నంరెడ్డి
- పినకోమటిరెడ్డి

శాసనాల నమూనాలు

THE *PUVVADA* PLATES OF *PROLAYA VEMA*

Third Plate: First Side



THE *PUVVADA* PLATES OF *PROLAYA VEMA*



A general view of the plates with the ring and seal


కోస్తా ఆంధ్ర
ముసాపది
కళింగము
గోదావరినది
వరంగల్లు
బహమనీరాజ్యం
గుల్బర్గ
రాచకొండ
వెలమరాజ్యం
దేవరకొండ
కొండవీడు
విజయనగరరాజ్యం
పెన్నానది
పదరవ్ ఇండియా
కాకతీయ సామ్రాజ్యం


కోస్తా ఆంధ్ర
కళింగ గాంగరాజ్యం
N
గోదావరి
ఇంద్రావతి
మంజీర
వరంగల్లు
ఎలమంచిలి
పిఠాపురం
గోలకొండ
రాచకొండ
కొమురవెల్లిమల్లన్న
దేవరకొండ
గణపేశ్వరం
పాకనాటు
ప్రోలయ వేమారెడ్డి పాలించిన ప్రాంతము
(క్రీ.శ. 1325 - 1353)
శివనాగిరెడ్డి

కొండవీటి రెడ్డి రాజ్యం


కోస్తా ఆంధ్ర
కళింగరాజ్యము
గోదావరి
ఇంద్రావతి
పెరుగడ
గోలకొండ
రాచకొండ
వెలమ రాజ్యం
దేవరకొండ
పానగల్లు
కొండవీడు
వినుకొండ
బెల్లంకొండ
అద్దంకి
మోటుపల్లి రేవు
కందుకూరు
నెల్లూరు
శ్రీకాకుళం
విశాఖపట్టణం
రాజమహేంద్రవరం
ఓరుగల్లు
పాకాల
పానగల్లు
పాకాల
కొండవీడు
వెలగపూడి
పిఠాపురం
అమరావతి
పూర్వ సముద్రం
అనపోతారెడ్డి పాలించిన ప్రాంతము
(క్రీ.శ. 1353 - 1364)
విజయనగర సామ్రాజ్యం
శివనాగిరెడ్డి


కోస్తా ఆంధ్ర
కళింగ గాంగరాజ్యం
గోదావరి
N
వరంగల్లు
ఒర్లాం
ఎలమంచిలి
సింహాచలం
గోలకొండ
పలకొండ
రాజమహేంద్రవరం
వాడపల్లి
ఏడదవోలు
ద్రాక్షారామం
వాసపల్లి
పిఠాపురం
కొండవీడు
శ్రీశైలం
అద్దంకి
చీరాల
మోటుపల్లి
కందుకూరు
తూర్పు సముద్రం
విజయనగర సామ్రాజ్యం
అనవేమారెడ్డి పాలించిన ప్రాంతము
(క్రీ.శ. 1364 - 1386)
శివనాగిరెడ్డి

కోస్తా ఆంధ్ర
ముసునూరి
కళింగము
విజయవాడ
N
గజపతులు
ఉయ్యూరు
ఓడ్డరి
పరుగండ్లు
బహమనీరాజ్యం
పాకనాడు
నిడదవోలు
గోలకొండ
కొండవీడు
రాజమహేంద్రి
పెనుగొండ
వెలమరాజ్యం
కొండవీడు
అమరావతి
త్రిపురాంతకం
మాచెర్ల
పెన్నేరు
కందుకూరు
నెల్లూరు
గూడూరు
కుమారగిరిరెడ్డి పాలించిన ప్రాంతం
(క్రీ.శ.1386 - 1402)
విజయనగరరాజ్యం
శివనాగిరెడ్డి

కొండవీటి రెడ్డి రాజ్యాలు



కొండవీటి ప్రశస్తి

దువ్వూరి రామిరెడ్డి

రెడ్లుగాపుట్టిన ఋణముతీర్చికొనంగ వీక్షించితిరె కొండవీటికోట?
తలచిన యంత చిత్తమున రోషము రేపు కత్తుల కూపంబు కాంచినారె?
రెడ్డివీరకుమార హృదయ రక్తంబుల తోగిన రణభూమి త్రొక్కినారె?
యాంధ్రశౌర్యేందిర కకలంక భూషణం బౌరెడ్ల చరిత విన్నారె? యన్న

లార, యూరక రెడ్డికులాన జన్మ
మెత్తితిమటన్న నాదాయ మేమిగలదు?
తల్లిమొగము నెఱుంగని తనయు లవత
రించియును లేనివారలే యెంచిచూడ!

ఘనసైన్యంబులకూర్చి, బాహుబల విక్రాంతి న్విశేషించి ప
ద్మ నృపాలాళికి గుండెగాలముగ, విద్యానాథులై కొండవీ
టను నద్దంకిని రాణ్మహేంద్రపురి కోటల్గట్టి శౌర్యంబునన్
మును బాలించిన రెడ్డిరాజుల యశంబుల్ నేటికిం గ్రాలవే?

మార్తుర రాజ్యరమామణుల్ చెఱపడి గోడుగుడిచిన చోటు కొండవీడు;
ఆంధ్రదేశమతల్లి యలికంబునం దాల్చు మందన తిలకంబు కొండవీడు;
కవితారసాలోల కల్లోలినిం దోగు పండితాధ్యుల నాడు కొండవీడు;
ఖండితారాతిరాణ్మండన మండితా ఖండలచాపంబు కొండవీడు;

అట్టివీటను బెన్గోట గట్టినట్టి
మేటిదిట్టలు మనతొంటి పోటరులెక!
నేటికిని రెడ్డి వీరుల నెత్తురచట
శౌర్యసౌరభ్యములు వెదజల్లుచుండు

అరివీరకంఠనాళాస్ర ప్రవాహంబు గవిసి త్రుప్పెత్తిన ఖడ్గధార;
భూగర్భమున రక్తపూరవిలీనమై విశ్రమించిన బాహువీర్య మహిమ;
కావ్యసంపుటబద్ధ గాథాశ్రయంబున గ్రుక్కిళ్ళువోవు నకుంఠకీర్తి;
బహుకాల విశ్లేషభరమున శోషిల్లి రమణవాసినయట్టి రాజ్యలక్ష్మి;

యింకనెప్పుడు పూర్వశౌర్యాంక సరణి
రెడ్డికులవీర దోర్బల శ్రీ సమాశ్ర
యంబుగాంచి వర్ధిల్లునో? యట్టి యదను
గల్గునో? మన కంత భాగ్యంబు గలదొ?

పోయిరి వీరభద్రు డనపోతమహీపతి వేమయోగియుం,
బోయెను మల్లరెడ్డికవి, పోయెను గాటయవేముడున్, రణా
జేయ కుమారవీరులును జెల్లిరి; రెడ్డికులంబు డొల్లయై
పోయెనటన్నలాఘవము పొందనిరీతి యశంబునిల్పుడీ!

కొండవీటి దుర్గంబున క్రుంకినట్టి
రెడ్డిసూర్యుండు కాళరాత్రిని తరించి
యభినవాంశుప్రసారంబు లలరుచుండ
తూర్పుదిక్కున నల్లదే తోచువాడు!

అనుమానంబొకయింతలేక గనుడీ, యావచ్ఛబాలార్కబిం
బ నవాంశుల్ ఘనమాల జీల్చికొని సైపన్రానికాంతిచ్ఛటం
గనులంగట్టు, ప్రబోధగీతము లుషఃకళ్యాణి తారస్వరం
బుననాలాపము సేయుచున్న యది పెంపుంబొందనుత్సాహముల్.

అరుగో! యూర్ధ్వపథంబునంగనుడు, దివ్యాకారముల్ దాల్చి కీ
ర్తి రమాకాంతులు, రెడ్డివీరులు రణోర్విన్ దేహముల్వీడి ని
ర్జరలోకంబునసౌఖ్యముల్ వొరయు స్వార్థత్యాగు, లానందని
ర్భరచిత్తంబుల పుత్రులంగనగ చేరన్వచ్చి మందారపు
ష్పరసౌఘాకుల బంభరారవ మిళ ద్భవ్యామలాశీ రవం
బురహింపన్ వెదజల్లువారలు సుమంబుల్ మోద బాష్పార్ద్రముల్.



వెదుళ్ల చెఱువు, కొండవీటికోట (కొండమీద)

నంది పుట్టకోట



కొండవీటి కోట తూర్పుద్వారం